




# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 1 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | ఆదివారం 21 సెప్టెంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


# చెత్త రాజకీయాలను ఊడ్చేస్తా



- రౌడీయిజం, నేరాలు చేస్తే ఊరుకునేది లేదు
- పల్నాడులో సీఎం చంద్రబాబు హెచ్చరిక
- మాచర్లలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం
- 2026 జూన్‌కు ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్
- ఉద్యమంలా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం
- స్వచ్ఛాంధ్ర సేవలో ఐదు కోట్ల మంది భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి పిలుపు
- చెరువు వద్ద చీపురు పట్టి చెత్త తొలగింపు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

"గత ప్రభుత్వం 85 లక్షల టన్నుల చెత్తను వదిలేసిపోయింది. చెత్తపై పన్ను వేసింది. మేం అధికారంలోకి రాగానే చెత్తపన్ను తొలగించాం. ఆ చెత్తను క్లీన్ చేసే బాధ్యతను తీసుకున్నాను. రాష్ట్రంలో చెత్తనే కాదు, చెత్త రాజకీయాలనూ క్లీన్ చేస్తా. రౌడీయిజం, నేరాలు, ఘోరాలు చేస్తే ఊరుకునేది లేదు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. శనివారం పల్నాడు జిల్లా మాచర్లలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. మాచర్ల చెరువు వద్ద పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ కార్మికులతో కలసి చీపురు పట్టి తొలగించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్‌ను 2026 జూన్ నాటికి ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని ప్రకటించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని ఉద్యమంలా అమలు చేస్తామని అన్నారు. స్వచ్ఛాంధ్ర సేవా కార్యక్రమంలో ఐదు కోట్ల మంది భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ ఫ్రీ నినాదాన్ని ఉద్యమంలా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. పచ్చదనం పెంపులో ప్రతీ పౌరుడు భాగస్వామి కావాలని కోరారు. మున్సిపల్ శాఖ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కలిసి పరిశుభ్రమైన నగరాలు, గ్రామీణ ప్రాంతాల కోసం పనిచేస్తున్నారని అన్నారు. గత పాలకులు వదిలేసి వెళ్లిన 85 లక్షల టన్నుల చెత్తను అక్టోబరు 2వ తేదీ కంటే ముందుగానే 100 శాతం క్లియర్ - మిగతా 2లో



## ఆత్మనిర్భరతే ఏకైక పరిష్కారం

- మన అతిపెద్ద శత్రువు..
- ఇతర దేశాలపై ఆధారపడటమే
- చిప్స్ నుంచి షిప్స్ వరకు స్వదేశీ
- ఉత్పత్తులకు పెద్దపీట వేయాల్సిందే
- గుజరాత్ పర్యటనలో మోదీ

6



## ఓట్ చోరీపై త్వరలో హైడ్రోజన్ బాంబ్

- రాహుల్ నోట మళ్లీ అదేమాట
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఓట్ చోరీ చేసి గెలిచారనడంలో ఎవరికీ సందేహం లేదు
- ఇందుకు సంబంధించిన సాక్ష్యాలతో కూడిన హైడ్రోజన్ బాంబును త్వరలోనే బహిర్గతం చేస్తాం
- తాను ఆధారాలు లేకుండా ఏదీ మాట్లాడు

# హెచ్-1బీ పిడుగు



- వార్షిక వీసా ఫీజు లక్ష డాలర్లకు పెంపు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన నిర్ణయం
- భారత ఐటీ ఉద్యోగులపై పెను ప్రభావం
- టెక్ కంపెనీల్లో కలవరం
- తక్షణం యూఎస్‌కు వచ్చేయాలంటూ ఉద్యోగులకు ఈ మెయిల్స్
- దీంతో విమానాశ్రయాల్లో రద్దీ
- భారీగా పెరిగిన విమాన టికెట్ రేట్లు
- ఈ నిర్ణయం కొత్త వీసాదారులకు మాత్రమే
- వివరణ ఇచ్చిన వైట్‌హౌస్
- ఈ గందరగోళాన్ని అమెరికా పరిష్కరిస్తుందని భావిస్తున్నాం: భారత్

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

అత్యుత్తమ నైపుణ్యాలున్న వ్యక్తులను అమెరికాకు రప్పించేందుకు హెచ్-1బీ వీసా పథకం తెచ్చాం. ఇది దుర్వినియోగం అవుతోంది. తక్కువ వేతనాలు, తక్కువ నైపుణ్యం ఉన్న వారు అమెరికాకు వస్తున్నారు. వీసా మోసాలకు, మనీలాండరింగ్ లాంటి కార్యకలాపాలకూ ఈ పథకం వేదికవుతోంది. ఉత్తర్వులో ఏముందంటే... అమెరికాలోకి ప్రవేశించే హెచ్1-బీ వీసాదార్ల పిటిషన్లను నియంత్రిస్తున్నాం. నిబంధనలకు లోబడి లక్ష డాలర్లు చెల్లించిన వారి పిటిషన్లను అనుమతిస్తాం. ఈ నిబంధనలు అమెరికా కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి దాటాక 12.01 గంటల నుంచి ఏడాది పాటు అమల్లో ఉంటాయి. ప్రస్తుతం అమెరికా బయట - మిగతా 2లో

## 60 రోజుల్లో దేశం విడిచి వెళ్లండి

- సిరియా వలసదారులకు అమెరికా ఆదేశం
- సిరియా వలసదారులకు కల్పిస్తున్న తాత్కాలిక రక్షణ హోదాను రద్దు
- 2012 నుంచి దాదాపు 6 వేలకు పైగా సిరియా వలసదారులు ఈ రక్షణ పొందుతున్నట్లు అంచనా.
- లేదంటే అరెస్టులు చేస్తామని హెచ్చరిక

6

# పరకామణిలో చోరీపై రాజీనా

- హైకోర్టు అభ్యంతరం
- లోక్ అదాలత్ ఉత్తర్వులు సస్పెండ్
- రికార్డులన్నీ స్వాధీనం చేసుకోండి
- సీఐడీ ఐజీకి న్యాయమూర్తి ఆదేశం
- తదుపరి విచారణ అక్టోబరు 13కి వాయిదా




**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ పరకామణిలో జరిగిన అవకతవకలపై హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పరకామణి నుంచి నగదు అపహరణపై ఫిర్యాదు చేసిన టీటీడీ అప్పటి అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి సతీశ్‌కుమార్, నిందితుడు రవికుమార్‌తో లోక్ అదాలత్ వద్ద రాజీ చేసుకోవడాన్ని తప్పుబట్టింది. విస్తృత ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని 2023 సెప్టెంబరు 9న లోక్ అదాలత్ ఇచ్చిన ఉత్తర్వులను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. తాము తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఇవి అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. కేసులో సీఐడీ ఐజీని సుమోటోగా ప్రతివాదిగా చేర్చింది. ప్రస్తుత కేసుతో ముడిపడి ఉన్న తిరుమల 1వ పట్టణ - మిగతా 2లో

# ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు, బదిలీలు



- ఏపీ జెన్‌కో ఎండీగా ఎస్.నాగలక్ష్మి
- ఎక్సైజ్, ప్రొహిబిషన్ డైరెక్టర్‌గా చామకూరి శ్రీధర్
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

2



## మూడు విభాగాల్లో రాష్ట్రానికి స్కోచ్ అవార్డులు

- పోటీ పరీక్షల్లో బీసీ యువతకు ఉచిత శిక్షణకు అవార్డు అందుకున్న మంత్రి సవిత
- డిజిటల్ టికెట్ల జారీ ప్రక్రియకు ఆర్టీసీకి.. పేదరిక నిర్మూలనలో విశిష్ట సేవలకు మెప్మాకు పురస్కారాలు

2

# చెత్త రాజకీయాలను ఊడ్చేస్తా



-మొదటిపేజీ తరువాయి

చేశామని తెలిపారు. ఈ లక్ష్య సాధనలో సమర్థంగా పనిచేసిన పారిశుధ్య కార్మికులు, మున్సిపల్ శాఖ ఉద్యోగులు, అధికారులు, ఆ శాఖ మంత్రి నారాయణకు అభినందనలు తెలిపారు. "పిల్లలకు, వృద్ధులకు హాస్టళ్లు పెట్టాం. ఇక నుంచి పశువులకు వసతి ఏర్పాటు చేస్తాం. షెడ్లు వేసి పశువులను వాటిలో ఉంచి గ్రాసం అందిస్తాం. ఈ పథకానికి త్వరలోనే శ్రీకారం చుట్టబోతున్నాం" అని అన్నారు.

**స్వచ్ఛాంధ్ర అవార్డులు**

"సర్క్యులర్ ఎకానమీలో భాగంగా చెత్త నుంచి సంపద సృష్టిస్తాం. చెత్త నుంచి కరెంటు, కంపోస్టు తయారు చేస్తున్నాం. కొంత చెత్తను రీ సైక్లింగ్‌కు పంపిస్తున్నాం. డోర్ టు డోర్ కలెక్షన్ కోసం ఎలక్ట్రికల్ వాహనాలు ప్రవేశపెడుతున్నాం. ఇప్పటికే విశాఖ, గుంటూరులో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు పనిచేస్తున్నాయి. త్వరలో రాజమండ్రి, నెల్లూరు, కడప, కర్నూలులో కొత్త ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలి. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు స్వచ్ఛతా హీ సేవా ప్రచారం నిర్వహిస్తున్నాం. పారిశుధ్య కార్మికుల కోసం ఆరోగ్య, సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. పట్టణ పారిశుధ్య కార్మికులు ఒక్కొక్కరికి రూ.కోటి బీమా పథకాన్ని ప్రారంభించాం. 16 విభాగాల్లో 52 రాష్ట్రస్థాయి, 1,421 జిల్లాస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డులు ప్రదానం చేస్తున్నాం. అక్టోబరు 2వ తేదీన సఫాయి మిత్రలు, అగ్రస్థానంలో నిలిచిన మున్సిపాలిటీలు, స్వచ్ఛ వలంటీర్లను ఆయా జిల్లాల కలెక్టర్లు సత్కరించాలి" అని చంద్రబాబు అన్నారు.

**ఆడబిడ్డలకు ఎన్నో కార్యక్రమాలు**

"కూటమిని 94 స్ట్రయిక్ రేట్‌తో గెలిపించారు. అది ప్రజలు చూపించిన చొరవ. అభివృద్ధి చేస్తానని చెప్పాను. ఆదాయాన్ని పెంచుతాను. అదే సమయంలో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాను. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయింది. ఆడబిడ్డలకు తల్లికి వందనం అమలు చేశాను. ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇచ్చాం. గత ప్రభుత్వంలో ఎంతమంది ఉంటే అంతమంది పిల్లలకు ఇస్తానని మోసం చేసి, ఒక్క పిల్లవాడికే ఇచ్చారు. ఇప్పుడు ఇంటిలో ఏడుగురు పిల్లలు ఉంటే ఆ ఏడుగురికి తల్లికి వందనం వచ్చిందని చెబితే నేను చాలా అనందపడ్డాను. జనాభా తగ్గిపోతూ ఉంది. పిల్లలు భారం అనుకుంటున్నారు. అందుకే రూ.15,000 ఇవ్వడమే కాకుండా ఆ పిల్లల పెంపకంలో ప్రభుత్వం కూడా భాగస్వామిగా ఉంటుంది. రాబోయే రోజుల్లో పిల్లలే ఆస్తి. 65 లక్షల మంది పిల్లలకు 10 వేల కోట్ల రూపాయలు డీబీటీ ద్వారా ఇచ్చిన కార్యక్రమం తల్లికి వందనం. ఆడబిడ్డలకు స్త్రీశక్తి పథకం ద్వారా ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించాం. మహిళలు పనులకు ఉచితంగా వెళ్లే పరిస్థితి కల్పించాను. డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశాం. ఆడబిడ్డ సంరక్షణ పథకాన్ని అమలు చేశాం. మహిళల కోసం అనేక కార్యక్రమాలు ఇచ్చాం. ఉద్యోగాలు, విద్యలో ఆడబిడ్డలకు 33 శాతం రిజర్వేషన్ తీసుకొచ్చాం. నిన్నటి వరకు 50 శాతానికి పరిమితమైన అభివృద్ధి వంద శాతం సాధించే పరిస్థితి వచ్చిందంటే దానికి ఆడబిడ్డల కృషి ఉంది. మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇస్తున్నాం" అని చంద్రబాబు అన్నారు.

**పేదలకు ఎంతో సంక్షేమం**

"రైతులందరికీ అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేలు అందిస్తాం. పైసా అవినీతి లేకుండా 16,347 మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత మా ప్రభుత్వానిది. నైపుణ్యాభివృద్ధి ద్వారా లక్ష మందికి ఉద్యోగాలు ఇచ్చాం. రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. మరో తొమ్మిది లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. నెలకు రెండు రోజులలో.. ఒకటి స్వచ్ఛాంధ్ర కార్యక్రమం, రెండోది పేదల సేవలో పాల్గొంటా. కొంత మంది మాటలు చెబుతుంటారు.. ఏమీ అమలు చేయరు. ఎటువంటి చరిత్ర ఉండదు. చరిత్ర రాయాలన్నా.. చరిత్ర తిరిగి రాయాలన్నా నాకే సాధ్యం' అని అన్నారు.

**త్వరలో సంజీవని ప్రాజెక్టు**

"ప్రజలు మానసిక అనారోగ్యానికి గురవుతున్నారు. యోగా డే ద్వారా 30 రోజులు యోగా శిక్షణ ఇచ్చాం. 3.20 లక్షల మందితో విశాఖలో నిర్వహించిన యోగా రికార్డు సాధించింది. త్వరలోనే సంజీవని ప్రాజెక్టును ప్రారంభిస్తున్నాను. యూనివర్శల్ హెల్త్ తీసుకొస్తాను. దీనిలో ధనిక, పేద తేడా లేకుండా అందరికి రూ 2.50 లక్షల బీమా చేయిస్తాం. పేదవారి అందరికీ ఎన్టీఆర్ వైద్య సేవ కింద రూ.25 లక్షల వరకు ఆరోగ్య ఖర్చు ప్రభుత్వం భరిస్తుంది. నాడు హనుమంతుడు సంజీవని ఔషధం తీసుకొచ్చి లక్ష్మణుడుని కాపాడారు. పేదల ఇంటి దగ్గరనే వైద్యం అందించే విధంగా సంజీవనిని అమలు చేయబోతున్నాం. 2047కు ఏపీలో 50 శాతం గ్రీన్ కవర్ ఉండాలన్నదే లక్ష్యం. రానున్న నాలుగే?ళ్లలో 31 నుంచి 37 శాతానికి గ్రీన్ కవర్ పెంచాలి. స్వచ్ఛమైన గాలి కోసం చెట్లు పెంచే బాధ్యత మనందరిది" అని చంద్రబాబు అన్నారు.

**మాచర్లకు చంద్రబాబు వరాలు**

"చాలా కాలం తర్వాత మాచర్లకు స్వాతంత్ర్యం వచ్చింది. ఎన్నికల ముందు వరకు మాచర్లలో ప్రజాస్వామ్యం లేదు. గతంలో ఇక్కడ చాలా అరాచకాలు జరిగాయి. రాయలసీమలో ముఠాలు లేకుండా చేశాను. పల్నాడులో ఖబడ్దార్ జాగ్రత్తగా ఉండండి.. రౌడీయిజం చేస్తే ఊరుకునేది లేదు. చరిత్రలో నియంతలకు పట్టిన గతే ఇక్కడి నేతలకు పట్టింది. ఇకనైనా ఆ నేతలు పద్ధతులు మార్చుకోకపోతే వారిని ప్రజాస్వామ్యం క్షమించదు. మాచర్లను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం. పల్నాడు జీవనాడి వరికపూడిశెల.. 60 ఏళ్ల చిరకాల కోరికను సఫలీకృతం చేసే బాధ్యత తీసుకుంటాను. 1.25 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. ఇక్కడకు మిరప బోర్డును తీసుకొచ్చే ప్రయత్నం చేస్తా. వంద పడకల ఆస్పత్రిని మంజూరు చేస్తా. పల్నాటి ఉత్సవాలను ప్రభుత్వ పరంగా నిర్వహిస్తాం" అని చంద్రబాబు ప్రకటించారు. అంతకుముందు వైద్య శిబిరాన్ని సందర్శించారు. డ్వాక్రా మహిళా సంఘాలకు రూ.52 కోట్ల విలువైన చెక్కును అందించారు.

**రెండు బంగారు కుటుంబాల దత్తత**

చంద్రబాబు సమక్షంలో రెండు బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకున్నారు. మాచర్ల 11 వార్డుకు చెందిన బత్తుల నీలావతిని బంగారు కుటుంబంగా ఎంపిక చేశారు. పీ4 కింద దత్తత తీసుకోవడానికి కేసీపీ సంస్థ మార్గదర్శిగా నిలిచింది. మాచర్లకు చెందిన షేక్ నజీరున్‌ను మరో బంగారు కుటుంబంగా ఎంపిక చేశారు. దుర్గికి చెందిన విత్తన కంపెనీ యజమాని యాగంటి వెంకటేశ్వర్లు మార్గదర్శిగా నిలిచారు. ఆ కుటుంబాలకు పింఛన్లు మంజూరు చేయాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. వారి పిల్లలను చదివించాలని మార్గదర్శులకు సూచించారు.

# మూడు విభాగాల్లో రాష్ట్రానికి స్కోచ్ అవార్డులు

న్యూఢిల్లీ/అమరావతి/విజయవాడ

మెరుగైన పనితీరు కనబరిచినందుకు మూడు విభాగాల్లో రాష్ట్రానికి ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డులు లభించాయి. పోటీ పరీక్షల్లో బీసీ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందజేసినందుకు సోషల్ జస్టిస్ సెక్యూరిటీ విభాగంలో ఏపీ బీసీ సంక్షేమ శాఖకు బంగారు స్కోచ్ అవార్డు వరించింది. శనివారం ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత పాల్గొన్నారు. స్కోచ్ గ్రూప్ చైర్మన్ సమీర్ కొచ్చర్, ప్రొఫెసర్ మహేందర్ దేవ్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు బీసీలను రాజ్యాధికారంలో భాగస్వాములను చేశారని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా 1,674 మందికి, ఆన్‌లైన్ ద్వారా మరో 4,774 మందికి ఉచిత శిక్షణ అందజేశామని వెల్లడించారు. వీరిలో 246 మంది మెగా డీఎస్సీలో టీచర్లుగా ఎంపికయ్యారన్నారు. రాబోయే కాలంలో బీసీ యువతకు అన్ని పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందివ్వనున్నామని ప్రకటించారు. అమరావతిలో ఐదెకరాల్లో బీసీ స్టడీ సర్కిల్ నిర్మించనున్నామని, విశాఖ, రాజమండ్రి, తిరుపతి, అనంతపురంలో మెగా బీసీ స్టడీ సర్కిళ్లను నిర్మించే ఆలోచన ఉందని సవిత తెలిపారు. కాగా డిజిటల్ టికెట్లు జారీ ప్రక్రియను విజయవంతంగా అమలుపరచడం ద్వారా ఆర్టీసీ 'స్కోచ్' అవార్డును గెలుచుకుంది. సంస్థ వైస్‌చైర్మన్, ఎండీ ద్వారకా తిరుమలరావు తరపున సంస్థ చీఫ్ ఇంజనీర్ (ఐటీ) వై.శ్రీనివాసరావు అవార్డు అందుకున్నారు. సంస్థకు అవార్డు రావడం పట్ల ఎండీ ద్వారకా తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మిన్) జి.వి.రవి వర్మ అభినందనలు తెలియజేశారు. ఇక పేదరిక నిర్మూలనలో విశిష్ట సేవలకు ఆంధ్రప్రదేశ్ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మాకు స్కోచ్ ప్లాటినం అవార్డు ప్రదానం చేసింది. మిషన్ డైరక్టర్ ఎన్.తేజ్‌భరత్ ఈ అవార్డును స్వీకరించారు. మెప్మా సంస్థ పట్టణ పేదరిక నిర్మూలనకు చేపడుతున్న వినూత్న పథకాలకు దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. మెప్మా కృషికి గుర్తింపుగా 9 అవార్డులను స్కోచ్ సంస్థ ప్రదానం చేసింది.

**రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖకు ఉత్తమ అవార్డు**

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సెంట్రల్ సిల్క్ బోర్డు 'మేరా రేషమ్- మేరా అభిమాన్' పేరుతో చేపట్టిన కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించినందుకు రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖకు ఉత్తమ అవార్డు లభించింది. అవార్డును శనివారం బెంగుళూరులో కేంద్ర జౌళి శాఖ సంయుక్త కార్యదర్శి పద్మినీ సింగ్లా, సభ్య కార్యదర్శి శివకుమార్, కేంద్ర పట్టు మండలి సభ్యుడు.. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ నుంచి రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల డైరెక్టర్ శ్రీనివాసులు అందుకున్నారు. 'మేరా రేషమ్- మేరా అభిమాన్' కార్యక్రమం ద్వారా ఏపీలో పట్టు పురుగుల ఉత్పత్తిని పెంచడానికి, కొత్త రైతులతో మల్బరీ సాగుకు అవకాశం ఏర్పడిందని శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ ఈ ఏడాది రెండోసారి ఉత్తమ అవార్డు పొందింది.

# బ్లాక్ ను వైట్ గా మనీ లిక్కర్ కేసులో విస్తుపోయే నిజాలు

విజయవాడ

ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. స్కామ్‌లో బ్లాక్ మనీని వైట్‌గా మార్చడం, విదేశాలకు తరలించారనే ఆరోపణలు ఉన్నాయి. అక్కడి నుంచి వివిధ సూట్‌కేసు కంపనీల్లో పెట్టుబడులు పెట్టారనే అనుమానాలు ఉన్నాయి. వాటిని నిగ్గుతేల్చే పనిలో పడింది ఈడీ. అందుకే ఈ ఉదయం నుంచి దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. ఈ స్కామ్‌లో ప్రమేయం ఉందని ఆరోపణలు ఎదుర్కొంటున్న మనీలాండరింగ్ మధ్యవర్తులపై ఫోకస్ పెట్టింది. అందుకే గురువారం ఉదయం నుంచి హైదరాబాద్, ఢిల్లీ, తమిళనాడు, కర్ణాటకతో సహా దేశవ్యాప్తంగా ఉన్న అనుమానితుల ఇళ్లు ఆఫీసులపై సోదాలు నిర్వహించింది. ఇరవైకి పైగా ప్రాంతాల్లో ఏక కాలంలో ఈ సోదాలు కొనసాగుతున్నాయి. ఒక్క హైదరాబాద్‌లోనే దాదాపు 8 ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది. ముందు ఈ స్కామ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. ఆ సిట్ చేసిన దర్యాప్తు, నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ జోక్యం చేసుకుంది. ఇందులో మనీలాండరింగ్ ఆరోపణలు ఉండి, భారీగా నిధులు దారి మళ్లించారనే అనుమానాలు వ్యక్తం చేయడంలో కేస్‌ను టేకప్ చేసింది. బినామీ సంస్థలు, షెల్ కంపెనీలు హవాలా ప్రక్రియ ద్వారా దాదాపు ?3,500 కోట్లు మళ్లించారనే ఆరోపణలు ఉన్నాయి. అందుకే ఇందులో కీలక పాత్ర ఉన్న వారిపై ఈడీ దృష్టి పెట్టింది. వారే లక్ష్యంగా సోదాలు చేస్తోంది. ఈ స్కామ్‌తో సంబంధం ఉన్న డిస్టిలరీల నుంచి కూడా ఇప్పటికే ఇఆ వాంగ్మూలాలు తీసుకుంది. జైలులో ఉన్న ప్రధాన నిందితుడు రాజ్ కాసిరెడ్డి వాంగ్మూలం కూడా రికార్డు చేసింది. వాటి ఆధారంగానే ప్రస్తుతం ఈ సోదాలు జరుగుతున్నట్టు సమాచారం. 2019–2024 మధ్య ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి సరఫరా ఆర్డర్‌లను పొందడానికి 16 మద్యం కంపెనీలు 1,677 కోట్ల రూపాయల లంచం ఇచ్చాయని ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ కేసు నమోదు చేసింది. దీనికి బదులుగా ఆయా కంపెనీలు 10,835 కోట్ల విలువైన కాంట్రాక్టులు పొందినట్లు పేర్కొంది. జగన్ ప్రభుత్వ హయాంలో ంఖూఃఅఒ 23 వేల కోట్ల రూపాయల విలువైన సరఫరా ఆర్డర్‌లను జారీ చేసిందని, వాటిలో 90% కంటే ఎక్కువ 111 రిజిస్టర్డ్ మద్యం కంపెనీలలో కేవలం 40 కంపెనీలకు మాత్రమే వెళ్ళాయని ూఎ తెలిపింది.3,500 కోట్లకుపైగా లంచాలు బినామీ సంస్థలు, షెల్ కంపెనీలు, హవాలా ఆపరేటర్ల ద్వారా మళ్లించినట్టు అనుమానిస్తోంది. సిట్ దర్యాపులో వెలుగు చూసిన అంశాల ఆధారంగానే ఇఆ మనీలాండరింగ్ నిరోధక చట్టాన్ని ప్రయోగించింది. నిందితులకు, ఆయా సంస్థలు సమన్లు ??జారీ చేసింది. ఇప్పుడు సోదాలు చేస్తోంది.

## పరకామణిలో చోరీపై రాజీనా

-మొదటిపేజీ తరువాయి

పోలీస్ స్టేషన్ రికార్డులు, లోక్ అదాలత్ ప్రొసీడింగ్స్, టీటీడీ బోర్డు తీర్మానాలు, ఈ కేసుతో సంబంధం ఉన్న ప్రొసీడింగ్స్‌ను తక్షణం స్వాధీనం చేసుకోవాలని సీఐడీ ఐజీని ఆదేశించింది. తదుపరి విచారణ రోజు వాటిని సీల్డ్ కవర్‌లో తమ ముందు ఉంచాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను అక్టోబరు 13కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఉత్తర్వుల ప్రతి శనివారం అందుబాటులోకి వచ్చింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ పరకామణిలో జరిగిన కుంభకోణంపై సీఐడీ దర్యాప్తు జరిపించాలని సమర్పించిన వినతిని ఈవో పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని కోరుతూ జర్నలిస్ట్ ఎం.శ్రీనివాసులు పిటిషన్ దాఖలు చేశారు. సీఐడీ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ అనుబంధ పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది కుర్రా శ్రీనివాసులు, టీటీడీ తరఫున న్యాయవాది సి. శ్రీనివాసబాబా వాదనలు వినిపించారు. ఈ వ్యవహారంపై టీటీడీ ఈవో సమర్పించిన రాతపూర్వక వివరాలు సంతృప్తికరంగా లేవని, పూర్తి వివరాలతో కౌంటర్ వేయడానికి సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి... ఈ వ్యవహారంలో రెండు వారాల్లో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని టీటీడీని ఆదేశించారు. రవికుమార్‌పై తీసుకున్న క్రమశిక్షణ చర్యల గురించి అఫిడవిట్‌లో ప్రస్తావించాలని స్పష్టం చేశారు. వ్యాజ్యంలో వ్యక్తిగత ప్రతివాదులుగా ఉన్న టీటీడీ అప్పటి అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి సతీశ్‌కుమార్, నిందితుడు రవికుమార్‌కు నోటీసులు జారీ చేశారు.

## ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు, బదిలీలు

అమరావతి

రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు ఇస్తూ మరి కొంతమంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న ఎస్.నాగలక్ష్మిని ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. ప్రస్తుతం ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కె.వి.ఎన్.చక్రధర్ బాబును బదిలీ చేశారు. చామకూరి శ్రీధర్‌ను ఎక్సైజ్, ప్రొహిబిషన్ డైరెక్టర్‌గా, బి.ఆర్.అంబేడ్కుర్‌ను స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీగా నియమించారు. ప్రస్తుతం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీగా పూర్తి అదనపు బాధ్యతలు చూస్తున్న వీరపాండియన్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించారు.

## రెండేళ్లలో రామాయపట్నం ఓడరేవు పూర్తి

**ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు**



బిట్రగుంట

తీరప్రాంతంలో 50 కి.మీ.లకు ఒక పోర్టు, గంట వ్యవధిలో చేరుకునేలా విమానాశ్రయాలు నిర్మించాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు తెలిపారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలంలోని రామాయపట్నం ఓడరేవు, బోగోలు మండలంలోని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, దగదర్తి మండలంలోని విమానాశ్రయ నిర్మాణ ప్రాంతాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ.. రామాయపట్నం ఓడరేవు 2027 నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓడరేవు విస్తరణకు మరో 2,400 ఎకరాలు అవసరమని గుర్తించినట్లు వివరించారు. దగదర్తి విమానాశ్రయం మూడేళ్లలో అందుబాటులోకి వస్తుందన్నారు. దీని ఏర్పాటులో భూ సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్వహణపై కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి, మత్స్యకార సంఘాలతో ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, రాష్ట్ర మారిటైమ్ బోర్డు సీఈ ప్రవీణ్ ఆదిత్య, ఇతర అధికారులు ఉన్నారు.

## జగన్ చుట్టూ చక్రబంధం

విజయవాడ

వైసీపీ చీఫ్ వైఎస్ జగన్ చుట్టూ చక్రబంధం బిగుసుకుంటుందా? అంటే అవుననే అంటున్నారు. అనేక విషయాలు జగన్ కు రానున్న కాలంలో కష్టాలు తప్పేట్లు లేదని సంకేతాలు కనిపిస్తున్నాయి. జగన్ పై కేంద్ర ప్రభుత్వం వైఖరి మారినట్లు కనపడుతుందంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి కొంత కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు వేగంగా అడుగులు వేయడం చూస్తుంటే జగన్ కు కష్టాలు చుట్టుముడుతున్నట్లే కనిపిస్తుంది. ఎందుకంటే గత వారం రోజుల నుంచి జరుగుతున్న ఘటనలు ఇందుకు కారణమని వైసీపీలోని చాలా మంది నేతలు భావిస్తున్నారు. జగన్ చుట్టూ చక్రబంధం వేస్తున్నట్లే కనిపిస్తుంని పార్టీకి చెందిన సీనియర్ నేత ఒకరు చేసిన వ్యాఖ్యలను బట్టి అర్థమవుతుంది. చంద్రబాబు నాయుడు పక్కా పొలిటికల్ లీడర్. తాను జగన్ పై ఏదో కేసులు పెట్టి జైలుకు పంపితే అది సానుభూతిగా మారి జగన్ కు వరంగా మారుతుంది. రాజకీయంగా నష్టం జరిగేది టీడీపీకే. అందుకే ఈసారి ఆ బాధ్యతను కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలపైన పెట్టినట్లు కనిపిస్తుంది. దానివల్ల సానుభూతి గ్రాఫ్ చాలా వరకూ తగ్గించే వీలుందన్నది చంద్రబాబు అంచనా. గతంలో తనను 52 రోజుల పాటు జైలులో వేయడంతోనే ఈసారి టీడీపీకి అంత గా ప్రజలు పట్టం కట్టారు. అదే పద్ధతిలో తాను వెళితే.. అదే సానుభూతి జగన్ కు చేరుతుందని అంచనా వేసిన పెద్దాయన ఇప్పటి వరకూ ఎలాంటి కేసుల విషయంలో దూకుడు ప్రదర్శించలేదు. తన పార్టీ నేతలు, కార్యకర్తలు ఈవిషయంలో అసంతృప్తిగా ఉన్నప్పటికీ చంద్రబాబు దూరాలోచనతో దానిని పట్టించుకోనట్లు వదిలేస్తున్నారు. ఇక తాజాగా వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తిరిగి దర్యాప్తు చేయడానికి తాము సిద్ధమని సీబీఐ సుప్రీంకోర్టుకు చెప్పడాన్ని కూడా కొందరు ఉదహరిస్తున్నారు. 2019లో వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగితే అందులో ఎవరి ప్రమేయం ఉందన్నది ఇంత వరకూ తేలలేదు. సీబీఐ ఒక దశలో తాము దర్యాప్తు పూర్తి చేశామని చెప్పేసింది. కానీ చివరకు సీబీఐ తాము విచారణ చేపట్టడానికి సిద్ధమని చెప్పడం బట్టి చూస్తుంటే జగన్ కు కొన్ని చిక్కులు తప్పేలా లేవని అంటున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారుల సోదాలు నిర్వహించడాన్ని బట్టి చూస్తే కేంద్ర దర్యాప్తు సంస్థలే జగన్ చుట్టు ఉచ్చు బిగుస్తున్నట్లు తెలిసింది. ఇన్నాళ్లూ హస్తినతో మంచి సంబంధ బాంధవ్యాలు మెయిన్ టెయిన్ చేసిన జగన్ కు ఈసారి మాత్రం ఆసరా దొరికే అవకాశం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. మరి ఈ చక్రబంధం నుంచి జగన్ ఎలా తప్పించుకుంటారో చూడాలి.

## రాహుల్ గాంధీ చేపట్టిన ఉద్యమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన..

- ఓట్ చోర్-గద్దే చోడ్ నినాదం తో సంతకాల సేకరణ..
- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ టీ.కే విశ్వేశ్వరరెడ్డి పిలుపు



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** ఓట్ చోర్-గద్దే చోడ్ నినాదంతో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన ఉద్యమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందని తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. జిల్లా నుంచి లక్ష సంతకాలు సేకరించాలని కార్యాచరణ చేస్తున్నాన్నారు. స్థానిక మున్సిపల్ కాలనీలో ఉన్న డిసిసి కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎఐసిసి, పిసిసి ఆదేశాల మేరకు ఎన్నికల కమీషన్ చేస్తున్న అవకతవకలపై ప్రజల మద్ధతు కూడబెట్టేందుకు సంతకాల సేకరణ చేస్తున్నామని వివరించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్ సహకారంతో లక్ష సంతకాలు సేకరించి రాహుల్ ఉద్యమంలో ప్రజల్ని భాగస్వాములుగా చేస్తామన్నారు. దేశాన్ని భ్రష్టుపటిస్తూ 347 లక్షల కోట్ల అప్పులు చేసిన మోదీని గద్దెదింపడానికి ప్రజలందరూ కాంగ్రెస్‌కు సహకరించాలని కోరారు. మోదీ గుజరాత్‌కు చెందిన అంబానీ, అదానీలను ప్రోత్సహిస్తూ దేశ సంపదను వారికి కట్టబెట్టి బినామీలుగా మార్చుకున్నారని ఆరోపించారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే విదేశాల్లోని బ్యాంకుల్లో ఉన్న నల్లధనాన్ని తెచ్చి ప్రతీ కుటుంబానికి 15 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చినా ఇంతవరకు కనీసం ఒక్క పైసా కూడా జమచేయలేదన్నారు. నరేంద్ర మోదీ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ ఇడి, సిబిఐ, ఇసిలను తన గుప్పిట్లో పెట్టుకుని దేశాన్ని సర్వనాశనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సంతకాల సేకరణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. పిసిసి ప్రధాన కార్యదర్శి అరిగెల అరుణకుమారి మాట్లాడుతూ మోదీ ఇప్పటివరకు దొంగ ఓట్లతోనే అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న మోదీ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. ఇసి అంటే బీజేపీ.. బీజేపీ అంటే ఇసి అన్నట్టుగా మార్చేసారని మండిపడ్డారు. ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితాలను విడుదల చేయాలని ఓటర్ల మార్పులు, చేర్పుల్లో అక్రమాలకు పాల్పడే అధికారుల్ని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేసారు.

కాంగ్రెస్ నాయకులు మోతా శారద, కాకర్ల హరిబాబు, జేటీ రామారావు,డాక్టర్ వడయార్,బిల్డర్ బాబీ, వై.శ్రీనివాస్,రఫీ,జాలా నటరాజ్,బత్తిన చంద్రరావు, డాక్టర్ రాజశేఖర్,పట్నాల శ్రీనివాస్,ఆలీ తదితరులు పాల్గొన్నారు.

## మాదే అసలైన రిజిస్టర్ సువర్ణ వర్థక సంఘం

శ్రీసువర్ణ వర్థక సంఘం అధ్యక్షుడు కడియాల శ్రీనివాస్ విమర్శ



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** హరి అధ్యక్షుడుగా ఉన్న సువర్ణ వర్థక సంఘం ఫేక్ అధ్యక్షుడు అని శ్రీ సువర్ణ వర్థక సంఘం అధ్యక్షుడు కడియాల శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు.శనివారం నల్లమందు సందులోని రాజేశ్వరి జ్యువెల్లరీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిన్నగాక మొన్న వచ్చిన హరి తనను సువర్ణ వర్థక సంఘం నుంచి బహిష్కరణ చేయడానికి అతని జీవితకాలం సరిపోదని మండిపడ్డారు. తాను ఎన్నికల్లో గెలిచిన అధ్యక్షుడినని, ఆతనీకి మాదిరి అధ్యక్షుడుగా ప్రకటించుకున్నవాడిని కానని ఆయన విమర్శించారు.వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో అప్పటి ఎంపీ మార్గాని భరత్ పక్కన చేరి ఎన్నో అవకతవకలకు పాల్పడిన అడపా హరి ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాగానే ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పక్కన చేరి పబ్బం గడుపు కుంటున్నాడని మండి పడ్డారు.సువర్ణవర్తక సంఘంలోకి కులాన్ని, పార్టీలను ఎందుకుతీసుకు రావాలని ఆయన నిలదీశారు.సువర్ణ వర్తక సంఘం సభ్యులకు బంగారం క్రయ విక్రయాల్లో ఏదైనా ఇబందులు వస్తే హరి పరిష్కరించలేదని, పోలీసులు వస్తే ఎలా మాట్లాడాలో తెలియదని తీసిపాడేశారు. పోరాటం చేసి తాను సంఘాన్ని ముందుకు నడిపిస్తానని కడియాల శ్రీనివాస్ అన్నారు.ఈ పార్టీలో ఉండి హయాంలో రాజమండ్రిని భ్రష్టు పట్టించిన హరి ఇప్పుడు సువర్ణ వర్థక సంఘాన్ని భ్రష్టు పట్టిస్తున్నాడని ఆయన ఆరోపించారు.సమావేశంలో కడియాల వరబాబు తదితరులు పాల్గొన్నారు.

## “స్వర్ణాంధ్ర బిస్వచ్ఛఆంధ్ర” ప్రతి ఒక్కరి బాధ్యత- బత్తిన.
## - ప్లాస్టిక్ నియంత్రణకు కట్టుబడదాం.







**కోరుకొండ విశ్వం వాయస్ న్యూస్:** స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్రకు కట్టుబడి భావితరాల భవిష్యత్తుకు దోహదపడదామని కోరుకొండ మండల అభివృద్ధి అధికారి బత్తిన అశోక్ కుమార్ తెలిపారు. శనివారం కోరుకొండలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కోరుకొండ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వివిధ శాఖలఅధికారులు, శిరిడిసాయి స్కూల్ విద్యార్థుల ర్యాలీ నిర్వహిస్తూ ఇంటింటా వనం ఊరంతా వనం, ప్లాస్టిక్ ని నిర్మూలిద్దాం భావితరాల భవిష్యత్తుకు నాంది పలుకుదాం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అశోక్ కుమార్ ఆధ్వర్యంలో మానవహారంగా ఏర్పడి స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తూ, ప్రతి ఒక్కరు ప్రకృతిని పరిరక్షిస్తూ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, హరితాంధ్రప్రదేశ్ పై అవగాహన కల్పించాలన్నారు. మండల పంచాయతీ విస్తరణధికారి ప్రతాప్ మాట్లాడుతూ కోరుకొండలో ప్లాస్టిక్ నిర్మూలనలో భాగంగా వర్తకులకు నోటీసులు జారీ చేశామని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్లాస్టిక్ నివారించకపోతే భావితరాల భవిష్యత్తు శూన్యం కాక తప్పదని హెచ్చరించారు. సర్పంచ్ లక్ష్మీసరోజ గణేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటి ఆవరణలో తప్పనిసరి ఒక మొక్క నాటి, ఇంటింటా వనం ఊరంతా వనం నానుడి నిజం చేయాలన్నారు. అనంతరం సచివాలయం ఆవరణలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అశోక్ కుమార్, సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ గణేష్, ఏపీవో సత్యనారాయణ, సెక్రెటరీ రమేష్ బాబు, అంగన్వాడి, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## పోషకాహార వారోత్సవాలు



**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** గర్భవతులు మరియు బాలింతలు అంగన్వాడీలో ఇచ్చే పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని కొవ్వూరు మున్సిపల్ చైర్పర్సన్ భావన రత్నకుమారి అన్నారు. శనివారం స్థానిక కొవ్వూరు పట్నంలోని యానాది కాలనీ, యుహెచ్సి ఫస్ట్ అండ్ సెకండ్ సెక్టార్లో పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భావన రత్న కుమారి పాల్గొని గర్భవతి అని తెలియగానే ముందుగా సమీప అంగన్వాడీలో పేరు నమోదు చేయించుకుని అక్కడ ఇచ్చే పోషకాహారాన్ని ప్రమాదం తప్పకుండా తీసుకోవాలని అన్నారు. గర్భవతి అయినప్పటి నుంచి తమ బరువు కంటే 12 కేజీల ఎక్కువ బరువు పెరగాలని, హెచ్ బి పర్సెంట్ 12 నుండి 15 వరకు ఉండాలని అన్నారు. యుహెచ్సిలో అన్ని రకాల పరీక్షలు చేయించుకుని వాటికి సంబంధించిన మందులు క్రమం తప్పకుండా వాడాలని, ఐరన్ పోలిక్ యాసిడ్ విటమిన్ టాబ్లెట్లను డాక్టర్ సలహా సూచనల మేరకు వాడాలన్నారు. మీరు తీసుకునే ఆహారంతో పాటు అదనపు ఆహారం తీసుకుని ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వాలని, బాలింతలు సరిపడా పాలు ఇవ్వాలంటే పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని తెలిపారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు అంగన్వాడీలు ఇచ్చే ఆహారాన్ని సక్రమంగా అందించాలని, అంగన్వాడీలో ఇచ్చే పోషక విలువైన ఆహారాన్ని పిల్లలకు అందించడం వల్ల శక్తివంతంగా ఆరోగ్యవంతంగా తయారవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తెరిసా పాల్ సంధ్య, పీహెచ్ ఎన్ ఐసీడీఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి ఉదయభాను హెల్త్ స్టాప్ అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు

## దస్తావేజు లేఖర్ల పెన్డౌన్
## రెండో రోజు కొనసాగుతుంది- భీమరాజు.



**కోరుకొండ విశ్వం వాయస్ న్యూస్:** రిజిస్ట్రేషన్ వ్యవస్థలో 2.0 ఓటిపి వ్యవస్థను రద్దు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా దస్తావేజు లేఖర్లు చేపట్టిన నిరసన దీక్ష శనివారం రెండో రోజుకు చేరుకుందని లేఖర్ల అధ్యక్షులు భీమరాజు తెలిపారు. శనివారం కోరుకొండ సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద కోరుకొండ మండల దస్తావేజు లేఖర్లు ఉదయం నుండి సాయంత్రం వరకు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖర్ల అధ్యక్షులు భీమరాజు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ వ్యవస్థలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన 2.0 ఓటిపి వల్ల కక్షిదారులు సాంకేతికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విధానం వల్ల రిజిస్ట్రేషన్ సమయం దుర్వినియోగం అవుతుందని, ప్రభుత్వ ఆదాయానికి గండి పడడంతో పాటు కక్షిదారుల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడడానికి అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ఈ విషయంపై ప్రభుత్వ పునః ఆలోచన చేసి కక్షిదారులు ఇబ్బందులు తొలగించి, ఎన్డీఏ ప్రభుత్వం మంచి ప్రభుత్వంగా మరో మారు నిరూపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెదపాటి భీమరాజు, జాజుల రాజా, మంచాల కృపానందం, పుణ్యమూర్తుల నరసింహారావు, అనదాసు శ్రీను, గంగాధర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్ఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి,

- కనీస వేతనాలు చెల్లించాలి,
- సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా.



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** వీఆర్ఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి, కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాజమండ్రి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద తూర్పుగోదావరి జిల్లా వీఆర్ఏలు ధర్నా చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు.ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు మల్లిమొగ్గల వెంకటరమణ మాట్లాడుతూ వీఆర్ఏల ప్రధాన సమస్యల్లో ఒకటైన పే స్కేల్ అమలు చేయాలని అన్నారు.నామినీలను వీఆర్ఏలుగా నియమించాలని,అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. కారుణ్య నియామకాల సమస్యలు ఎప్పటినుండో పెండింగ్‌లో ఉన్నాయని, కూటమి ప్రభుత్వం దానిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాజమండ్రి డివిజన్ ప్రెసిడెంట్ కె రాజేంద్రప్రసాద్, అనపర్తి అధ్యక్షులు దండకడియాల సత్యనారాయణ,జిల్లా ఉపాధ్యక్షుడు ర్యాలీ సుబ్బారావు,రంగంపేట మండలం అధ్యక్షుడు ఐ.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## మర్ల కుటుంబానికి పలువురు పరామర్శ ప్రగాఢ సంతాపం.



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన బ్రహ్మశ్రీ మర్ల ప్రభాకర శర్మ సతీమణి ఇటీవల స్వర్గస్తులైనారు. శనివారం వెదురుపాక తదితర గ్రామాలలోని ప్రజలు ప్రభాకర శర్మ, వారి కుటుంబసభ్యులను పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలియజేశారు. అనంతరం స్వర్గీయ బాలత్రిపుర సుందరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కోరిపల్లి అప్పలస్వామి, కొత్తల వీర అప్పారావు, పిల్లా చంటిబాబు, గొర్రెల శ్రీను, మడక వెంకటేశ్వర్లు, శ్రీశైలం, ఆకుల వెంకన్న, జాగారపు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## నెల్లిపాకలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం



**ఎటపాక విశ్వం వాయిస్ న్యూస్:** ఎటపాక మండలం అల్లూరి సీతారామరాజు జిల్లా నెల్లిపాక పంచాయతీలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రీన్ ఏపీ కార్యక్రమం లో పాల్గొన్న నెల్లిపాక సర్పంచ్ కొర్సా భద్రమ్మ మరియు ఎట్టపాక మండల ప్రెసిడెంట్ మరియు వార్డు సభ్యులు పుట్టి రమేష్ బాబు చేతుల మీదుగా చిన్న హైస్కూల్ నందు మొక్కలు నాటడం జరిగింది ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ మొక్కలు పెంచడం వల్ల ఆక్సిజన్ పెరుగుతుంది కాలుష్యాన్ని తగ్గిస్తుంది నీడనిస్తుంది ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేస్తూ ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షేక్ నబీన్ భాషా హై స్కూల్ హెచ్ఎం డి జయ మరియు సచివాలయ సిబ్బంది స్కూల్ పిల్లలు పాల్గొని మొక్కలు నాటడం జరిగింది

## ఎడిటర్ వాయిస్

# ఏకపక్షానికి ‘సుప్రీం’ బ్రేక్!

వివాదాస్పదమైన వక్ఫ్ బోర్డు సవరణ చట్టం- 2025లోని కొన్ని కీలక సెక్షన్లను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు ఇటీవల వెలువరిం చిన మధ్యంతర తీర్పు ఏకపక్షంగా ముందుకెళుతున్న మోడీ సర్కారుకు గట్టి ముకుతాడు. ముస్లింల మేలు కోసమే ఈ చట్ట సవరణ చేపట్టామని గట్టిగా సమర్థించుకున్న ఎన్డీయే ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ గత ఏప్రిల్‌లో 72 పిటిషన్లు దాఖలయ్యాయి. సుప్రీంకోర్టు వాటిని విచారణకు స్వీకరించి, కేంద్రం నుంచి వివరణ కోరినప్పుడు- ఆ పిటిషన్లకు విచారణార్హతే లేదని మోడీ ప్రభుత్వం తన అఫిడవిట్‌లో పేర్కొంది. చట్టం అమలుపై ఎట్టి పరిస్థితుల్లోనూ స్టే ఇవ్వరాదని, అది శాసనాదికారాల్లో కోర్టులు అనవసర జోక్యం చేసుకోవటమే అవుతుందని దూకుడుగా వాదించింది. కానీ, సుప్రీం ధర్మాసనం వాటిని తోసిపుచ్చింది. రెండు వైపులా సుదీర్ఘమైన వాదనలు విన్నది. వక్ఫ్ అధికారాల్లో మితిమీరిన జోక్యం చేసుకోవటానికి వీలున్న కొన్ని కీలకమైన అంశాలపై స్టే విధించింది. ప్రతిపక్ష పార్టీలూ, వక్ఫ్ పరిరక్షణ సంస్థలూ ఈ మధ్యంతర తీర్పును స్వాగతించగా, చట్టం మొత్తాన్ని నిలిపివేయకపోవడం ప్రభుత్వ విజయమేనని బీజేపీ చెప్పుకొంది. అన్ని మతాల వలె ఇస్లాంలోనూ ధార్మిక అవసరాలకు ఉపయోగించటానికి ఆయా కాలాల్లో ప్రజలూ, పాలకులూ భూములను, ఇతర ఆస్తులను దానం (వక్ఫ్) ఇవ్వటం ఆనవాయితీగా ఉంది. ఈ విధంగా సమకూరిన ఆస్తులు ముస్లిం పెద్దలతో కూడిన వక్ఫ్ బోర్డు సంరక్షణలో ఉంటాయి. ఉద్దేశిత అవసరాలకు వాటిని వినియోగించే పూర్తి హక్కు, అధికారమూ ఆ బోర్డు కలిగి ఉంటుంది. లక్షలాది ఎకరాలు వక్ఫ్ బోర్డుల ఆధీనంలో ఉన్నాయని, ఇది చాలా అన్యాయమని బీజేపీ, దాని పరివార సంఘాలూ చాలా ఏండ్లుగా దుష్ప్రచారం చేస్తున్నాయి. అందుకు అనుగుణంగా మోడీ ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణ చేపట్టి, కొన్ని అభ్యంతరకరమైన నిబంధనలను చేర్చింది. ఈ చట్ట సవరణలు ఏకపక్షంగానూ, వివక్షతోనూ ఉన్నాయని ప్రతిపక్ష పార్టీలు, ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు, ఇతర సంస్థలూ తీవ్రంగా వ్యతిరేకించాయి. 1923 నుంచి అమల్లో ఉన్న వక్ఫ్ బోర్డు చట్టాలను, నిబంధనలను పరిగణనలోకి తీసుకొని మధ్యంతర తీర్పు ఇస్తున్నట్టు సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఆస్తిని దానం చేసే వ్యక్తి కనీసం ఐదేండ్లు ఇస్లామ్‌ని పాటించి ఉండాలనే నిబంధన మీద సుప్రీం స్టే విధించింది. ఇస్లాం అవలంబనను ఏ విధంగా గుర్తిస్తారో విధి విధానాలు రూపొందించేదాకా దాని అమలు నిలిపేయాలని పేర్కొంది. వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతర సభ్యుల సంఖ్య కేంద్ర బోర్డుల్లో నాలుగు, రాష్ట్ర బోర్డుల్లో మూడు మించరాదని చెప్పి, ముస్లిం సభ్యులే మెజారిటీ ఉండాలని స్పష్టపరిచింది, బోర్డు ఛైర్మన్‌గా వీలైనంత మేర ముస్లింనే నియమిస్తే మంచిదని సూచించింది. వక్ఫ్ వివాదాల్లో సవరణ చట్టం జిల్లా కలెక్టరుకు దఖలు పర్చిన అధికారాలను ధర్మాసనం పూర్తిగా నిలిపివేసింది. ఏ కార్యనిర్వాహక అధికారీ తీర్పులు ఇవ్వజాలడని, అది అధికారాల విభజన చట్టానికి విరుద్ధమని నొక్కి వక్కాణించింది. తద్వారా, వక్ఫ్ భూముల వివాదాలు చాలాచోట్ల ప్రభుత్వంతోనే ముడిపడి ఉన్నందున, కలెక్టరుకు నిర్ణయాధికారాలు అప్పగిస్తే అది అన్యాయానికి తావిస్తుందన్న పిటిషనర్ల వాదనను బలం చేకూరింది. వక్ఫ్ భూములు లేదా ఇతర ఆస్తులు కొన్ని సందర్భాల్లో ఎలాంటి అధికార పత్రాలూ లేకుండానే బోర్డుకు దఖలు పడతాయి. అన్నింటినీ రిజిస్ట్రేషన్ పరిధిలోకి తీసుకురావాలన్న సవరణ చట్టం నిబంధనను ధర్మాసనం బలపర్చింది. వక్ఫ్ బై యూజ్ తొలగింపును సమర్థించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మాసిహ్ ల ధర్మాసనం వెలువరించిన ఈ 128 పేజీల మధ్యంతర



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# ప్రకృతిని ఆరాధించే అపురూప పండుగ ‘బతుకమ్మ’

తెలంగాణ అంటే బతుకమ్మ (బతుకు = జీవితం, అమ్మ = స్త్రీ లేదా తల్లి). బతుకమ్మ అంటే తెలంగాణ. బతుకమ్మ అంటే తల్లి దేవత సజీవంగా వస్తుందని, జీవిత దాత అని అభివర్ణిస్తారు. స్త్రీత్వానికి పోషక దేవతగా గౌరీ దేవిని ఆరాధిస్తారు. మహిళాలోకా ఇష్ట దైవమైన ‘గౌరి (పార్వతి) అమ్మ’ వారిని ఆటపాటలతో కొలుచుకునే పూల పండుగగా బతుకమ్మకు పేరుంది. ఊరు, వాడ ఆడపడుచులు అందరూ ఎక్క చోట చేరి పూల బతుకమ్మలను మధ్యలో అమర్చి వాటి చుట్టు చేరి సాంప్రదాయ పద్ధతుల్లో పాటలు పాడుకుంటూ, నాట్యాలు చేస్తూ, బతుకమ్మ పండుగను వైభవోపేతంగా జరుపుకుంటారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు ప్రతీక. ప్రకృతి అందాలను ఆరాధిస్తూ, పుడమి చల్లి విశిష్టతను కీర్తిస్తూ, ఆనందాల తోరణాలను కట్టి, పడుచులంతా ఒక్క చోట చేరి జరుపుకునే 9 రోజులు జరుపుకునే పండుగగా బతుకమ్మకు గుర్తింపు ఉన్నది. ప్రకృతి సిద్ధంగా తెలంగాణ ప్రాంతాల్లో లభించే అందమైన, రంగు రంగుల పూలను సేకరించి బతుకమ్మలను పేర్చుతారు. చెలకలు, చేనుల్లో మొలిచే సహజ పువ్వులైన తంగేడు, గునుగు, గుమ్మడి, కట్ల పూలు, సీత జడ పూలు లాంటివి సేకరించి బతుకమ్మలను పేర్చి మధ్యలో గుమ్మడి పూవ్వును, గౌరమ్మను అమర్చి కొలుచుకుంటారు. తంగేడు పువ్వు శక్తికి, గుమ్మడి పువ్వు మంగళకరమైన సౌందర్యానికి ప్రతీకలుగా తీసుకుంటారు. బతుకమ్మ అంటే బతకనిచ్చే చల్లని అమ్మ అని అర్థం చేసుకోవాలి. ప్రతి ఏట మహాలయా అమావాస్య (పెత్రామాస లేదా పితృ అమావాస్య) రోజున 21 సెప్టెంబర్ ‘ఎంగిలి పూల బతుకమ్మ’తో మొదలై తొమ్మిదవ రోజు 30 సెప్టెంబర్ 2025న ‘సద్దుల బతుకమ్మ’తో ముగుస్తుంది. బతుకమ్మపై అమర్చిన పసుపుతో చేసిన గౌరమ్మను మహిళలు తమ మంగళ సూత్రాలకు పెట్టుకొని దీర్ఘ సుమంగళిగా ఉండాలని అమ్మ వారిని కోరుకుంటారు. తీరొక్క పూలతో చేసిన పెద్ద పెద్ద బతుకమ్మలను సమీప చెరువు వద్దకు చేర్చి, వలయాకారంలో నిలబడి, నెమ్మదిగా లయబద్ధంగా కదులుతూ, పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ, కోలాటాలు ఆడుతూ, ఆటపాటలతో సంబరాలు చేసుకుంటారు. చివరకు సమీప చెరువుల్లో బతుకమ్మను నిమజ్జనం చేసి ప్రసాదాలు పంచి పెడతారు. ప్రతి రోజు ఒక నైవేద్యాన్ని తయారు చేసి దేవతకు సమర్పిస్తారు. 21



సెప్టెంబర్ 2025 రోజున ‘ఎంగిలి పూల బతుకమ్మ’తో ప్రారంభమైన తొమ్మిది రోజుల పాటు ‘అటుకుల బతుకమ్మ’, ‘ముద్దపప్పు బతుకమ్మ’, ‘నానే బియ్యం బతుకమ్మ’, ‘అట్ల బతుకమ్మ’, ‘అలిగిన బతుకమ్మ’, ‘వేపకాయల బతుకమ్మ’, ‘వెన్న ముద్దల బతుకమ్మ’, 29/30 రోజున ‘సద్దుల లేదా పెద్ద బతుకమ్మ’ పండుగలను నిర్వహించుకుంటారు. బతుకమ్మ పండుగ ప్రారంభ నేపథ్యం అతి పురాతనమైనది. ధర్మాంగుడు అనే రాజుకు వంద సంతానం కలిగిన పుట్టిన తర్వాత చని పోతుంటారు. దుఃఖంలో మునిగిన రాజు దంపతులకు లక్ష్మీ దేవి రూపంలో వందవ సంతానంగా ఆడ బిడ్డ జన్మిస్తుంది. ఆ చిన్నారి పలు అనారోగ్యాలను జయిస్తూ, మునుల నుంచి ‘నవ్వు కలకాలం బతుకమ్మ’ అంటూ దివించబడుతుంది. నాటి నుంచి నేటి వరకు తెలంగాణ ప్రాంతానికే ప్రత్యేకమైన పర్వదినాలుగా ‘బతుకమ్మ’ పండుగను జరుపుకుంటున్నారు. పూల రంగుల మేళవింపుతో ప్రతి ప్రాంతం బతుకమ్మ పూదోటగా గుబాళిస్తుంది. బతుకమ్మ పాటల్లో పల్లె అందాలు, ప్రకృతి పట్ల మమకారాలు, పంట చేల పట్ల ఆరాదణలు స్పష్టంగా కనిపిస్తాయి. బతుకమ్మ పాటల్లో పల్లెతనం, అమాయకత్వం, ఒక ప్రకృతి ఆరాధణ, ఒక కథ, ఒక సంస్కృతి, ఒక ఆశ, ఒక స్ఫూర్తి దాగి ఉంటాయి. బతుకమ్మ పండుగకు ముందు ఏడు రోజుల పాటు బొడ్డెమ్మ పండుగ జరుపుకుంటాం. పువ్వులు విరివిగా వికసించే కాలం, చెరువులు నిండు గర్భిణిలుగా కనిపించే కాలంలో వచ్చే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన గీతికగా, సంస్కృతిక ప్రతీకగా నిలుస్తున్నది. తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్‌గా పూల బతుకమ్మ సదా నిలుస్తున్నది, అందరి ఆనంద ఆరోగ్యాలకు కారణం అవుతున్నది నేలతో నీటితో మానవులకు ఉన్న అనుబంధాన్ని బతుకమ్మ చాటుతున్నది.


# తెలంగాణ ఉద్యమ ఆదిగురువు కొండా లక్ష్మణ్

భారత స్వాతంత్ర్య పోరాటంలో, ముల్కీ ఉద్యమంలో, నిరంకుశ నిజాం వ్యతిరేక పోరాటంలో, తెలంగాణ 1969 నాటి తొలి, ఇటీవలి మలి దశ ఉద్యమాలలో కీలక పాత్రలు వహించిన, జీవితాంతం తెలంగాణ సమస్యలపై పోరాటం చేసిన తెలంగాణ పక్షపాతి దివంగత కొండా లక్ష్మణ్ బాపూజీ.ఏకకాలంలో నాలుగు భిన్నమైన, అంతర్గత సంబంధం కలిగి ఉన్న ప్రజాఉద్యమాలతో ఆయన జీవితం ముడివడి ఉన్నదని చెప్పడం సముచితం. అవి వరుసగా నిజాం వ్యతిరేక పోరాటం, వెనుకబడిన కులాల ఉద్యమం, చేనేత సహకారోద్యమం, ప్రత్యేక తెలంగాణోద్యమం. వాస్తవానికి తెలంగాణ ఉద్యమానికి ఆయన ఆది గురువు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించిన పాత్ర వితం ముడివడి ఉన్నదని చెప్పడం సముచితం. 1969లో తొలి దశ పోరాటంలోనే కీలక పాత్ర పోషించి, మంత్రి పదవిని కూడా తృణ ప్రాయంగా త్యజించిన త్యాగశీలి. తెలంగాణ వాసుల కష్టాలు తీరాలంటే, ప్రత్యేక రాష్ట్ర సాధన తప్ప వేరే మార్గం లేదని భావించి, అందుకు వివిధ మార్గాలలో నిరసన స్వరాలు వినిపించాడు. అలనాటి నిజాం సంస్థానంలో ఆదిలాబాద్ జిల్లా వాంకిడి గ్రామంలో 1915 సెప్టెంబర్ 27న కొండా లక్ష్మణ్ జన్మించాడు. చిన్నతనాన తల్లిని కోల్పోగా, ప్రాథమిక విద్య ఆసిఫాబాద్‌లో, హైదరాబాద్ లో న్యాయ శాస్త్ర విద్య పూర్తి చేసి, 1948లో న్యాయ వాద వృత్తి చేపట్టాడు. ఆనాడు నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించిన వారి పక్షాన కేసులను వాదించి, గెలిపించే వాడు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నాడు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన , దేశంలోని అంతర్భాగమైన నిజాం ఏలుబడిలో ఉన్న తెలంగాణ, నిజాం నిత్య అకృత్యాలకు లోనైన దుస్థితిలో తెలంగాణ విమోచనోద్యమంలో క్రియా శీలక పాత్ర పోషించాడు. 1947 డిసెంబర్ 4న నిజాం ప్రభువు పై బాంబులు విసిరిన నారాయణరావు పవార్ బృందంలో కొండా లక్ష్మణ్ కూడా నిందితుడే. కొంతకాలం అజ్ఞాతుడుగా ఉన్నాడు. నిజాం నిరంకుశ పాలన పై నిప్పుల వర్షం కురిపిస్తూ, ఆయన పాలన అంతానికి, తిరుగుబాటు బావుటా ఎగురవేసి, తొలుదొలుత వ్యూహ రచన చేసింది బాపూజీయే. 1952 లో తొలిసారి ఆసిఫాబాద్ శాసనసభ కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించి, శాసనసభలో అడుగు పెట్టాడు. 1957లో చిన్న కొండూరు నుండి గెలుపొంది శాసనసన డిప్యూటీ స్పీకర్ గా బాధ్యతలు స్వీకరించాడు. 1962లో స్వల్ప తేడాతో ఓటమి పాలైనా, ప్రత్యర్థి ఆక్రమాలతో గెలిచారని కేసు పెట్టి, విజయం సాధించాడు. 1967లో భువనగిరి నుండి గెలిచాడు. 1957-60 వరకు ఉమ్మడి రాష్ట్రం డిప్యూటీ స్పీకర్‌గా, అనంతరం దామోదరం సంజీవయ్య క్యాబినేట్‌లో ఎక్సైజ్, చేనేత, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రిగా, బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో కార్మిక, సమాచార శాఖ మంత్రిగా బాధ్యతలు



నిర్వర్తించారు. తర్వాత సీఎం పదవికోసం పీవీ నరసింహారావుతో పోటీ పడ్డాడు. సీఎం పదవి దక్కనందుకు గవర్నర్‌గా నియమిస్తామని నాటి ప్రధాని ఇందిరాగాంధీ పిలిచి చెపితే, సున్నితంగా తిరస్కరించాడు. కాసు బ్రహ్మానంద రెడ్డి ముఖ్యమంత్రిత్వ ప్రభుత్వంలో కేబినెట్ మంత్రిగా ఉంటూ, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ పక్షపాతిగా ఉద్యమ ఉధృతి కోసం రాజీనామా చేశాడు. 1969 మార్చి 27న తన రాజీనామాను ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డికి అందజేసిండు. దాన్ని ఆమోదిస్తున్నట్లు సీఎం ప్రకటించిండు. ఈ రాజీనామా ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ఒక చారిత్రక మలుపు తిప్పిందని చెప్పవచ్చు. 1972లో భువనగిరి నుండి విజయం కైవసం చేసుకున్నాడు. 1973 లో పాములపర్తి వేంకట నరసింహారావు తదనంతరం ముఖ్యమంత్రి అయ్యే అవకాశం గడప తొక్కిన, ఇందిరా గాంధీ ఒప్పుకున్నా, నాటి హోం మంత్రి ఉమా శంకర్ దీక్షిత్ పట్టు వల్ల వెంగళరా వు కు ముఖ్య మంత్రి అయ్యే ఛాన్స్ దొరికింది. 1958లో హుస్సేన్ సాగర్ తీరాన భూమి కొనుక్కుని జలదృశ్యం నిర్మించు కోగా, 2002 లో చంద్రబాబు ప్రభుత్వం దాన్ని నేలమట్టం చేయించగా , కోర్టు కెళ్ళి తనకు అనుకూల తీర్పు పొందాడు. చివరకు 97వ సంవత్సరంలో 2012 సెప్టెంబర్ 21న మరణించగా, జలదృశ్యంలోనే అంత్యక్రియలు జరిగాయి. 1952లో ముల్కీ ఉద్యమంతో తెలంగాణ కోసం పోరాటం ప్రారంభించి, ప్రత్యేక రాష్ట్రంకోసం తొలి రాజీనామా చేసి, 97 ఏళ్ల పండు ముదుసలి వయసులో, ఎముకలు కొరికిన చలిని లెక్క చేయక ఢిల్లీలో దీక్ష చేసి, గాంధీ మార్గంలో శాంతియుత పోరాటాన్ని ఎంచుకుని, బాపూజీ గా పిలువబడే కొండా లక్ష్మణ్, తన ఆస్తులను, జీవితాన్ని ధారబోసి, కొండంత గొప్ప వ్యక్తిత్వం, నిబద్ధత కలిగిన రాజకీయ ఆదర్శ నేతగా గుర్తింపు నొందాడు. 2000లో మలి దశ ఉద్యమం ప్రారంభించిన కేసీఆర్‌ను ప్రోత్సహించడమే కాదు సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న తన నివాస బంగ్లా జలదృశ్యంను టీఆర్ఎస్ ప్రధాన కార్యాలయానికి ఇచ్చారు. ఇక్కడే తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భవించింది. నాటి నుంచి అశోక్ నగర్‌లోని అద్దె ఇంటిలోనే కొండా లక్ష్మణ్ బాపూజీ నివసించాడు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చివరి శ్వాస ఉన్నంత వరకు చిత్తశుద్ధితో కృషి చేసి, మూడు తరాల వారధి ఉన్న తెలంగాణ రాష్ట్ర అలుపెరుగని, అవిశ్రాంత పోరాట యోధుడు బాపూజీ తెలంగాణ ప్రజానీకానికి ప్రాతఃస్మరణీయుడు.

## స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర" కార్యక్రమం నిర్వహించిన పోలీసులు, అధికారులు, సిబ్బంది.



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు, ప్రతీ మూడవ శనివారం పర్యావరణ పరిరక్షణ కోసం నిర్వహించబడుతున్న "స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర " కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు సిబ్బంది కలిసి.. సబ్ డివిజన్ అధికారుల కార్యాలయాలు, సర్కిల్ ఇన్స్పెక్టర్ల కార్యాలయాలు, అన్ని పోలీస్ స్టేషన్లలో శ్రమదానం చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచారు.పోలీసు స్టేషన్ లోపల , ఆవరణలలోనూ పరిసరాలను పరిశుభ్రం చేశారు.
పిచ్చి మొక్కలను తొలగించారు.

## ఫ్లెక్స్ ప్రింటర్లు నిబంధనలు అతిక్రమించరాదు... సి ఐ దొరరాజు...



**మండపేట టౌన్... విశ్వంవాయిస్ న్యూస్...** ఫ్లెక్స్ ప్రింటింగ్ చేసే ప్రింటర్లు నిబంధనలకు అతిక్రమించరాదని వాళ్లు ముద్రించే ఫ్లెక్స్ లపై కులమతాల మధ్య ఘర్షణలను లేపే అంశాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండపేట రూరల్ సి ఐ దొర రాజు అన్నారు.మండపేట రూరల్ సి ఐ కార్యాలయంలో డాక్టర్ బి అర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్ పి ఆదేశాలు ప్రకారం మండపేట రూరల్ పరిధిలో గల ఫ్లెక్స్ ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో సమావేశం శనివారం నిర్వహించారు.సి ఐ దొర రాజు మాట్లాడుతూ ప్రింటింగ్ చేసే సమయంలో వివిధ వర్గాల వారిని, వివిధ మతాల వారిని రెచ్చ గొట్టే విధంగా, రాజకీయ నాయకులపైన అనుచిత వ్యాఖ్యలు చేసే విధంగా ప్రింటింగ్ చేసి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పై విధంగా ప్రింటింగ్ చేయమని వచ్చిన వారి వివరాలు ప్రింటింగ్ చేయమని ఒత్తిడి చేసే వారి వివరాలు సంబంధిత సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వారికి తప్పకుండా తెలియజేయాలని కోరారు. ఫ్లెక్సీ పైన ప్రింటింగ్ చేసే వారి వివరాలు ప్రింటింగ్ చేయాలని తెలిపారు. అతిక్రమించినచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## డ్రైనేజీ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే వేగుళ్ల...



**మండపేట టౌన్... విశ్వంవాయిస్ న్యూస్...** మండపేట పట్టణంలో ఎనిమిదో వార్డులో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు శనివారం పరిశీలించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమీపంలో జరుగుతున్న డ్రైనేజీ పునర్నిర్మాణ పనులను ఆయన పరిశీలించి, పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఎటువంటి అవకతవకలు జరగకూడదని ఎమ్మెల్యే కాంట్రాక్టర్ ను హెచ్చరించారు. నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ, కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, అ వార్డు టీడీపీ ఇన్ చార్జి పెందుర్తి ప్రదీప్ కుమార్, స్థానిక నాయకులు ముమ్మిడివరపు నారాయణరావు, జొన్నాడ పాపయ్యమ్మ, గోసాల పండు బాబు, మందపల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య సంరక్షణకు మహిళలు ప్రత్యేక శ్రద్ధ వహించాలి



**రాయవరం,విశ్వంవాయిస్ న్యూస్:** మహిళలకు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ముఖ్యమైనదిగా భావించి తగు చర్యలు తీసుకోవాలని డాక్టర్లు మణికంఠ, అరవింద్ లు సూచించారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండలం పసలపూడి గ్రామంలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని శనివారం పసలుపూడి సబ్ సెంటర్ -2 నందు, డాక్టర్ మణికంఠ, డాక్టర్ అరవింద్ ఆధ్వర్యంలో మహిళలకు కిషోర్ బాలికలకు ఆరోగ్య పరీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలకు హిమోగ్లోబిన్ శాతాన్ని తెలుసుకునే పరీక్షలు చేసి, స్కానింగ్ లు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం పొందేలా ఆహారం నియమాలు అలవర్చుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సర్పంచ్ కడలి పద్మావతి, అంగనవాడి సూపర్వైజర్ విష్ణుకుమారి, హెల్త్ సూపర్వైజర్ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ల్యాబ్ టెక్నీషియన్ శివ, అంగన్వాడీ సిబ్బంది హెల్త్ సిబ్బంది, మహిళలు, బాలికలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు వ్యవసాయ డ్రోన్లు పంపిణీ...




**మండపేట టౌన్... విశ్వంవాయిస్ న్యూస్...** మండపేట మండల ఎంపీడీవో కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంట పొలాలకు పిచికారి చేసే డ్రోన్ లు పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పాల్గొన్నారు. రైతులకు పంట పొలాలకు పిచికారి చేసే డ్రోన్ లను పంపిణీ చేశారు. మండల వ్యవసాయ అధికారి కే ప్రభాకర్ మాట్లాడుతూ మండపేట మండలానికి సంబంధించి తేజ డ్రోన్ క్రాప్ సొల్యూషన్స్ గ్రూప్ వారికి ఒక డ్రోన్, కపిలేశ్వరపురం మండలం టేకి కృషి సహాయక కిషన్ పడమర ఖండ్రిగ గ్రామానికి చెందిన కాటన్ దొర కిసాన్ డ్రోన్ సిహెచ్సి గ్రూపు వారికి ఒక్కొక్క డ్రోన్ పంపిణీ చేసినట్లు చెప్పారు.డ్రోన్ పూర్తి ఖరీదు రూ 9,80,000 కాగా ప్రభుత్వ సబ్సిడీ 7,84,000 రైతు వాటా రూ 1,96,000 అన్నారు.మండపేట నియోజకవర్గం లో 3 డ్రోన్లు రైతు గ్రూపులకు పంపిణీ చేశామన్నారు.వీటి విలువ రూ 29,40,000లు కాగా ప్రభుత్వ సబ్సిడీ రూ 23,52,000 లురైతు కట్టవలసినది రూ 5,88,000 లు అని చెప్పారు.మండపేట నియోజకవర్గం లో ఇప్పటివరకు ఐదు డ్రోన్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మండపేట మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు ,మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన నల్లమిల్లి వీరెడ్డి , మండపేట పిఎసిఎస్ చైర్మన్ కుక్కల రామారావు , కపిలేశ్వరపురం మండలం వ్యవసాయ అధికారి బలుసు రవి , టేకు పిఎసిఎస్ చైర్మన్ మేడిశెట్టి శ్రీనివాస్ ,ఎండిఓ కే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బైపాస్ ప్రమాదాలకు చెక్ భూ సర్వే ప్రారంభం..

**తహసీల్దార్ అశోక్ ఆధ్వర్యంలో చర్యలు.**




**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** భట్నవిల్లి పేరూరు వై.జంక్షన్ వరకు విస్తరించిన బైపాస్ రోడ్‌లో తరచూ జరిగే ప్రమాదాలకు శాశ్వత పరిష్కారం కనుగొనే దిశగా రెవెన్యూ శాఖ ముందడుగు వేసింది. ముఖ్యంగా విత్తనాల వారి కాలువ గట్టు దగ్గర నుంచి చిందాడ గరువు క్రాస్ వద్ద పలువురు ప్రాణాలు కోల్పోవడంతో ఈ ప్రాంతం "అపాయ జోన్"గా మారింది. పోలీసులు ఇప్పటికే బ్యారికేట్లు ఏర్పాటు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో, రద్దీ సమయాల్లో రూరల్ ఎస్ఐ శేఖర్ సిబ్బందిని నియమించి ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నారు. అయితే, తాత్కాలిక చర్యలతో సమస్య పరిష్కారం కానందున రెవెన్యూ అధికారులు శాశ్వత మార్గాన్ని ఎంచుకున్నారు. తహసీల్దార్ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ బృందం శుక్రవారం "ఆమని ఆటో మొబైల్స్" ప్రాంతంలో ఇరువైపులా 100 అడుగుల మేర భూమిని ల్యాండ్ అక్విజిషన్ చేయాలన్న నిర్ణయంతో భూ సర్వే చేపట్టింది. దీని ద్వారా గ్రామాల నుంచి హైవే ఎక్కే వాహనాలు కొంతదూరం పక్కదారి వెంట వెళ్లి రోడ్డుపైకి చేరేలా మార్గం సుగమం కానుంది. రోళ్లపాలెం వద్ద కూడా ఇలాంటి సమస్య ఉందని గుర్తించిన అధికారులు, ఇలాంటి ఇబ్బందులు ఉన్న ఇతర ప్రాంతాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అశోక్ కుమార్ తెలిపారు.

## పొలంబడి ద్వారా సుడిదోమ నివారణకు చర్యలు

సుడిదోమ అధికంగా ఉంటేనే పురుగుమందులు వాడాలి

సుడిదోమ తక్కువగా ఉంటే సాలీడు వంటి మిత్ర పురుగులు వాటిని సంహరిస్తాయి

వ్యవసాయ అధికారి కెవిఎన్ రమేష్ కుమార్




**రాయవరం,విశ్వంవాయిస్ న్యూస్:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండలం, చెల్లూరు గ్రామంలో మండల వ్యవసాయ అధికారి కెవిఎన్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా వరి పంటలో నీటి యాజమాన్యం, పొలం పరిసరాల విశ్లేషణ,సుడి దోమ జీవిత చరిత్ర, నివారణ మార్గాలు గూర్చి ఆయన వివరించారు. సుడిదోమ అనేది నత్రజని అధికంగా వాడిన పొలంలోనూ, దగ్గరగా ఊడ్చిన పొలాల్లోనూ, మురుగునీటి పారుదల సమస్య ఉన్న పొలాల్లో అధికంగా వస్తుందని తెలిపారు. సుడిదోమ అనేది వరి ఈనిక దశలో ఒక దుబ్బుకి 20 నుంచి 25 పురుగులు మించి ఉంటే పురుగుమందులు వాడాలని లేని పక్షంలో మిత్ర పురుగులు సాలీడు, కోకో కోల బిల్ల పురుగులు ఈ దోమలను అరికట్టడంలో సహాయం చేస్తాయని తెలిపారు. వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న వరి పొలంలో వేప గింజల కషాయాన్ని డ్రోన్ ద్వారా పిచికారి చేయించారు. ఈ కార్యక్రమంలో చెల్లూరు గ్రామ నాయకులు, పొలం బడి రైతులు, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కె. బాబురావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## రెచ్చగొట్టే విధంగా ఫ్లెక్సీలు ఫ్రింట్ చేస్తే నిర్వాహకులు పై కఠిన చర్యలు



**మలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** అమలాపురం సబ్ డివిజన్ పరిధిలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఫ్లెక్స్ ప్రింటింగ్ నిర్వహకులకు అమలాపురం డి.ఎస్.పి. టి ఎస్ ఆర్ కె ప్రసాద్ స్థానిక అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్ నందు సమావేశం నిర్వహించారు. రాబోయే దసరా పండగ, రాజకీయ, సినీ హీరోల పుట్టినరోజు వేడుకలు, సినిమా రిలీజ్ అయ్యే సందర్భాలలో ఎటువంటి రెచ్చగొట్టే, అవమానపరిచే వ్యాఖ్యలు, చిత్రాలు, గుర్తులు ఫ్లెక్సీలలో ప్రింటింగ్ చేయకూడదని, ఆలా చేసిన యెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అమలాపురం డి ఎస్ పి టి ఎస్ ఆర్ కె ప్రసాద్ హెచ్చరించారు. ఈ సమావేశంలో అమలాపురం పట్టణ సి ఐ వీరబాబు , పట్టణ ఎస్ ఐ లు కిషోర్ బాబు, జోషి పాల్గొన్నారు.

## శ్రీ దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలులకు సర్వం సిద్ధం చేసుకున్న ఆర్య వైశ్య సంఘం




**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** శ్రీదేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమలాపురం మెయిన్ రోడ్ లో వేంచేసి ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో సెప్టెంబర్ 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు శనివారం ఉదయం వాసవి ఫంక్షన్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో తెలియజేశారు వివిధ కార్యక్రమాలలో భాగంగా 22వ తేదీ సోమవారం ఉదయం అమ్మవారిని వెండి పల్లకిలో ఊరేగింపుగా 108 కలశలతో ఆర్యవైశ్య మహిళలచే అభిషేకజలంతో అమ్మవారి ఆలయమునకు వచ్చి ఉత్సవ మూర్తికి అభిషేకం చేయనున్నట్లు ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటలకు లలితా పారాయణం 24వ తేదీ ఉదయం భగవద్గీత పారాయణం 25వ తేదీన 102 మంది కన్య పిల్లలచే కలశ పూజ 26వ తేదీ సాయంత్రం 6 గంటలకు వాసవి సిస్టర్ పామాడి నాగమణి మనోహర్ చే నాదనీరాజనం 27వ తేదీ సామూహిక లలితా సహస్ర పారాయణం 28వ తేదీ ఉదయం 9గంటలకు భగవద్గీత పై పోటీలు సౌభాగ్య వర్ధన సామూహిక కలశ, లక్ష కుంకుమార్చన 29వ తేదీ పిల్లలచే శ్రీ సరస్వతీ పూజ వచ్చేనెల 1వ తేదీ డాక్టర్ కడిమెళ్ళ వరప్రసాద్ చే ముగ్గురమ్మల మూలపుటమ్మ ఆధ్యాత్మిక ప్రవచనం వంటి కార్యక్రమాలతో పాటు ప్రతిరోజు అమ్మవారిని విజయవాడలో కనకదుర్గ అమ్మవారిని దసరా నవరాత్రుల్లో ఏ ఏ రూపాల్లో అలంకరిస్తారో శ్రీ వాసవి మాతను కూడా అమలాపురంలో ఆయారూపాలను అలంకరించడంతో పాటు సెప్టెంబర్ 26వ తేదీ శుక్రవారం అమ్మవారు 3 కోట్ల రూపాయల పైబడి కొత్త కరెన్సీ నోట్లతో శ్రీ మహాలక్ష్మి అమ్మవారిగా దర్శనం ఇవ్వనున్నట్లు కావున భక్తులందరూ అమ్మవారిని దర్శించి తరించవలసిందిగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు యె%శీ%దూరు వేంకట్రామయ్య, అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి నంబూరు నరేష్, కోశాధికారి కొమ్మూరి ప్రసాద్, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పన వీరన్న,కో చైర్మన్లు పచ్చిగోళ్ళ సోమరాజు, నూలు శ్రీనివాసు, సంఘ ముఖ్య సలహాదారులు వంకాయల కాశీ , యె%శీ%దూరి నాగేశ్వరరావు, వరదా సూరిబాబు, సలహాదారు నూలు కృష్ణ పీఆర్ఓ కాళ్ళకూరి బుజ్జి, లీగల్ సెల్ సలహాదారు, నంబూరి మూర్తి, ఉపాధ్యక్షుడు నందిపాటి శ్రీను, అదనపు కార్యదర్శి కాళ్ళకూరి కుమార్, అదనపు కోశాధికారి యర్రమిల్లి సత్తిబాబు, కార్తీక సమారాధన కమిటీ చైర్మన్ సింగంశెట్టి కుమార్ తదితరులు శనివారం పాత్రికేయుల సమావేశంలో పాల్గొని తెలియజేశారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం


ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం.

స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్.




**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం శీలంవారి సావరం గ్రామంలో పాల్గొని ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణకు యాక్షన్ ప్లాన్ తయారు చేస్తుందన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం పౌరులంతా భాగస్వామ్యం కావాలన్నారు. అలాగే ప్లాస్టిక్ నియంత్రణలో ప్రజలు ముందుకు రావాలని కోరారు. మన జీవితాల్లో ప్లాస్టిక్ ఓ భాగం అయిపోయిందని, ప్లాస్టిక్ అనర్ధాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలపై దృష్టిసారించాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో ప్లాస్టిక్, ఫ్లెక్సీల వాడకం విచ్చలవిడిగా పెరిగిపోయిందన్నారు. ప్లాస్టిక్ తో సమాజానికి ముప్పు ఉందని, విద్యార్థులు, విద్యావంతులు ఈ విషయమై విస్తృత ప్రచారం చేసి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా చూడాలని కోరారు. ప్రభుత్వం నెలలో మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు.

## నేటినుంచి దశరా శెలవులు, మరలా బడిగంట మోగేది అప్పుడే.!



**రాయవరం,విశ్వం వాయిస్ న్యూస్:** రాష్ట్ర వ్యాప్తంగా నేటినుంచి దశరా శెలవుల ను విద్యాశాఖాధికారులు ప్రకటించడంతో విద్యార్థులు ఖుషీ అవుతున్నారు. సెప్టెంబర్ 22 నుండి అక్టోబర్ 02 వరకూ దశరా శెలవులు ప్రకటించగా, ఈ రోజు ఆదివారం విద్యార్థులకు కలిసొచ్చింది. కాగా ఈ శెలవులను ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలు తప్పనిసరిగా పాటించాల్సిందేనని అధికారులు సూచించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి ప్రైవేటు పాఠశాలలు, దశరా శెలవుల లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాయవరం మండల విద్యాశాఖాధికారి వై సూర్యనారాయణ శనివారం పత్రికా ముఖంగా పాఠశాలలకు హెచ్చరికలు జారీ చేసారు. తిరిగి అక్టోబర్ 3 వ తేదిన బడి గంట మోగనుంది. విద్యార్థులు మాత్రం శెలవుల సందర్భంగా ఖుషీ అవుతున్నా.. గతించిన పరిక్షలకు సంబంధించిన పేపర్ ఆన్సర్ లతో కుస్తీ పట్టేందుకు సిద్ధమయ్యారు.

# దుర్గా మీనాక్షి ఆలయం ప్రభుత్వ స్వాధీనం

వారసత్వ హక్కులు, కోర్టు తగాదాలకు చెక్
ఏక కుటుంబ ఏకఛత్రాధిపత్యానికి చెల్లుచీటీ
ఎట్టకేలకు విజయం సాధించిన గ్రామస్తులు
దేవాదాయ శాఖకు తొలి ఆదాయం రూ. 4,97,00

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం సీతయ్యమ్మపేట పంచాయతీ పరిధిలోని శ్రీదుర్గా మీనాక్షి అమ్మవారి ఆలయాన్ని దశాబ్దాల తరబడి భక్తి, ఆధ్యాత్మికత సేవల ముసుగులో దోచుకు తింటున్న ఏక కుటుంబ ఏకఛత్రాధిపత్యానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చెల్లుచీటి పలికింది. ఈ ఆలయాన్ని శుక్రవారం సాయంత్రం ప్రభుత్వం భేషరతుగా స్వాధీనం చేసుకున్నది. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖకు అప్పగించింది. దీంతో దశాబ్దాల తరబడి నకిలీ ధర్మకర్త, గ్రామస్తులకూ మధ్య న్యాయస్థానంలో నలుగుతున్న ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. నకిలీ ధర్మకర్తలు శాశ్వతంగా తోక ముడిచారు. 2011 జనాభా గణన ప్రకారం 329 ఇళ్ళు, 1170 మంది జనాభాతో ఉన్న ఈ గ్రామం 163 హెక్టార్లలో విస్తీర్ణంలో వ్యాపించి ఉంది. 163 హెక్టార్లలో విస్తీర్ణంలో 11 హెక్టార్ల విస్తీర్ణం వ్యవసాయేతర వినియోగ భూమి ఉంది. ఈ 11 హెక్టార్ల విస్తీర్ణంలో 261 సర్వే నెంబర్లో 10.18 ఎకరాలు ప్రభుత్వ మెట్ట భూమి ఉంది. ఇదంతా రైతులు, గ్రామస్తుల ఆక్రమణలో ఉంది. 10.18 ఎకరాల్లోని సుమారు 1 ఎకరం భూమిలో కాకినాడకు చెందిన తులసి గుర్రప్ప 1983 లో శ్రీ దుర్గా మీనాక్షి అమ్మవారి ఆలయాన్ని, వంశ పారంపర్య ధర్మకర్తగా ఆయన కుటుంబానికి ఓ పెంకుటిల్లును, భక్తుల సౌకర్యార్థం ఒక షెడ్డును నిర్మించారు. గుర్రప్ప మరణం అనంతరం 2023 వరకూ ఆయన కుమారులు, కుటుంబీకుల ఏకఛత్రాధిపత్యంలోనే ఉంది. ఆలయం, ఉత్సవాలు నిర్వహణ, కానుకల ఆదాయం అంతా వారిదే. ఐతే వీరు స్థానికేతరులు కావడం, ప్రభుత్వ భూమిలోనే ఆలయాన్ని నిర్మించడం, ఆలయానికి గ్రామస్తులతో ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేయకుండా నియంత పాలన చేస్తున్న నేపథ్యంలో గ్రామస్తులు అంతా ఒక్కటి అయ్యారు. ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేయాలని గుర్రప్ప వారసులను కోరారు. ఐతే 10 మంది సభ్యులతో అందులో గుర్రప్ప కుటుంబీకుల నుంచి ఆరుగురు, గ్రామస్తుల నుంచి నలుగురు సభ్యులతో ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేద్దామని గుర్రప్ప వారసులు మెలిక పెట్టారు. అత్యధిక సభ్యులు మీరు ఉండటం కాదు. మీ కుటుంబం నుంచి ఐదుగురు, అలాగే గ్రామస్తుల నుంచి మరో ఐదుగురితో ధర్మకర్తల మండలిని ఏర్పాటుకు గ్రామస్తులు ప్రతిపాదించారు. ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో తెగే వరకూ లాగారు. 2016 లో గ్రామస్తులతో ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేసి ప్రభుత్వంలో నమోదు చేయించారు. ఆలయానికి రోడ్డు విస్తరణలో కోల్పోయిన భూమికి బదులుగా సెంటు భూమిని కొని రిజిస్టర్డు ధర్మకర్తల మండలి అమ్మ వారి దేవాలయానికి దారాదత్తం చేసింది. దీంతో వాస్తవ ధర్మకర్త తులసి గుర్రప్పని, ఆయనే ఆలయాన్ని నిర్మించారని, ఆలయ వారసత్వ ధర్మకర్తలుగా మమ్మల్నే గుర్తించాలని గుర్రప్ప కుమారులు ఒకవైపు కోరుతూ ఉండగా ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్వహణలోకి తీసుకోవాలని జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఆపై రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానంలో 2024 లో వ్యాజ్యాన్ని నమోదు చేసారు. ఈ వ్యాజ్యం కొనసాగుతుండగా ఈ ఏడాది దసరా ఉత్సవాలను రిజిస్టర్ ధర్మకర్తల మండలి ఘనంగా నిర్వహించింది. ఈ ఉత్సవాలకు డిజె. మైక్ సౌండ్ పరికరా లను ఉపయోగించి శబ్ద కాలుష్యానికి పాల్పడ్డమే కాకుండా హృద్రోగులను ఇబ్బంది పెట్టారంటూ గుర్రప్ప వారసులు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరు వర్గాల పట్టుదలలూ తారా స్థాయికి చేరాయి. దీంతో ఉత్సవాల కానుకుల ధర్మ హుండీకి తాళాలను ఉమ్మడిగా బిడాయించారు. న్యాయస్థానం తీర్పు ఇంకా వెలువడలేదు. ఈ దేవాలయాన్ని రాష్ట్ర ధర్మాదాయ దేవాదాయ శాఖ పరిధిలోనికి విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉత్తర్వులను వెలువరించింది. ఈ మేరకు కలెక్టరు షన్ మోహన్ సగిలికి ఆదేశాలు జారీ చేసింది. ఆయన ఆదేశాల మేరకు పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి, ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి కె.నాగేశ్వర్రావు, తనిఖీ ఇన్స్పెక్టర్ వి.ఫణికుమార్, శంఖవరం మండలం తాహసిల్దారు అల్లాడి తాతారావు, కత్తిపూడి శ్రీ రాజా వత్సవాయ రాణి బుచ్చి సీతయ్యమ్మ బహదూర్ ధర్మసత్రం కార్యనిర్వహణ అధికారి యర్రా వేంకటేశ్వరరావు సీతయ్యమ్మపేట శ్రీదుర్గా మీనాక్షి అమ్మవారి ఆలయానకి సాయంత్రం చేరుకుని ఆలయాన్ని పూర్వపు ధర్మకర్తల నుంచి స్వాధీనం చేసుకున్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖలోకి విలీనం ప్రక్రియను పూర్తి చేసి, ఈ ఆలయానికి కత్తిపూడి శ్రీ రాజా వత్సవాయ రాణి బుచ్చి సీతయ్యమ్మ బహదూర్ ధర్మసత్రం కార్యనిర్వహణ అధికారి యర్రా వేంకటేశ్వర రావును ఇంఛార్జి కార్యనిర్వహణ అధికారిగా నియమించి ఆలయం నిర్వహణ పూర్తి బాధ్యతలను అప్పగించారు. గత ఏడాది దసరా ఉత్సవాలకు ఉమ్మడిగా తాళాలు బిడాయించిన కానుకుల ధర్మ హుండీని తెరిచి లెక్కించారు. ఫలితంగా దేవాదాయ శాఖకు తొలి ఆదాయంగా రూ. 4,97,00 లు సమకూరింది. ఈ ఏటి దసరా ఉత్సవాలను జిల్లా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తజన రంజకంగా నిర్వహిస్తామని కొత్త ఇంఛార్జి కార్యనిర్వహణ అధికారి యర్రా వేంకటేశ్వరరావు ఈ సందర్భంగా ప్రకటించారు.





# కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజా పరిపాలన చూసి ఓర్వలేక వైసిపి ఫేక్ ధర్నాలు

**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా జగ్గంపేట స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జగ్గంపేట శాసనస భ్యులు జ్యోతుల నెహ్రూ మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఈరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతినిత్యం ప్రజల ఆరోగ్యం కోసం పాటుపడుతున్న పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు, మెడికల్ కిట్లు అందించడం జరిగిందని జగ్గంపేట నియోజకవర్గం దాదాపు 400 మందికి అన్ని రకాల పరీక్షలు చేయడం జరిగిందని వారిలో ఎవరికైనా మేజర్ ఇష్యూస్ ఉంటే వైద్యం అందించడానికి కూడా హైదరాబాద్ వరకు తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్నాను అన్నారు. ఈరోజు సాక్షి పేపర్లో ప్రభుత్వమెడికల్ కాలేజీలు వల్ల సామాన్యులు చదువుకోలేని స్థితి ఏర్పడిందని వారు ఫేక్ ధర్నాలు చేస్తున్నారని గత వైసిపి ప్రభుత్వం లో ముఖ్యమంత్రి జగన్ రెడ్డి మూడు సంవత్సరాల కాలం ఉండగా 17 కాలేజీలు సాంక్షన్ చేయించారని కానీ వాటిని మూడు సంవత్సరాలు కూడా పక్కన పెట్టారని కానీ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత 17 కాలేజీలలో ప్రభుత్వ, ప్రైవేటు, భాగస్వామ్యంతో 25 సంవత్సరాల కాలం నిబంధనతో ఏర్పాటు చేయడం జరిగిందని దీనివల్ల ప్రభుత్వానికి ఆర్థికంగా వీలుసుబాటు ఉంటుందని 25 సంవత్సరాల తర్వాత ఈ కాలేజీలు ప్రభుత్వ పరం అవుతాయని అన్నారు. మీరు ఏ విధంగా మెడికల్ కాలేజీలకు నిబంధనలను విధించారు. అదేవిధంగా మేము కూడా చేస్తున్నామని దీనివల్ల మీకు వచ్చిన నష్టం ఏమిటో అర్థం కావడం లేదని నెహ్రూ అన్నారు. సీనియర్ రాజకీయ నాయకులు తోట నరసింహం కు జగన్ రెడ్డి ఏది మాట్లాడితే అది మాట్లాడటం తప్ప దానిపై అవగాహన లేదా అని ప్రశ్నించారు మీరు సీనియర్ నాయకులు అవగాహన చేసుకుని మాట్లాడితే మంచిదని సూచించారు. మీరు ఎన్ని ఫేక్ ధర్నాలు చేసిన తర్వాత ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూనే ఉంటామని ఎమ్మెల్యే నెహ్రూ అన్నారు. ఎస్వీఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, బుర్రి సత్తిబాబు, గెద్దాడ సత్యవేణి, కమ్మిల వెంకటేశ్వరరావు, పీలా మహేష్, తుమ్మల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



## హెల్త్ క్యాంప్కు హాజరైన బాలింతలకు యన్ టి యర్ సేవ సమితి ఆధ్వర్యంలో అన్నదానం ...

**ఎటపాక విశ్వం వాయిస్ న్యూస్:** ఎటపాక మండలం నెల్లిపాక గ్రామంలో నలజాల శంకర్ రావు గారి ఆదేశాల మేరకు నెల్లిపాక హాస్పిటల్ లో స్వస్థనారి సశక్త పరివార్ అభియాన్ క్యాంప్ నకు హాజరైన గర్భిణీశ్రీలకు , బాలింతలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుట్టి రమేష్ బాబు , గొర్రుముచు రాము , నూకల దివ్య , గొడ్ల శ్రీను , హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## పోస్టల్ ఇన్సూరెన్స్ డ్రైవ్ పై సిబ్బందితో సమావేశం

**ఎటపాక విశ్వం వాయిస్ న్యూస్:** ఈ నెల 24, 25,26 తారీకులలో జరగబోయే %ూా×/ాా×% ఇన్సూరెన్స్ డ్రైవ్ ను పురస్కరించుకొని, ఈరోజు నెల్లిపాక సబ్ పోస్ట్ ఆఫీస్ నందు సబ్ పోస్ట్ మాస్టర్ మనోజ్ కుమార్ గారి అధ్యక్షతన నెల్లిపాక మరియు తోటపల్లి సబ్ పోస్ట్ ఆఫీస్ ల పరిధిలోని 27 బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ ల స్టాఫ్ కు సమావేశం జరిగింది. ఈ సమావేశం కు ముఖ్య అతిథిగా చింతూరు సబ్ డివిజన్ పోస్టల్ ఇన్స్పెక్టర్ శ్రీ అబ్దుల్ హాజరై, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ యొక్క ప్రాముఖ్యతను స్టాఫ్ అందరికీ తెలియజేస్తూ, రాబోయే 24,25,26 వ తారీకులలో జరగబోయే పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ డ్రైవ్ కు చింతూరు సబ్ డివిజన్ కు ఇన్సూరెన్స్ ప్రీమియం టార్గెట్ గా 25 లక్షలు ఇచ్చారని తెలిపారు. కావున ప్రతి బ్రాంచ్ ఆఫీస్ వారు 30000/- మరియు సబ్ ఆఫీస్ వారు 50000/- ప్రీమియం టార్గెట్ ను అచీవ్ కాగలరని తెలిపారు. చింతలగూడెంలో జాబిశెట్టి రామరాజు అనే వ్యక్తి లారీ డ్రైవర్ గా పనిచేస్తూ రోడ్డు ప్రమాదం లో ఈ మధ్యనే చనిపోతే, అతని పోస్టల్ పాలసీ కు నామినీగా ఉన్నటువంటి వారి భార్య జాబిశెట్టి పావని గారికి 10 లక్షల క్లెయిమ్ ను కూడా పోస్టల్ డిపార్ట్మెంట్ నుండి రెండు రోజుల క్రితం నామినీకు అందజేశామని అని ఈ సందర్భంగా పోస్టల్ ఇనస్పెక్టర్ అబ్దుల్ తెలిపారు. ఈ సమావేశం లో మెయిల్ ఓవర్ శీర్ కృష్ణ, కృష్ణార్జున , తోటపల్లి మరియు నెల్లిపాక పరిధిలోని 50 మంది స్టాఫ్ కూడా పాల్గొన్నారు.



## స్వస్థనారి సశక్త పరివార్ అభియాన్ క్యాంప్

**ఎటపాక విశ్వం వాయిస్ న్యూస్:** అల్లూరి జిల్లా ఎటపాక మండలం, నెల్లిపాక గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ దుర్గాప్రసాద్ గారి అధ్యక్షంలో స్వస్తి నారి సశక్త పరివార అభియాన్ కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా నెల్లిపాక ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించి మహిళలు గర్భిణీలో బాలింతలు కు వైద్య పరీక్షలు చేశారు ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించడం ఈ సందర్భంగా వైద్యాధికారులు %ఐతీ.ాతీఅనవజఅ% గైనకాలజిస్ట్ , బిజెపి మండల అధ్యక్షులు నలజాల. శ్యామ్ ప్రసాద్ , తెలుగుదేశం పార్టీ మండల ప్రెసిడెంట్ పుట్టి రమేష్ బాబు తదితరులు మాట్లాడుతూ ఆరోగ్యం పై పలు సూచనలు ఇచ్చారు మహిళలకు ప్రబలే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు ఆరోగ్యవంతమైన మహిళలతో ఆ కుటుంబం బలమైనదిగా ఎదుగుతుంది అన్నారు గర్భిణీలో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. గర్భిణులు తప్పనిసరిగా ఆసుపత్రిలో ప్రసవాలు చేయించుకోవాలని దీంతో తల్లి బిడ్డ సురక్షితంగా ఉంటారన్నారు గర్భిణీలో గర్భిణులకు వ్యాక్సినేషన్ వేయించుకోవాలని సూచించారు క్యాన్సర్ వంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు మూడు వారాలకు దగ్గు ఉంటే తప్పకుండా క్షయపరీక్ష చేయించుకోవాలనీ సూచనలు ఇవ్వడం జరిగింది. క్యాన్సర్ లాంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచనలు మరియు పరిసరాల పరిశుభ్రత గురించి విద్యార్థులకి అవగాహన కల్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గారు మరియు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి గారు మరియు డాక్టర్ దుర్గాప్రసాద్, కంటి వెలుగు పార్వతి (%ఎం%) సత్యవాణి, (%మీనూ%) లు మరియు %ూచీవీం% హెల్త్ అసిటెంట్ మరియు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం.
స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్.

**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం శీలంవారి సావరం గ్రామంలో పాల్గొని ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణకు యాక్షన్ ప్లాన్ తయారు చేస్తుందన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం పౌరులంతా భాగస్వామ్యం కావాలన్నారు. అలాగే ప్లాస్టిక్ నియంత్రణలో ప్రజలు ముందుకు రావాలని కోరారు. మన జీవితాల్లో ప్లాస్టిక్ ఓ భాగం అయిపోయిందని, ప్లాస్టిక్ అనర్థాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్లాస్టిక్కు ప్రత్యామ్నాయాలపై దృష్టిసారించాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో ప్లాస్టిక్, ఫ్లెక్సీల వాడకం విచ్చలవిడిగా పెరిగిపోయిందన్నారు. ప్లాస్టిక్ తో సమాజానికి ముప్పు ఉందని, విద్యార్థులు, విద్యావంతులు ఈ విషయమై విస్తృత ప్రచారం చేసి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా చూడాలని కోరారు. ప్రభుత్వం నెలలో మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు.




## సాయిప్రియ సేవా సమితి 164 వ వారం అన్నదానం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సాయిప్రియ సేవా సమితి ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం కేంద్రం పిఠాపురం పశువుల సంతలో అన్నదాతలైన రైతులకుగా నిరవధికంగా వారానికి ఒక రోజు చొప్పున శనివారం మధ్యాహ్నం పూట ఆంధ్రా అన్నపూర్ణ డొక్కా సీతమ్మ గుర్తుగా డొక్కా సీతమ్మ అన్నపానీయ సదుపాయ కేంద్రం పేరుతో నిర్వహిస్తున్న అన్నదానం ఈ శనివారంతో 164 వ వారానికి చేరుకుంది. అన్ని దానాల కన్న అన్నదానం మిన్న అన్న లోకోక్తి అనుసారం దేశానికి వెన్నెముకైన అన్నదాతకు పెట్టెడు అన్నం పెట్టి వారిని ఆదుకుంటే అదే మహా భాగ్యమని భావించిన కాకినాడ జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ తలంచారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన శ్రీనివాస్ స్థానికంగా 2010 లో సాయిప్రియ సేవా సమితిని స్థాపించి, దానికి వ్యవస్థాపక అధ్యక్షులుగా కొనసాగుతూ శంఖవరం మండలం కత్తిపూడి కేంద్రంగా సాయిప్రియ సేవా సమితి ద్వారా వివిధ ప్రజాభివృద్ధి, సంక్షేమ, అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలను 15 ఏళ్ళుగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణ డొక్కా సీతమ్మ అన్నసదుపాయ కేంద్రం పేరుతో పిఠాపురం పట్టణంలో పశువుల సంత కేంద్రంగా రైతులు, పశువుల బేరగాళ్ళు, మధ్యవర్తులు, స్థానిక వివిధ ఆస్పత్రులకు వచ్చే దూర ప్రాంతాల రోగులకూ ప్రతీ శనివారం మధ్యాహ్నం అన్నదానాన్ని నిర్వహిస్తూ ఉన్నారు. ఈ అన్నదానం ఈ శనివారంతో 163 వ వారానికి చేరుకుంది. దీనిని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సేవా స్ఫూర్తితో నిర్వహిస్తున్నారు. నేటి మధ్యాహ్నం రైతులకు, పశువుల బేరాల మధ్యవర్తులకు, వివిధ ఆస్పత్రులకు వచ్చిన ఔట్ పేషెంట్లకు కలిపి 675 మందికి అన్నదానం చేశారు. ఆహార పదార్థాలు వడ్డనలో స్వచ్ఛందంగా సేవలను అందించిన కోలా నాని, సఖినాల లచ్చబాబు, జ్యోతుల నాని, విప్పర్తి శ్రీనులను సాయిప్రియ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి జ్యోతుల శ్రీనివాసు అభినందించారు. తమ ఈ సేవలను పిఠాపురం పశువుల సంతకు వచ్చే రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని శంఖవరం మండలం కత్తిపూడిలోని సాయిప్రియా సేవా సమితి ప్రధాన కార్యాలయం ఓ ప్రకటనలో కోరింది.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

**జగ్గంపేటలో పారిశుద్ధ్య కార్మికుల సత్కారం, మెడికల్ కిట్ల పంపిణీ.. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**




**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా జగ్గంపేట పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేమని వారు లేనిదే ప్రజారోగ్యం లేదని, కొవిడ్ సమయంలో ప్రాణాలను కూడా లెక్కచేయక విధులు నిర్వర్తించిన తీరు మరువలేనిదని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం రాజమండ్రి రోడ్ లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆవరణలో జగ్గంపేట మండలం లో 102 మంది పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఘన సన్మానం, మెడికల్ కిట్లు పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే నెహ్రూ శానిటేషన్ కిట్లు తోపాటుజ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా స్టీల్ వాటర్ బాటిల్ అందజేశారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. జగ్గంపేట మండలం ఎంపీడీవో చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూమాట్లాడుతూ స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పారిశుద్ధ్య కార్మికులకు మనోధర్యం కల్పించేలా వారికి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించి వారిని ఘనంగా సత్కరించి వారికి శానిటేషన్ కిట్లు పంపిణీ చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం తీసుకున్నామని అన్నారు. అదేవిధంగా ప్రతి పంచాయతీలను పారిశుద్ధ్య కార్మికుల జీతాలు పెంచి అందించాలని సెక్రెటరీ ఆదేశించారు. దీనికి కావాల్సిన పర్మిషన్లు నేను తీసుకొస్తాను. ఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, అడపా భరత్, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్తకొండ బాబు, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ ప్రణీత్, అడబాల వెంకటేశ్వరరావు, పైడిపాల సూరిబాబు, బుర్రి సత్తిబాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ పాండ్రంగి రాంబాబు, లక్కిరెడ్డి సూర్యావతి, బస్వా చినబాబు, రేఖ బుల్లి రాజు, ఉప్పలపాటి బుల్లెబ్బి, మండపాక అప్పన్న దొర, రాయి సాయి, సర్వసిద్ధి లక్ష్మణరావు, కంటే రామారావు, సుంకర సీతారామయ్య, బిక్కిన బాబి, తదితరులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్

తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్

ఆదివారం 21 సెప్టెంబర్ 2025

www.viswamvoice.com






# డా.ద్వారపూడి శ్రీనుకు అంతర్జాతీయ గ్లోబల్ శాంతి ఐకాన్ అవార్డు

- సి.సి.యమ్ కు రెండవ అంతర్జాతీయ గ్లోబల్ పీస్ ఐకాన్ పురస్కారం
- ముఖ్య అతిథులుగా కొరియా దేశానికి చెందిన ప్రొఫెసర్ మాథ్యూస్ హాంగ్
- గ్రేటర్ విశాఖపట్నంలో ప్రదానం.. సి.సి.యమ్ ఫౌండర్ అండ్ చైర్మన్ డా.ద్వారపూడి శ్రీను వెల్లడి

అభినందనలు తెలిపిన ప్రముకులు,దైవసేవకులు, ఆటోనగర్ నాయకులు

**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** రాజమహేంద్రవరం రూరల్ బుచ్చియ్యనగర్ కు చెందిన ద్వారపూడి శ్రీనుకు అంతర్జాతీయ గ్లోబల్ శాంతి ఐకాన్ అవార్డు లభించింది.దైవసేవ చేస్తు,రాజమండ్రి ఆటోనగర్ లో వెల్డింగ్ పని చేసుకుంటూ సి.సి.యమ్ ట్రస్టును ప్రారంభించి నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం,అన్నధాన కార్యక్రమాలు నిర్వహించి ఆకలి తీర్చడం, చలికాలంలో గిరిజనులకు, వృద్దులకు దుప్పట్లు పంపిణీ చేయడం,రక్తదాన కార్యక్రమాలు నిర్వహించడం,ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించడం మొదలైన సేవాకార్యక్రమాలు చేస్తున్నాడు.ట్రస్టు ద్వారా చేసిన సేవాకార్యక్రమాలకు గతంలో గౌరవ డాక్టరేట్ అవార్డుతో పాటు మథర్ ధెరిస్సా నేషనల్ అవార్డు, శ్రీకృష్ణ దేవరాయలు నేషనల్ అవార్డు, డా.సర్వేపల్లి రాధకృష్ణన్ ఇన్ స్ప్రేషన్ అవార్డుతో పాటు అంతర్జాతీయ శాంతి ఐకాన్ ప్రతిభ





అవార్డు రావడం జరిగింది.ఈ ఏడాది సెప్టెంబర్ 21న అంతర్జాతీయ శాంతి దినోత్సవం పురస్కరించు కుని గ్లోబల్ ఆర్గనేషన్ వారు దేశంలో సేవాకార్యక్రమాలు చేస్తున్న సేవాపరులకు అంతర్జాతీయ.గ్లోబల్ శాంతి పురస్కారాలు అంద జేశారు.వారిలో డాక్టర్ ద్వారంపూడి శ్రీను ఉన్నారు. ఈ కార్యక్రమంలో కొరియా దేశానికి చెందిన , ఇంటర్ నేషనల్ మైండ్ ఎడ్యుకేషన్ ఇనుస్టూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ మాథ్యూస్ హాంగ్ ముఖ్య అతిథిగా పాల్గొని అవార్డు గ్రహితలకు అవార్డులను ప్రదానం చేశారు. గ్లోబల్ పీస్ గురించి చక్కటి సందేశం తెలిపారు. ఈ కార్యక్రమంలో డొ.ద్వారపూడి శ్రీను మాట్లాడుతూ సి సి ఎం ద్వారా చేస్తున్న సేవాకార్యక్రమాలకు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు రావడం చాల సంతోషంగా ఉందని,ఈ నెలలో రెండు అంతర్జాతీయ గ్లోబల్ శాంతి ఐకాన్ అవార్డులు రావడం మరింత ఆనందంగా ఉందని తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.ట్రస్టు కు సహకారాన్ని అందిస్తున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ప్రముఖ బిషఫ్ లు, యన్ జి ఓ లు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత ఎమ్మెల్యే ముప్పిడి





**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన అనారోగ్యాల బారి నుండి రక్షించుకోగలమని, ఆంధ్రప్రదేశ్ ను స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రగా తీర్చేతరుణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కొవ్వూరు పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ నందు మొక్కలను నాటి స్కూలు పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్యపరమైన ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఇంటిని శుభ్రంగా ఉంచడంతోపాటు ఆ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వలన అంటువ్యాధులు ప్రబలకుండా ఉంటాయన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్రాలో ప్రతి వ్యక్తి బాధ్యత తో పని చేయాలన్నారు ప్రతి ఇంటి వద్ద ఒక మొక్కను నాటాలని మొక్కను నాటిన దగ్గర నుండి వాటి సంరక్షణ బాధ్యతలను స్వీకరించాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు మున్సిపల్ సిబ్బందికి కూడా ప్రజలు సహకరించాలని తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రలో కొవ్వూరు మున్సిపాలిటీ ప్రథమ స్థానంలో ఉంచాలని, మున్సిపాలిటీ పరిధిలో చెత్తను ఎక్కడబడితే అక్కడ వేయకుండా తడి చెత్త పొడి చెత్తను వేరువేరుగా డస్ట్ బిన్ లో వేయాలని ప్రజలు దీనికి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ద్వి సభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ సూరపనేని చిన్ని, కొవ్వూరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దాయన రామకృష్ణ, సూర్యదేవర రంజిత్ కుమార్, కౌన్సిలర్లు బత్తి నాగరాజు, పిల్లలమర్రి మురళీకృష్ణ, బిజెపి నాయకులు బోడపాటి ముత్యాలరావు, మున్సిపల్ కమిషనర్ గ్రంధి సందీప్ కుమార్, పెనుమాక జయరాజు, చిగురుపల్లి సతీష్, తదితర ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు??

## సిద్ధి వినాయక ఆలయ కమిటీ కృషి అభినందనీయం..

అన్న సమారాధనలో శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ప్రశంస



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ప్రతి ఏటా వినాయక చతుర్థి సందర్భంగా క్రమం తప్పకుండా సిద్ధి వినాయక ఆలయ కమిటీ నిర్వహిస్తున్న ఉత్సవాలు అభినందనీయం అని ఏపీ శెట్టి బలిజ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ప్రశంసించారు. శనివారం మధ్యాహ్నం దివాన్ చెరువులోని ఆటోనగర్ ప్రాంగణంలో కొలువై ఉన్న సిద్ధివినాయక స్వామి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కుడుపూడి సత్తిబాబు ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు భోజనం వడ్డించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల సేవలో ఆటోనగర్ యూనియన్ ఆలయం కృషిని అభినందించారు. ఆధ్యాత్మిక,సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని సత్తి బాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు గుబ్బల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తాడి వీర అప్పారావు,కార్యదర్శి షేక్ హసీమ్,సంయుక్త కార్యదర్శి పిల్లి గణేష్, కోశాధికారి చింతలపూడి వీర్రాజు,ఆలయ కమిటీ అధ్యక్షులు నమ్మి శంకర్ కుమార్,గౌరవ సలహాదారు అడపా శ్రీనివాస్ రావు , ఇద్దరు గౌరవ అధ్యక్షులు దుబ్బిరెడ్డి వెంకట్రావు, నక్కా సన్యాసిరావు, ఉపాధ్యక్షులు నక్కా శ్రీనివాస్ రావు,శీలం గోవింద్,అలంకార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కొవ్వూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి దినోత్సవం

విద్యార్థి స్థాయి నుండి శాంతి మార్గంలో ప్రయాణించాలి

లైన్స్ క్లబ్ అధ్యక్షులు పెనుమాక జయరాజు



**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** సమాజంలో శాంతి సంస్కృతిని పెంపొందించడంలో అందరూ భాగస్వాములు కావాలని కొవ్వూరు లైన్స్ క్లబ్ అధ్యక్షులు పెనుమాక జయరాజు అన్నారు. ప్రపంచ శాంతి దినోత్సవం సెప్టెంబర్ 21 ఆదివారం కావడంతో లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆదేశాల మేరకు 20వ తేదీ శనివారం ప్రపంచ శాంతి దినోత్సవం కొవ్వూరు పట్టణంలోని గవర్నమెంట్ హై స్కూల్ నందు కొవ్వూరు లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ అధ్యక్షులు పెనుమాక జయరాజు మాట్లాడుతూ ప్రపంచ యుద్ధాలతో అన్ని దేశాలు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయని ప్రపంచం శాంతిగా ఉన్నప్పుడే ఆర్థికంగా అభివృద్ధి చెందగలమనే ఆలోచనతో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి దినోత్సవాన్ని ఏర్పాటు చేసుకొని శాంతి సాధనకై కృషి చేయడం జరుగుతుందన్నారు. వివాదాలతో సమస్య పరిష్కారం కాదని శాంతి మార్గం ద్వారా ఎంతటి సమస్యనైనా పరిష్కరించుకోగలమన్నారు విద్యార్థి స్థాయి నుండి శాంతి మార్గాన్ని పాటించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎస్ కే బెహరాజియా, లైన్స్ క్లబ్ సభ్యులు బూరుగుపల్లి వెంకటేశ్వరరావు మహమ్మద్ హుస్సేన్ పాక జయరాం కలగర వెంకటరావు తదితర లైన్స్ క్లబ్ సభ్యులు గవర్నమెంట్ హై స్కూల్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## వంగా వీరభద్రరావు కుటుంబాన్ని చందన పరామర్శ...



**ధవలేశ్వరం,విశ్వం వాయిస్ న్యూస్:** ధవలేశ్వరం వైఎస్ఆర్ సీపీ దివ్యాంగుల సెల్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పోసి కుమార్ మావయ్య స్వర్గీయ వంగా వీరభద్రరావు కుటుంబాన్ని రాష్ట్ర పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ పరామర్శించారు. శనివారం ఉదయం ధవలేశ్వరంలో పోసి కుమార్ స్వగృహం వద్ద ఆయన మామయ్య స్వర్గీయ వంగా వీరభద్రరావు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. స్వర్గీయ వంగా వీరభద్రరావు కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధవలేశ్వరం వైఎస్ఆర్సిపి నాయకులు దేవులపల్లి సరితరాణి,కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముద్దాల అను,తలారి ప్రసాద్,మెండ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అన్ని విధాలుగా ఆదుకుంటాం - ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

తైలేరియా వ్యాధి సోకి గేదెలు మరణించడం దురదృష్టకరం



ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రైతులను అన్ని విధాల ఆదుకుంటుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు ఇటీవల తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామంలో తైలేరియా వ్యాధి సోకి గేదెలు మరణించిన సంఘటన పై ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం కొవ్వూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు పశుసంవర్ధక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో తైలేరియా వ్యాధి సోకి గేదెలు మరణించడం దురదృష్టకరమని దీనివలన రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకునే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు శుక్రవారం ఈ విషయంపై అసెంబ్లీలో వ్యాఖ్యానించడం జరిగిందని తెలిపారు టైలరిగా వ్యాధి మిగిలిన పశువులకు సంక్రమించకుండా తగిన జాగ్రత్తలను వరితెగతన చేపట్టాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు ఇలాంటి సంఘటనలు జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, డిడి ఎస్ నారాయణ, ఏడి టి వెంకటరెడ్డి కొవ్వూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ద్వి సభ్య కమిటీ సభ్యులు గంట మంది రామకృష్ణ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సూరపనేని చిన్ని బేతన నారాయణ తదితర వెటర్నటీ డాక్టర్లు రైతులు పాల్గొన్నారు

## రామాయణం ధర్మాలు న్యాయాలు నైతిక విలువలు అనే అంశంపై దృశ్య రూపకం



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాల్మీకి ఫౌండేషన్ రామనారాయణ విజయనగరం వారి సౌజన్యంతో నేడు రామాయణం–ధర్మాలు– న్యాయాలు– నైతిక విలువలు అనే అంశంపై అంతర్జాల దృశ్యరూపం ప్రసారమైంది.తద్వారా విద్యార్థులు సంస్కారవంతమైన ప్రవర్తనను అలవరచుకొనే అవకాశం లభిస్తుందని ప్రిన్సిపాల్ డా.డి. చిట్టిబాబు అన్నారు. మధ్యాహ్నం ప్రతినెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ మాసం లక్ష్యం గ్రీన్ ఏపీని పురస్కరించుకొని మున్సిపల్ మరియు అధ్యాపకులు హరే రామ్ కృష్ణ, సుబ్బారావు, డా.నాగేశ్వరరావు, డా"మాధవ్, అలేఖ్య, వాణి, మీనాక్షి,వెంకటేష్ ఫణీంద్ర కుమార్ దుర్గాప్రసాద్, షేక్ దర్గా మదీనా, జాతీయ సేవా పథకం సమన్వయకర్త సుధామయి, విద్యార్థులు 20 మొక్కలు నాటి కళాశాల ప్రాంగణాన్ని పచ్చదనంతో నింపారు.

## ఆదివాసీ నిరుద్యోగుల అరెస్టును ఖండిస్తున్నాం.

– ఆదివాసీ జేఏసీ,భారత్ ఆదివాసీ పార్టీ



**దేవీ పట్నం,విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలని కోరుతూ గిరిజన మంత్రి క్యాంప్ ఆఫీస్ ముట్టడికి వెళ్లిన ఆదివాసీ నిరుద్యోగ యువతను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్, భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర ఉప అధ్యక్షులు తెల్లం శేఖర్ ఖండించారు. ఈ సందర్భంగా తెల్లంశేఖర్ మాట్లాడుతూ నిన్నటి రోజున సాలూరులో గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఇంటి ముట్టిడి కార్యక్రమాన్నికి మన్యంలోని 5 ఐటీడీఏల నుండి ఆదివాసీ నిరుద్యోగులు వెళ్లి 2025 మెగా డీఎస్సీ నోటిఫికేషన్ లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయటంతో షెడ్యూల్డ్ ప్రాంత ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగింది. కావున షెడ్యూల్డ్ ప్రాంత నిరుద్యోగులకు షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించి తక్షణమే ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శాంతి యుతంగా నిరసన తెలియజేస్తున్న ఆదివాసీ నిరుద్యోగులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఏపీ ఆదివాసీ జేఏసీ, భారత్ ఆదివాసీ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.ఏపీ రాష్ట్ర ముఖ్య మంత్రి ఎన్నికల ముందు అరకులో ఆదివాసీ నిరుద్యోగులకు 100 శాతం ఉద్యోగాలు స్థానిక ఆదివాసీ నిరుద్యోగులతోనే భర్తీ చేసేందుకు జీఓ నెంబర్ 3 పునరుద్ధరిస్తామని హామి ఇచ్చారు.కానీ నేటికీ జీఓ నెంబర్ 3 కు ప్రత్యామ్నాయ జీఓ గాని షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం గాని తీసుకు రాలేదు.మరియు ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించలేదన్నారు.ఇప్పటికైన ఏపీ సీఎం ఎన్నికల ముందు ఆదివాసీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీ,100 శాతం రిజర్వేషన్ అమలు పై వర్క్ షాపు విషయం పై స్పష్టత ఇచ్చి ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## పోసికుమార్‌ను పరామర్శించిన ఆర్.ఎస్.ఆర్ సుబ్బరాజు.



**ధవలేశ్వరం,విశ్వం వాయిస్ న్యూస్:** స్థిరవారం ఉదయం ధవలేశ్వరం గ్రామం నందు కాపునేత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల సెల్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్ ను ఆయన స్వగృహములో ఆర్ ఎస్ అర్ సుబ్బరాజు ఫౌండేషన్ చైర్మన్ సుబ్బరాజు పరామర్శించారు.ఇటీవల పోసి కుమార్ మావయ్య వంగ వీరభద్రరావు స్వర్గస్తులైనందున వీరభద్రరావు కుటుంబ సభ్యులకు రంకిరెడ్డి, సుబ్బరాజు పరామర్శించి. వీరభద్రరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## రాజమండ్రిలో దస్తావేజు లేఖరుల పెన్ డౌన్..





**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్** ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోప భూయిష్టమైన 2.0 రిజిస్ట్రేషన్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా దస్తావేజు లేఖరుల పెన్ డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.అందులో భాగంగా రాజమండ్రి జిల్లా రిజిస్టర్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రెండు రోజులు పాటు పెన్డౌన్ కార్యక్రమాన్ని వారు కొనసాగించనున్నారు. 2.0 రిజిస్ట్రేషన్ విధానవల్ల ప్రజలకు దస్తావేజు లేఖర్లకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు. 2.0 రిజిస్ట్రేషన్ విధానంలో ఓటీపీలు ప్రవేశపెట్టడం ద్వారా ప్రజలు ఓటీపీలు చెప్పేందుకు సంకోచిస్తున్నారన్నారు. ఆటో మ్యుటేషన్ సిస్టం మంచిదే అయినప్పటికీ శాఖ అధికారుల సమన్వయ లోపం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. పి.డి.ఈ విధానానికి తమ వ్యతిరేకం కాదని అందులో లోపాలను సరిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖర్ల జిల్లా అధ్యక్షుడు నల్లమిల్లి వీర్రెడ్డి, రాజమండ్రి అధ్యక్షులు కోలా రామచంద్ర రావు, సెక్రెటరీ బేరి సూర్యనారాయణ రెడ్డి, కోలా శివ,ముదపాక నాగేశ్వరరావు,తోట ప్రకాష్, కొయ్య దుర్గారెడ్డి,అజయ్, జె. రామచంద్రరావు, ఎన్ వి త్రినాథ్,కిలపర్తి రవి పాల్గొన్నారు.

# గ్రీన్ గన్నవరం లక్ష్యం : ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, మహానగర్



గ్రీనరీని అభివృద్ధి చేసి గ్రీన్ గన్నవరం లక్ష్యంగా పరిశుభ్రత, పచ్చదనంలో మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. శనివారం ఉదయం నిడమానూరులోని గణేష్ ఆలయం వద్ద మొక్కలు నాటి స్వచ్ఛా ద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఇందులో భాగంగా బాపులపాడు, గన్నవరం గ్రామాల్లో జాతీయ రహదారిపై డివైడర్ పైన మొక్కలు నాటిన సంగతి గుర్తు చేశారు. గన్నవరం నుంచి రామవరప్పాడు వరకు ఎయిర్పోర్ట్ కారిడార్ లో గ్రీనరీ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరగా సానుకూలంగా స్పందించి అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా రూ. 7.98 కోట్ల కేటాయించి నందుకు ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపారు. ట్రిబుల్ ఐటీ గచ్చిబౌలి ని గన్నవరంలో ఏర్పాటు చేయించేందుకు తాను చేసిన ప్రయత్నాలు సఫలీకృతం కాగా విమానాశ్రయం చుట్టూ ఏడు కిలోమీటర్ల పరిధిలో 30 ఎకరాల భూమిని కేటాయిస్తే ట్రిబుల్ ఐటీ ఏర్పాటు చేసేందుకు సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసిందన్నారు. గన్నవరం నియోజకవర్గంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని వాటిని స్వాధీనం చేసుకుంటే పలు అంతర్జాతీయ సంస్థలను ఇక్కడ ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని యార్లగడ్డ వివరించారు. నైనవరంలో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడటం రెవెన్యూ యంత్రాంగానికి తలకి మించిన భారంగా మారిందన్నారు. అంబాపురంలో రూ.25 కోట్ల విలువచేసే కామన్ సైట్ ఆక్రమించేందుకు రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారులు శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ భూములు కాపాడాలని రెండు జిల్లాల కలెక్టర్లను కోరడంతో సానుకూలంగా స్పందించిన కలెక్టర్లు విచారణ కమిటీలను నియమించారని యార్లగడ్డ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ భూముల ఆక్రమణల వివరాలను కూటమి నాయకులు విచారణ కమిటీకి ఇవ్వాలని సూచించారు. అసెంబ్లీకి రాకుండా ఎన్నికల్లో పోటీ చేయటం వల్ల ఏం ప్రయోజనం ఉందని వెంకటరావు వైసీపీ నాయకులను ప్రశ్నించారు. ఎన్నికలు మనకు కావాల్సినప్పుడు రావని అవి షెడ్యూల్ ప్రకారం వస్తాయని చలోక్తులు విసిరారు. ఎంతో కష్టపడి ఎన్నో ఆశలతో తొలిసారి విజయం సాధించిన వైసీపీ ఎమ్మెల్యేలు జగన్ తీరుపై ఆగ్రహంగా ఉన్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలిచినా అసెంబ్లీ గడప తొక్కకుండా టీవీలో అసెంబ్లీ సమావేశాలు చూడాల్సి రావటం బాధాకరమన్నారు. తమ టీవీలకే పరిమితం అయిపోతామేమోనని వైసీపీ ఎమ్మెల్యేలు బాధపడుతున్నారని ఎద్దేవా చేశారు. జగన్ ప్రెస్మీట్లను మీడియా బహిష్కరిస్తే అప్పుడైనా అసెంబ్లీకి వస్తారేమోనని యార్లగడ్డ చమత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గూడవల్లి నరసింహారావు, మాజీ ఛైర్మన్ కోటగిరి వరప్రసాద్, మాదల నాని బాబు, మేడేపల్లి రమ, గుజ్జర్లపూడి బాబురావు, సాంబు, కొల్లా ఆనంద్ కుమార్, బండి వెంకట్రావ్, ఆడుసుమిల్లి నవీన్, ఆదాం షఫీ, కానూరి యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

# అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవు

**ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు**
**అభివృద్ధి కార్యక్రమాల్లో కూటమి నాయకులు భాగస్వాములు కావాలని పిలుపు**

గన్నవరం, మహానగర్



అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమల్లో ప్రభుత్వ అధికారుల అలసత్వాన్ని సహించేది లేదని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హెచ్చరించారు. శనివారం ఉదయం విజయవాడ రూరల్ మండలం నిడమానూరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో పంచాయతీ పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు ఇతర సిబ్బందిని సన్మానించి వారికి ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లను, దాతల సమకూర్చిన దుస్తులు, నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే యార్లగడ్డ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో యార్లగడ్డ మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలో ప్రభుత్వంతో చర్చించి పలు కార్పొరేట్ సంస్థల ఏర్పాటుకు అనుమతులు తీసుకు వస్తే పలు కారణాలవల్ల అవి ఆగిపోవడం బాధాకరమన్నారు. వీటిలో భూమి కొరత కారణంగా ట్రిబుల్ ఐటీ ఏర్పాటుకు ఆటంకం కలిగిందని, రామవరప్పాడులో రూ.70 లక్షల ఖర్చుతో భవనం నిర్మించేందుకు రామోజీ ఫౌండేషన్ ముందుకు రాగా ఇక్కడ రాజకీయ కారణాలతో వెనకడుగు పడిందన్నారు. ఇదే గ్రామంలో 32 కెవి సబ్ స్టేషన్ల రెండు మంజూరు చేయించగా ప్రభుత్వ భూముల కొరత కారణంగా అవి నిర్మాణానికి నోచుకోలేదని, రూ. 6 కోట్ల ఖర్చుతో ఎనికెపాడులో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నిర్మాణానికి తాను అనుమతులు తీసుకొస్తే అదీ కార్యరూపం దాల్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సూపరిపాలన కార్యక్రమం సందర్భంగా 37 గ్రామాలు తిరిగిన తాను పలు సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించినా కొన్నిచోట్ల అధికారులు ఆశించిన స్థాయిలో పనులు చేయటం లేదని అధికారుల తీరుపై యార్లగడ్డ మండిపడ్డారు. గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి కూటమి నాయకులు, కార్యకర్తలు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను సక్రమంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత కూటమి నాయకుల పై ఉందని హితబోధ చేశారు. నిడమానూరు, రామవరప్పాడు, నున్న, అంబాపురం గ్రామాల్లో గ్రామానికి ఒకటి చొప్పున క్రికెట్ బాక్సులు ఏర్పాటు చేయాలని 20 రోజుల్లో వాటిని సిద్ధం చేసి క్రీడాకారులకు అందుబాటులో ఉంచాలని అధికారులు ఆదేశించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు కొరత ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తాను ప్రభుత్వం నుంచి గాని లేదా పరిశ్రమల సిఎస్ఆర్ ఫండ్స్ నుంచి గాని నిధులు తీసుకొస్తానని యార్లగడ్డ భరోసా ఇచ్చారు. నిడమానూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐలు ముందుకు రావాలని యార్లగడ్డ పిలుపునిచ్చారు. ఎన్నారైలు ఇచ్చే నిధులకు తాను కూడా వ్యక్తిగతంగా సొంత నిధులు ఇచ్చి అభివృద్ధిలో పాలుపంచుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 52 మంది సిబ్బందికి రూ. 60 వేలు విలువ చేసే దుస్తులు వితరణగా ఇచ్చిన ఎన్. వెంకటరత్నాన్ని ఎమ్మెల్యే వెంకట్రావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గూడవల్లి నరసయ్య, మాజీ ఛైర్మన్ కోటగిరి వరప్రసాద్, టిడిపి నాయకులు గూడపాటి తులసిమోహన్, కొలుసు రవీంద్ర, బొప్పన హరికృష్ణ, గుజ్జర్లపూడి బాబురావు, మేడేపల్లి రమ, గండికోట సీతయ్య,కోనేరు సందీప్, సాంబు, కానూరి యుగంధర్, నరేష్, బాబీ, చంటి, జనసేన నాయకులు కొల్లా ఆనంద్ కుమార్ వార్డు సభ్యులు జ్యోతిరాణి, నర్రా సీతమహాలక్ష్మి, తోటకూర విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్-1బీ పిడుగు

-మొదటిపేజీ తరువాయి

ఉన్నవారు లక్ష డాలర్లు చెల్లించకపోతే వారి హెచ్-1బీ పిటిషన్లను 12 నెలల వరకు పరిశీలించం.

అమెరికాలో ఉద్యోగం చేద్దామని కలలు కంటున్న భారతీయులు సహా ప్రపంచంలోని వివిధ దేశాల వారికి పిడుగులాంటి వార్త. హెచ్-1బీ వీసాల వార్షిక దరఖాస్తు రుసుమును లక్ష డాలర్ల (సుమారు రూ.88 లక్షలు)కు పెంచుతూ ట్రంప్ యంత్రాంగం సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ భారీ పెంపునకు సంబంధించిన కార్యనిర్వాహక ఉత్తర్వులపై అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం సంతకాలు చేశారు. భారత్‌లో, అందునా తెలుగు రాష్ట్రాలను తీవ్రంగా ప్రభావితం చేసే ఈ నిర్ణయం ఈ నెల 21 నుంచి ఒక ఏడాది పాటు అమల్లో ఉండనుంది. ఇది భారత్‌నే కాదు.. చైనా సహా పలు దేశాలనూ ప్రభావితం చేయనుంది. వార్షిక ఫీజు పెంపుతో ఉద్యోగులతో పాటు టెక్ కంపెనీలూ తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయి. ఇతర దేశాల్లో ఉన్న హెచ్-1బీ వీసాదారులు తక్షణమే అమెరికాకు తిరిగి రావాలని ఇమ్మిగ్రేషన్ అటార్నీలు సూచనలు జారీచేస్తున్నారు. భారత కాలమానం ప్రకారం వీరంతా ఆదివారం ఉదయం 9.30 గంటలకల్లా అమెరికా చేరుకోవాలని, లేకపోతే.. పెంచిన హెచ్-1బీ వార్షిక ఫీజు ప్రకారం రూ.88 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని వార్తలు రావడంతో అగ్రరాజ్యానికి వెళ్లే విమానాల కోసం హెచ్-1బీ వీసాదారులు భారీస్థాయిలో విమానాశ్రయాలకు చేరుకుంటున్నారు. మరోవైపు అమెరికాలో అలజడి రేగుతోంది. పండుగలకు భారత్ వెళ్లాలనుకొనే వారు తమ ప్రయాణాలను రద్దు చేసుకుంటున్నారు. విమానాలు ఎక్కిన వారు కూడా దిగిపోతున్నారు. లక్ష డాలర్ల ఫీజు పెంపుపై అయోమయం నెలకొనడంతో వైట్‌హౌస్ వివరణ ఇచ్చింది. కేవలం కొత్త వీసాదార్లకు మాత్రమే ఈ ఫీజు వర్తిస్తుందని తెలిపింది. “నైపుణ్యమున్న అంతర్జాతీయ ఉద్యోగులను తీసుకొనే సంస్థలు ఏటా ప్రతి ఉద్యోగికి ఈ వీసా ఫీజు కింద ఆరు సంవత్సరాల వరకు లక్ష డాలర్లు చెల్లించాలి. ఈ ఫీజు కొత్త దరఖాస్తుదారులకు మాత్రమే వర్తిస్తుంది” అని వైట్‌హౌస్ ప్రతినిధి తెలిపారు.

**అందుకే ఈ నిర్ణయం: ట్రంప్**

హెచ్-1బీ వీసా పథకం తీవ్రంగా దుర్వినియోగం అవుతోందని ఫీజు పెంపు ఉత్తర్వులపై సంతకం చేస్తూ ట్రంప్ పేర్కొన్నారు. దేశ భద్రతకే ముప్పుగా పరిణమించిందని అన్నారు. హెచ్-1బీ వీసాల మాటున కొన్ని సంస్థలు మోసాలకు పాల్పడుతున్నాయని తెలిపారు. అత్యంత నైపుణ్యం కలిగిన వ్యక్తులే తమ దేశానికి రావాలని కోరుకుంటున్నట్లు వ్యాఖ్యానించారు. ఈ చర్యను టెక్ పరిశ్రమ వ్యతిరేకించబోదని చెప్పారు.

**సింహభాగం భారతీయులే**

1990లో అత్యంత నైపుణ్యం కలిగిన విదేశీ నిపుణుల కోసం హెచ్-1బీ వీసాను తీసుకొచ్చారు. యూఎస్‌లోని టెక్నాలజీ కంపెనీలు విదేశీ నిపుణుల కోసం ఇవి జారీ చేస్తాయి. హెచ్-1బీ వీసాదారుల్లో ఇండియాకు 71 శాతం వాటా, చైనాకు 11.7 శాతం వాటా ఉంది. ఈ ఫీజు పెంపు నేరుగా మన ఐటీ ప్రొఫెషనల్స్‌పై ప్రభావం చూపనుంది. ఇన్ఫోసిస్, టీసీఎస్, విప్రో, కాగ్నిజెంట్, హెచ్‌సీఎల్ వంటి కంపెనీలు ప్రతి సంవత్సరం వేలాది ఉద్యోగులను అమెరికాకు పంపుతున్నాయి. ఇప్పుడు ఒక్కో ఉద్యోగి కోసం దాదాపు రూ.88 లక్షలు ఖర్చు చేయడం ఆర్థికపరంగా భారంగా మారనుంది.

**తక్షణం తిరిగి వచ్చేయండి**

అమెరికా బయట ఉన్న హెచ్-1బీ వీసాదారులు ఆదివారం ఉదయం 9.30 గంటల్లోపు అగ్రరాజ్యానికి చేరుకోవాలని, లేకపోతే లక్ష డాలర్లు (రూ.88 లక్షలు) చెల్లించాల్సి ఉంటుందని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఇతర దేశాల్లో ఉన్న హెచ్-1బీ వీసాదారులు తక్షణమే అమెరికాకు చేరుకోవాలని మైక్రోసాఫ్ట్, మెటా వంటి టెక్ సంస్థలు తమ ఉద్యోగులకు ఆదేశాలు జారీచేసినట్లు తెలుస్తోంది. ఇతర దేశాల్లో ఉన్న హెచ్-1బీ, హెచ్-4 వీసాదారులు ఈ నెల 21 లోపు అమెరికాకు తిరిగిరావాలని కోరుతూ మైక్రోసాఫ్ట్ కూడా తమ ఉద్యోగులకు అడ్వైజరీ జారీ చేసినట్లు తెలుస్తోంది. అమెరికాలోనే విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు మంచి భవిష్యత్తు కోసం అక్కడే పనిని కొనసాగించాలని మైక్రోసాఫ్ట్ సూచించినట్లు తెలుస్తోంది. మరో దిగ్గజ సంస్థ మెటా కూడా తమ ఉద్యోగులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. పని లేదా సెలవుల కోసం ఇతర దేశాలకు వెళ్లిన హెచ్-1బీ వీసా కలిగి ఉన్న తమ ఉద్యోగులు 24 గంటల్లోగా అమెరికాకు తిరిగి వచ్చేయాలని ఆదేశాలు ఇచ్చింది. అమెరికాలో ఉంటున్న హెచ్-1బీ, హెచ్-4 ఉద్యోగులు రెండు వారాలు పాటు ఇతర దేశాలకు వెళ్లొద్దని సూచించింది.

**ధనవంతులకు ‘గోల్డ్ కార్డ్’**

హెచ్-1బీ వీసాదారులకు వార్షిక ఫీజు భారీగా పెంచిన ట్రంప్.. ధనవంతులైన విదేశీయుల కోసం ‘గోల్డ్ కార్డ్’ పథకం తెచ్చారు. ఇందులో చేరాలనుకొనే వ్యక్తులు 1 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.8.81 కోట్లు) అమెరికా ట్రెజరీకి బహుమతిగా చెల్లించాలి. వారినేదైనా కార్పొరేషన్ స్పాన్సర్ చేస్తే రెండు మిలియన్ డాలర్లు (సుమారు 17.62 కోట్లు) చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకం కింద నమోదైన వారికి గ్రీన్‌కార్డ్ కూడా లభ్యం కానుంది. “మేం ఈ పథకం ద్వారా వందలాది బిలియన్ డాలర్లు తీసుకుంటున్నాం. ఈ డబ్బుతో పన్నులు తగ్గిస్తాం, అప్పునూ తగ్గించుకుంటాం” అని ట్రంప్ చెప్పారు.

**అమెరికాలో విదేశీ ఉద్యోగుల శకం ముగిసింది**
**- అమెరికా వాణిజ్యశాఖ మంత్రి**

హెచ్-1బీ వీసాల వార్షిక రుసుమును అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీగా పెంచడంపై ఆ దేశ వాణిజ్య మంత్రి హొవార్డ్ లుట్నిక్ కీలక వ్యాఖ్యలు చేశారు. కష్టపడి పనిచేసే అమెరికన్ల నుంచి విదేశీ వ్యక్తులు ఉద్యోగాలు లాక్కొనే పద్ధతికి కొత్త వీసా నిబంధనలు ముగింపు పలుకుతాయని వ్యాఖ్యానించారు. తద్వారా అమెరికాకు గణనీయమైన ప్రయోజనం లభిస్తుందని అన్నారు. “కష్టపడి పనిచేసే అమెరికన్ల నుంచి ఉద్యోగాలను లాక్కొంటున్న పద్ధతికి ముగింపు పలుకుతాం. ఆర్థిక వ్యవస్థను ఉపయోగించుకొని ప్రతిఫలంగా ఏమీ అందించకుండా పని చేసే కార్మికులను తగ్గిస్తాం. అది దేశానికి గణనీయంగా ప్రయోజనం చేకూరుస్తుంది” అని తెలిపారు.

**మోయలేని భారం**

హెచ్-1బీ వార్షిక ఫీజు పెంపు భారం మోయలేనంతగా ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికాలో ఒక మధ్యస్థాయి ఇంజినీర్ సంవత్సరానికి 1,20,000 డాలర్లు సంపాదిస్తే.. అందులో లక్ష డాలర్లు వీసా ఫీజు అంటే.. 80 శాతం జీతం అక్కడే పోతుంది. దీనివల్ల అత్యధిక స్థాయిలో వేతనం పొందేవారు మినహా మిగిలినవారు యూఎస్ వలస వెళ్లడం పెనుభారమే అవుతుంది. అమెరికాలో మాస్టర్స్, పీహెచ్‌డీ పూర్తి చేసిన తర్వాత హెచ్-1బీ వీసాలకు మారే కమ్యూనిటీలో కూడా భారతీయులదే ఆధిపత్యం. ఇప్పుడు ఈ పిడుగు లాంటి వార్త వారి కెరీర్

## ఆత్మనిర్భరతే ఏకైక పరిష్కారం

భావ్‌నగర్

ఇతర దేశాలపై ఆధారపడడమే భారత్ అతిపెద్ద శత్రువు అని ప్రధాని మోదీ అన్నారు. చిప్స్(సెమీకండక్టర్) నుంచి షిప్స్ వరకు స్వదేశీ ఉత్పత్తులను అభివృద్ధి చేసుకుని ఆత్మనిర్భరతను చాటడడమే దీనికి ఏకైక పరిష్కారమని తెలిపారు. శనివారం గుజరాత్‌లో పర్యటించిన ప్రధాని ‘సముద్రం ద్వారా సమృద్ధి’ పేరిట నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.34,200 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం మోదీ మాట్లాడుతూ.. అన్ని సమస్యలకు ఏకైక పరిష్కారం.. ఆత్మనిర్భరతేనని చెప్పారు. “140 కోట్ల మంది ప్రజల భవితను విదేశీ శక్తులకు వదిలేయం. దేశ అభివృద్ధి సంకల్పం.. విదేశాలపై ఆధారపడి ఉండదు. భవిష్యత్తు తరాలను ఇతరులపై నెట్టేయం” అని ప్రధాని తేల్చి చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పాలించిన పార్టీ.. యువత సామర్థ్యాన్ని తొక్కిపెట్టిందంటూ కాంగ్రెస్ పార్టీపై ప్రధాని విమర్శలు గుప్పించారు. ‘లైసెన్స్ రాజ్’తో పరిమితులు విధించి యువతను నిర్వీర్యం చేసిందన్నారు. లైసెన్స్-కోటా కారణంగా దీర్ఘకాలిక చిక్కుముడులు ఏర్పడి, ప్రపంచ మార్కెట్‌లో ఒంటరిగా నిలిచిపోయామన్నారు. గత ప్రభుత్వాల విధానాలు.. దేశ సామర్థ్యాన్ని ఎలా దెబ్బతీశాయో చెప్పడానికి నౌకా రంగమే ప్రధాన ఉదాహరణ అని ప్రధాని మోదీ తెలిపారు. కాంగ్రెస్ హయాంలో స్వదేశీ నౌకా నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసి, విదేశీ నౌకలను అద్దెప్రాతిపదికన వినియోగించుకోవడం వల్ల ఏటా రూ.6 లక్షల కోట్లను విదేశీ కంపెనీలకు చెల్లించాల్సి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలోనే సముద్రయాన రంగంలో వరుస సంస్కరణలు తీసుకువచ్చినట్టు ప్రధాని తెలిపారు. పెద్ద పెద్ద నౌకలకు మౌలిక సదుపాయాల హోదా కల్పించడం ద్వారా సముద్రయాన రంగాన్ని మరింత బలోపేతం చేసే చరిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకున్నామని వివరించారు. “తద్వారా నౌకా నిర్మాణ కంపెనీలు బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి సులభంగా రుణాలు పొందే అవకాశం ఉంటుంది” అని ప్రధాని పేర్కొన్నారు. అంతేకాదు, వన్ నేషన్-వన్ డాక్యుమెంట్(ఒక దేశం-ఒక పత్రం), వన్ నేషన్-వన్ పోర్ట్(ఒక దేశం-ఒక నౌకాశ్రయం) విధానాన్ని అమలు చేస్తున్నామని, తద్వారా వ్యాపార, వాణిజ్యాలు అత్యంత సులభతరం అవుతాయని తెలిపారు.

## ఓట్ చోరీపై త్వరలో హైడ్రోజన్ బాంబ్

వయనాడ్

భారత ఎన్నికల కమిషన్‌పై కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ తాజా విమర్శల దాడి చేశారు. కర్ణాటకలో ‘ఓట్ చోరీ’కి సంబంధించిన సమాచారాన్ని ఎన్నికల కమిషన్ ఆ రాష్ట్ర సీఐడీకి ఇవ్వలేదని ఆరోపించారు. కేరళలోని వయనాడ్‌లో మీడియాతో రాహుల్ మాట్లాడుతూ, సీఐడీ పదేపదే వివరాలు ఇవ్వాలని కోరినా ఎన్నికల కమిషన్ ముఖం చాటేసినట్టు చెప్పారు. ‘ఇంతకంటే పెద్ద నేరారోపణ ఏమి ఉంటుంది? పోలీసులు సమాచారం అడిగారు, వాళ్లు ఇవ్వలేదు. ఇది నా స్టేట్‌మెంట్ కాదు, ఇది నిజం. ఇది ఆధారాలతో సహా చాలా స్పష్టంగా ఉంది’ అని రాహుల్ పేర్కొన్నారు.

**హైడ్రోజన్ బాంబ్ బహిర్గతం చేస్తాం**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఓట్ చోరీ చేసి గెలిచారనడంలో ఎవరికీ సందేహం లేదని, ఇందుకు సంబంధించిన సాక్ష్యాలతో కూడిన హైడ్రోజన్ బాంబును త్వరలోనే బహిర్గతం చేస్తామని రాహుల్ గాంధీ అన్నారు. తాను ఆధారాలు లేకుండా ఏదీ మాట్లాడనని చెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తున్న వారికి ఎన్నికల కమిషన్ కొమ్ముకాస్తోందని రాహుల్ పదేపదే విమర్శలు గుప్పిస్తున్నారు. గత గురువారంనాడు కూడా మీడియా సమావేశంలో ఆయన కర్ణాటక అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన డాటాను ప్రస్తావిస్తూ, కాంగ్రెస్ ఓటర్ల ఓట్లను ఒక పద్ధతిప్రకారం తొలగించారని ఆరోపించారు. కాగా, రాహుల్ ఆరోపణలను ఎన్నికల కమిషన్ పూర్తిగా నిరాధారమంటూ తోసిపుచ్చింది

## 60 రోజుల్లో దేశం విడిచి వెళ్లండి

ఇప్పటికే అక్రమ వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తున్న అమెరికా సిరియన్ వలసదారులకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. సిరియా వలసదారులకు కల్పిస్తున్న తాత్కాలిక రక్షణ హోదాను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. తాత్కాలిక రక్షణ హోదా కింద రక్షణ పొందుతున్న వారంతా 60 రోజుల్లోగా దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశించింది. లేదంటే అరెస్టులు చేస్తామని హెచ్చరించింది. కాగా వేల మంది సిరియన్ పౌరులు తాత్కాలిక రక్షణ హోదా కింద అమెరికాలో నివసిస్తున్నారు. 2012 నుంచి దాదాపు 6 వేలకు పైగా సిరియా వలసదారులు ఈ రక్షణ పొందుతున్నట్లు అంచనా. ఈ క్రమంలో వారి బహిష్కరణపై అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. అక్కడ నెలకొన్న పరిస్థితులు వారిని తిరిగి స్వదేశానికి వెళ్లకుండా నిరోధించలేవని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ అధికార ప్రతినిధి ట్రిసియా మెక్లాఫ్లిన్ వ్యాఖ్యానించారు. సుమారు రెండు దశాబ్దాలుగా ఉగ్రవాదం, ఉగ్రకార్యకలాపాలకు సిరియా కేంద్రంగా మారిందని, తమ దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా అక్కడి వారిని తమ దేశంలో ఉండేందుకు అనుమతించడం కుదరదని ట్రిసియా పేర్కొన్నారు. 60 రోజుల గడువులోగా స్వచ్ఛందంగా దేశం వీడాలని, లేదంటే సంబంధిత చట్టాల కింద అరెస్టు, డిపోర్టేషన్ చేస్తామని వార్నింగ్ ఇచ్చారు.

## అలాంటి ట్రాప్‌లో పడొద్దు

ఇంటర్నెట్‌డెస్క్

ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశపెట్టి.. భారతీయ పౌరులను ఇరాన్ తీసుకెళ్లి కిడ్నాప్ చేసిన ఘటనలు ఇటీవల వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా వీటిపై భారత విదేశాంగశాఖ స్పందించింది. అలాంటి ట్రాప్‌లలో పడొద్దని హెచ్చరికలు జారీ చేసింది. ‘భారతీయ పౌరులకు ఉద్యోగం ఇప్పిస్తామని, ఇరాన్ వెళ్లమని.. ప్రలోభాలకు గురిచేసిన కేసులు ఇటీవల కొన్ని వెలుగు చూశాయి. ఇరాన్‌కు చేరుకున్నాక వారిని క్రిమినల్ ముఠాలు కిడ్నాప్ చేశాయి. వారిని విడుదల చేయాలంటే డబ్బులు ఇవ్వాలని బాధిత కుటుంబాలను డిమాండ్ చేస్తున్నాయి. ఇలాంటి ఉద్యోగ ఆఫర్ల విషయంలో కచ్చితమైన అప్రమత్తత పాటించాలని భారతీయులను కోరుతున్నాం. పర్యాటక ప్రయోజనాల కోసం మాత్రమే ఇరాన్ ప్రభుత్వం భారతీయులకు వీసా రహిత ప్రవేశాన్ని అనుమతిస్తోందనే విషయాన్ని గమనించాలి. ఉపాధి లేదా ఇతర ప్రయోజనాల కోసం ఇరాన్ వెళ్లాలని సూచించే ఏజెంట్‌లు క్రిమినల్ ముఠాలతో కుమ్మక్కై ఉండవచ్చు. కాబట్టి వారి ట్రాప్‌లో పడకుండా.. అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నాం’ అని విదేశాంగశాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ హెచ్చరించారు. ఆస్ట్రేలియాలో ఉద్యోగం వస్తుందనే ఆశతో వెళ్లిన కేరళకు చెందిన ఓ వ్యక్తిని ఇరాన్‌లో ఓ ముఠా కిడ్నాప్ చేసిన సంగతి తెలిసిందే. హరియాణాలో ఇమిగ్రేషన్ సేవలు అందిస్తున్నట్లు అమన్ అనే వ్యక్తి కేరళకు చెందిన హిమాన్షు మాథుర్‌కు పరిచయమయ్యాడు. ఆస్ట్రేలియాలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి.. కొంత డబ్బు తీసుకొని ఇరాన్ తీసుకెళ్లాడు. అక్కడ ఓ గ్యాంగ్ వీరిని కిడ్నాప్ చేసింది. అమన్ కూడా ఆ గ్యాంగ్‌లో భాగమేనని పోలీసులు తెలిపారు. ఆ తర్వాత మాథుర్ కుటుంబానికి కిడ్నాపర్‌లు ఫోన్ చేసి రూ.కోటి డిమాండ్ చేయగా.. చివరకు రూ.20 లక్షలు తీసుకొని విడుదల చేశారు. అంతకుముందు కూడా ముగ్గురు భారతీయ యువకులు టెహ్రాన్‌లో ఇలానే కిడ్నాప్‌కు గురయ్యారు. ఉద్యోగం కోసం ఏజెంట్ల సాయంతో దిల్లీ మీదుగా ఆస్ట్రేలియాకు బయలుదేరిన యువకులను ఇరాన్‌లో ఓ ముఠా వారిని కిడ్నాప్ చేసి డబ్బులు డిమాండ్ చేసింది. ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి పోలీసుల సాయంతో బందీలుగా ఉన్న యువకులను విడిపించారు.

## ఉగ్రవాద కుట్ర భగ్నం

శ్రీనగర్

జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద కుట్రను భద్రతా దళాలు భగ్నం చేశాయి. చైనా గ్రెనేడ్లతోపాటు పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. పూంచ్ సెక్టార్‌లోని ఒక చోట ఆయుధాలున్నట్లు నిఘా సమాచారం అందింది. దీంతో భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. 20 చైనా హ్యాండ్ గ్రెనేడ్‌లతో సహా పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఉగ్రవాద కార్యకలాపాల కోసం తరలించేందుకు వాటిని అక్కడ దాచినట్లు భద్రతా సిబ్బంది అనుమానం వ్యక్తం చేశారు.

# స్వచ్ఛమైన నీటితోనే విద్యార్థులకు శారీరక ఆరోగ్యం

**పరిశుభ్రమైన తాగునీరు అందించడం అభినందనీయం**

**కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవీందర్ గౌడ్**

**కోరుట్ల :** పరిశుభ్రమైన తాగునీరు విద్యార్థులకు అందించడం అభినందనీయమని, స్వచ్ఛమైన తాగునీటితోనే శారీరక ఆరోగ్యం అని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవీందర్ గౌడ్ అన్నారు. కోరుట్ల ప్రభుత్వ గడి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ఫిల్టర్ అందించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రమైన నీరు అందించడం హర్షణీయం అన్నారు. అందరి ఆరోగ్యంగా ఉంచాలనే ఆలోచన లయన్స్ క్లబ్ నిర్వాహకులకు రావడం అభినందనీయమన్నారు. గోనెపల్లి వీరయ్య గౌడ్–వజ్రమ్మ జ్ఞాపకార్థం వారి కూతుళ్ళు, అల్లుళ్ళు గరుగుల మంజుల సదానంద్, గడ్డమీది లహరి ? సునీల్ కుమార్ రాధాకృష్ణ దంపతులు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు మాట్లాడుతూ ఏదో ఒక రూపంలో సేవ చేయాలనే సంకల్పంతో కోరుట్ల లయన్స్ క్లబ్ ముందుకొచ్చిందన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొమ్ముల జీవన్ రెడ్డి మాట్లాడుతూ సర్వరోగాలు మలినమైన నీరు తాగడంతోనే వస్తున్నాయని స్వచ్ఛమైన నీరు విద్యార్థులకు అందించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలనేదే లయన్స్ క్లబ్ ప్రజాసేవకు ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. స్వచ్ఛమైన నీరు విద్యార్థులు, టీచర్లకు అందిస్తున్నామని




తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొమ్ముల జీవన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏలేటి లక్ష్మారెడ్డి, కోశాధికారి నల్ల గంగాధర్, లయన్స్ గుంటుక సురేష్ బాబు, ఆడెపు మధు, అల్లాడి ప్రవీణ్, పోతని ప్రవీణ్, అజయేంధర్ రావు, మంచాల జగన్, నరేందర్, పిడుగు గుణాకర్ రెడ్డి, పడాల నారాయణ గౌడ్, గంగుల రాజశేఖర్, కల్లెం గంగా రెడ్డి , వేంకట్రాములు, హెచ్ఎం నునావత్ రాజు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బతుకమ్మ తెలంగాణ జనజీవన శైలికి ప్రతీక

**జగిత్యాల :** బతుకమ్మ తెలంగాణ జనజీవన శైలికి ప్రతీక అనిజగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ బిఎస్.లత అన్నారు.శనివారంజగిత్యాల ఎస్.కె.ఎన్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రత్యేకతను ప్రతిబింబించే ఈ పూల పండుగలో విద్యార్థినులు, అధ్యాపక సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జగిత్యాల అదనపు కలెక్టర్ బి.ఎస్.లత మాట్లాడుతూ బతుకమ్మ పండుగ స్త్రీల ఆరాధన పండుగగా, ప్రకృతి సంపదను కాపాడే పండుగగా, తెలంగాణ సాంస్కృతిక చిహ్నంగా నిలుస్తుందని అన్నారు. గౌరమ్మ పూజ ద్వారా మహిళల ఆధ్యాత్మిక శక్తి, కుటుంబ బంధాలు మరింత బలపడతాయని, వేర్వేరు రకాల పువ్వులతో బతుకమ్మను అలంకరించడం ప్రకృతి పట్ల గల గౌరవానికి ప్రతీక అని వివరించారు.కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ. అశోక్ మాట్లాడుతూ బతుకమ్మ ప్రతి మహిళకు సంబంధించిన పండుగ మాత్రమే కాకుండా, సమాజాన్ని కలుపుకునే వేదిక అని, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడే ఉత్సవమని అన్నారు.ఈ సందర్భంగా విద్యార్థినులు బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేసి వాతావరణాన్ని ఉత్సాహభరితంగా మార్చారు. పూలతో అలంకరించిన బతుకమ్మలను వలయాకారంలో చుట్టూ ఆడుతూ సాంప్రదాయాన్ని




ప్రతిబింబించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. శ్రీనివాస్, లెఫ్టినెంట్ పి.రాజు, గోవర్ధన్ సాయి మధుకర్, కే శ్రీనివాస్ లైబ్రేరియన్ కే సురేందర్ దివ్యరాణి, డాక్టర్ మహేష్ స్వరూప, సుప్రియ, కవిత రజిత, వేణు, గట్టయ్య ,పవన్ కళ్యాణ్, ప్రమోద్, ఏవో అరవింద్, నీరజ గణేష్ , ప్రభు తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. చివరగా బతుకమ్మను ఘనంగా నిమజ్జనం చేశారు.

# స్వదేశీ ఉత్పత్తుల వినియోగం పెంచాలి

**హైదరాబాద్ :** విదేశాల నుంచి దిగుమతులు తగ్గించుకొని స్వదేశీ వస్తువుల వినియోగం పెంచగలిగినప్పుడే భారత దేశం స్వయం సమృద్ధిని సాధించగలుగుతుందని చేవెళ్ళ ఎంపీ కొండా విశ్వేశ్వర్రెడ్డి అన్నారు. భారత్ గ్లోబల్ ఇండస్ట్రీస్ ఫోరం రీజినల్ వైస్ ప్రెసిడెంట్ బొల్లంపల్లి ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్లో ఏర్పాటు చేసిన సదస్సులో స్వదేశీ వస్తువుల వినియోగం పెంపు, జీఎస్టీ సరళీకరణ, ప్రభుత్వంపై పడుతున్న భారం తదితర అంశాలపై వివిధ పారిశ్రామిక, వ్యాపార వర్గాల ప్రతినిధులు చర్చించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ళ ఎంపీ కొండా విశ్వేశ్వర్రెడ్డి మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని జీఎస్టీ కౌన్సిల్ ప్రవేశ పెట్టిన కొత్త జీఎస్టీ విధానంతో తాత్కాలికంగా కేంద్ర ప్రభుత్వానికి రావాల్సిన రాబడి సుమారు 7 లక్షల కోట్లు తగ్గనుందన్నారు. అయితే పారిశ్రామిక వర్గాలు దేశ ప్రజల మీద ప్రభుత్వానికి ఉన్న విశ్వాసం వల్ల రానున్న కాలంలో జీఎస్టీ వల్ల ఎక్కువ మొత్తంలో పన్నులు వచ్చే అవకాశం ఉందన్నారు. విదేశాల నుంచి అనేక కీలకమైన రంగాల్లో దిగుమతులు ఎక్కువగా చేసుకుంటుండటం వల్ల విదేశీ




మారకద్రవ్యం ఖర్చు చేయాల్సి వస్తుందని ఈ సమస్యను అధిగమించేందుకు వ్యూహాత్మకంగా కేంద్ర ప్రభుత్వం చొరవతో ఇతర దేశాల సంస్థలతో వ్యాపార ఒప్పందాలు కుదుర్చుకోవాలని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయన్నారు. ఇటీవల అమెరికా విధిస్తున్న సుంకాల ప్రభావాన్ని తగ్గించుకునేందుకు స్వదేశీ ఉత్పత్తులను ఎక్కువగా వినియోగించాల్సిన అవసరం మరింత పెరిగిందన్నారు. ఈ అంశాలపై పరిశ్రమ పెద్దలు, వ్యాపారస్తులు స్వదేశీ జాగరణ మంచ్ ప్రతినిధులు కలిసి నివేదిక రూపంలో కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలకు అందజేయనున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సదస్సు నిర్వాహకులు బొల్లంపల్లి ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ అగ్రికల్చర్, డిఫెన్స్, డిఫెన్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డ్రోన్, ఇన్సూరెన్స్, నిర్మాణ రంగం, పర్యాటక రంగం, మౌళిక సదుపాయాలు, ఉత్పత్తి రంగంతో సహా అనేక రంగాల్లో స్వదేశీ వస్తువుల వినియోగాన్ని పెంచేందుకు మంచి అవకాశాలు ఉన్నాయని పరిశ్రమ పెద్దలు ప్రత్యేక ప్రత్యేక చొరవ తీసుకొని ఇటీవల ఈ అంశంపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నారన్నారు. ఈ సదస్సులో వచ్చిన సూచనలన్ని కేంద్ర ప్రభుత్వానికి విన్నవిస్తామన్నారు. తద్వారా రానున్న రోజుల్లో కొత్త సంస్కరణలు, ప్రోత్సాహకాలు రూపొందించే అవకాశం ఉంటుందన్నారు. ఈ సదస్సులో భారత్ గ్లోబల్ ఇండస్ట్రీస్ ఫోరం ఆలిండియా ఆర్గనైజింగ్ సెక్రటరి సిద్దార్థ శర్మ, స్వదేశి జాగరణ మంచ్ నేషనల్ కన్వనీర్ సుందరం, ఆలిండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ కశ్మీర్ లాల్, ఆలిండియా కో?ఆర్గనైజింగ్ సెక్రటరీ సతీష్ కుమార్, నేషనల్ కో?కన్వీనర్ ప్రొఫెసర్ అశ్విని మహాజన్, నేషనల్ కో?కన్వీనర్ భగవంతు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక మాఫియాకు ఇదే సాక్ష్యం

**ఇందిరమ్మ ఇళ్లకు పేరుమీద ఇసుకకు పర్మిషన్ ఒక చోట పర్మిషన్ ఉంటే మరొక చోట ఇసుక తోడుట**

**పోలీసులు టాక్టర్లను స్వాధీనం చేసుకుంటే అధికారులు ఫైన్ ల తో సర్దుబాటు**

**ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అధికారులు,ఇసుక మాఫియా**

ఇందిరమ్మ ఇండ్ల కోసం ఒక చోట పర్మిషన్ లు తీస్కుంటూ అదే పర్మిషన్ లతో వేరే చోట ఇసుక ను తోడేస్తున్నారు. అధికారులు సైతం అక్రమార్కులకు (ఇసుక మాఫియా ) కు తోడుగా నిలుస్తున్నారు. ఇందుకు సాక్ష్యం వికారాబాద్ జిల్లా యాలాల మండలం గోవింద రావు పేట్ లో అక్రమార్కులు ఇసుకను తోడేస్తుంటే గ్రామస్తులు అడ్డుకొని పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు అట్టి ఇసుక ట్రాక్టర్ లను పోలీస్ స్టేషన్ కు తరలించారు.అయితే అదే ఇసుక ట్రాక్టర్ లను విడిపించేందుకు తాండూరు మండల తహసీలదార్ ఇచ్చిన ఇసుక పర్మిషన్ లను చూపించడం తో ఇసుక మాఫియా వ్యవహారం బయట పడటం జరిగింది. వివరాల్లోకెళ్తే ఈ నెల 17 వ తేదీన తాండూరు మండాలానికి



చెందిన లక్ష్మి బాయి ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం ఆరు సీబీమ్ మీటర్ ల రెండు ట్రాక్టర్ ల ఇసుక తరలింపు కోసం పాత తాండూరు లోని కాగ్నా నది నుండి ఇసుకను తరలుంచుకునేందుకు పర్మిషన్ ఇవ్వడం జరిగింది. అక్రమార్కులు పర్మిషన్ లెటర్ లను ఆసారాగా చేసుకొని వేరొక్క మండలం యాలాల మండల పరిధిలో ని గోవిందరావు పేట్ కాగ్నా నది నుండి ఇసుకను సుమారు 20 ట్రాక్టర్ ల మేర ఇసుకను తోడేశారు. గ్రామస్థులు ఇసుక తరలింపు ను అడ్డుకొని పోలీసుల కు అప్ప చెప్పారు. పోలీసులు తిరిగి దీనిపై సంబంధిత ఎమ్మార్వో సంజాయిషి పంపించారు. అధికారులు మాత్రం ఫైండ్లతో సరిపెట్టి ట్రాక్టర్లను వదిలేస్తున్నారు. ఇసుక మాఫియా తాండూర్ లో మితిమీరిపోతున్నాయి. అలాగే ఎర్రమట్టి,సుద్ద,నాపరాతి, ఇసుక అక్రమలకు పండుగగా మారింది

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత మొక్కలు నాటండి

**తల్లిలాగా కాపాడండి**

**జగిత్యాల డి. ఎఫ్. వో రవి ప్రసాద్**



**జగిత్యాల, సెప్టెంబర్ 20:** పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని మొక్కలను నాటడమే కాకుండా కన్న తల్లిలా కాపాడుకోవాలని జగిత్యాల జిల్లా అటవీ శాఖ అధికారి రవి ప్రసాద్ అన్నారు. శనివారం కల్లెడ జిల్లా పరిషత్ హైస్కూల్లో కేంద్ర ప్రభుత్వ పథకం ఏక్ పేడ్ అప్నే మాకే నాంపే లో భాగంగా వంద మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికియ్ ముఖ్య అతిథిగా హాజరైన డి. ఎఫ్. వో మాట్లాడారు. పర్యావరణ అసమతుల్యతతో మానవాలికి ముప్పు తొలిగిపోలేదన్నారు. ఓజోన్ పొర పై కార్బన్ మోనాకసైడ్ ప్రభావం ఇంకా పడుతూనే ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ తమందరి బాధ్యత గా భావించి విరివిగా మొక్కలను నాటి వాటిని సంరక్షించుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ లో భాగంగా అప్నే మాకే నాంపే ఏక్ పేడ్ అనే అద్భుత పథకాన్ని తెచ్చిందన్నారు. తల్లిని ఎంతగా ప్రేమిస్తామో అదే తరహాలో నాటిన మొక్కను ప్రేమిస్తూ పెంచి పెద్దగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఎంపివో, స్పెషల్ ఆఫీసర్ రవిబాబు, ఆ పాఠశాల హెచ్. ఎం. స్వరూపారాణి, ఉపాధ్యాయులు రమేష్, తోపాటు పలువురు టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

**ఐసీడిఎస్ సూపర్ వైజర్ కవితారాణి**

**జగిత్యాల :** గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సూపర్ వైజర్ కే. కవితా రాణి సూచించారు. జాతీయ పోషణ మాసం సందర్భంగా జగిత్యాల పట్టణంలోని చిలుకవాడ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులతో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సూపర్ వైజర్ కవిత రాణి మాట్లాడుతూ రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, సీజనల్ పండ్లు తీసుకోవాలన్నారు.ప్రతి రోజు భోజనంలోఒక పూటచిరు ధాన్యాలుతో కూడిన భోజనం ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. అభా కార్డు, అపార్ కార్డు జనరేట్ చేసి వాటి ప్రాముఖ్యత గురించి కవితరాణి వివరించారు.ఏఎన్ఏం మాదేశి శిరీషా మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వల్ల వ్యాధులు రాకుండా నివారించవచ్చాన్నారు. రక్త హీనత వల్ల జరిగే నష్టాల గురించి ఆమే వివరించారు.కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సావిత్రి, ఆశ కార్యకర్త లావణ్య తదితరులు పాల్గొన్నారు.



## తై బజార్ వేలం రద్దు చేసిన ఘనత కాంగ్రెస్ దే.

**మాజీ మంత్రి జీవన్ రెడ్డి**



**జగిత్యాల :** రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా జగిత్యాల కూరగాయల మార్కెట్లో తై బజార్ వేలంను రద్దు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి పేర్కొన్నారు. జగిత్యాల పట్టణంలోని టవర్ సర్కిల్ లోని కూరగాయల, మాంసం మార్కెట్ ను శనివారం మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ నిరుపేద వర్గాలకు చెందిన కూరగాయల వ్యాపారుల ఆర్థిక పరిస్థితిని గమనించి తన హయాంలో విజిటేబుల్ మార్కెట్ తై బజారు వేలంను రద్దు చేసినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా అయన కూరగాయల విక్రేతలు, రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన వెంటనే సంబంధించిన అధికారులతో మాట్లాడి మార్కెట్ లో కూరగాయలు విక్రేతలకు ఫ్యాన్స్, లైట్లు తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు.


## విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

**క్రీడలతోనే శరీరక దృఢత్వంజిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**జగిత్యాల :** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని వివేకానంద మిని స్టేడియంలోజిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో జాతీయ క్రీడ దినోత్సవంలో భాగంగా శనివారం నిర్వహించిన క్రీడోత్సవాలను జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉరుకుల పరుగుల జీవన విధానంలో ప్రతిఒక్కరు క్రీడలపై దృష్టి పెట్టాలన్నారు.క్రీడల ద్వారా పని ఒత్తిడిని తగ్గించుకుని మానసికంగా దృడంగా ఉండాలన్నారు.ఆటల్లో గెలుపోటములు సహజమని ఓడినవారు అనుభవంగా మలుచుకొని విజయం సాధించే దిశగా పట్టుదలతో కృషిచేయాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటిల్లో పాల్గొనాలని కోరారు.ఈరోజు క్రీడల పోటీలలో క్రికెట్ 8 జట్లు వాలీబాల్ బాలురు 9 జట్లు బాలికలు 3 జట్లు పాల్గొనగా బ్యాడ్మింటన్ లో 32 మంది పాల్గొన్నారు. దీంతోపాటు మహిళా ఉద్యోగులకు ప్రత్యేకంగా లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్ క్రీడలు నిర్వహించడం జరిగిందని జిల్లా యువజన, మరియు క్రీడల అధికారి డాక్టర్ కోరుకంటి రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్ , డిఆర్డిఓ రఘువరన్ , జిల్లా అధ్యక్షులు పడాల విశ్వాసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# మటన్ ఎక్కువగా తింటున్నారా!




ఎర్ర మాంసం పోషకాలతో సమృద్ధిగా ఉన్నప్పటికీ దానిని అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం. ముఖ్యంగా ప్రాసెస్ చేసిన మాంసాలు ఆరోగ్య సమస్యలు తెస్తాయి. ఇటీవలి పరిశోధనలు ఇది గుండె జబ్బులు, టైప్ 2 డయాబెటిస్, క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుందని హెచ్చరించాయి. మటన్ అంటే చాలామందికి ఇష్టమైన ఆహారం. దాని రుచి, పోషకాల కారణంగా దీనిని ఎక్కువగా తింటుంటారు. కానీ ఎర్ర మాంసాన్ని దానిని అతిగా తీసుకుంటే తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల జరిగిన కొన్ని పరిశోధనలు ఈ విషయంలో మరింత ఆందోళన కలిగించే విషయాలను వెల్లడించాయి. గొడ్డు మాంసం, దూడ మాంసం, పంది మాంసం, గొర్రె, మేక మాంసం వంటి జంతువుల నుండి వచ్చే మాంసాన్ని ఎర్ర మాంసం అంటారు. దీనికి ఎరుపు రంగు రావడానికి కారణం మయోగ్లోబిన్ అనే ప్రోటీన్. ఎర్ర మాంసంలో విటమిన్ బి12, ఐరన్, జింక్, బి-విటమిన్లు వంటి ఎన్నో ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. ఇది శరీరానికి సులభంగా లభించే అధిక-నాణ్యత ప్రోటీన్‌కు కూడా మంచి మూలం. సుమారు 28 గ్రాములు మాంసంలో 7 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. అందుకే ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా దీనిని అప్పుడప్పుడు తీసుకోవడం మంచిది. పోషకాలు ఉన్నప్పటికీ ఎర్ర మాంసాన్ని వారానికి ఒకసారి మాత్రమే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ప్రాసెస్ చేసిన మాంసాలైన హామ్, బేకన్, సలామీ వంటి వాటిలో సంతృప్త కొవ్వులు, సోడియం ఎక్కువగా ఉంటాయి. ఇవి గుండె జబ్బులు, టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని పెంచుతాయి. గుండె జబ్బులు: ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం పరిశోధన ప్రకారం.. రోజుకు 50 గ్రాముల ప్రాసెస్ చేసిన ఎర్ర మాంసం తినేవారిలో గుండె జబ్బుల ప్రమాదం 18 శాతం పెరుగుతుంది. డయాబెటిస్: ది లాన్సెట్ డయాబెటిస్ అండ్ ఎండోక్రినాలజీ పత్రికలో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం.. రోజుకు రెండు ముక్కల హామ్ వంటి ప్రాసెస్ చేసిన మాంసం తినడం వల్ల టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం 15 శాతం పెరుగుతుంది. కొలెస్ట్రాల్: ఎర్ర మాంసం శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిని పెంచుతుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని మరింత పెంచుతుంది. క్యాన్సర్: ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎర్ర మాంసాన్ని గ్రూప్ 2ఎ క్యాన్సర్ కారకంగా వర్గీకరించింది. ముఖ్యంగా ప్రాసెస్ చేసిన ఎర్ర మాంసం, కొలొరెక్టల్ క్యాన్సర్ వంటి కొన్ని రకాల క్యాన్సర్‌లతో ముడిపడి ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఎర్ర మాంసం పోషకాలను అందిస్తున్నప్పటికీ దానిని మితంగా మాత్రమే తీసుకోవడం మంచిది. ప్రాసెస్ చేసిన మాంసాలను వీలైనంత వరకు దూరం పెట్టాలి. ఆరోగ్యకరమైన జీవితం కోసం సమతుల్య ఆహారం తీసుకోవడం, తాజా మాంసాన్ని ఎంచుకోవడం, శారీరక శ్రమ చేయడం అవసరం.

# ఉల్లిపాయలను తింటే క్యాన్సర్ తప్పదా?

ఉల్లిపాయ.. ఇది లేనిదే ఇంట్లో వంటచేయడమే కుదరదు. ఎందుకంటే ఉల్లిపాయను ప్రతిరోజూ ఒకటి కంటే ఎక్కువ ఆహార పదార్థాలలో ఉపయోస్తాం. చాలా ఇళ్లలో గృహిణులు ఉల్లిపాయలు లేవంటే వంటచేయడమే మానేస్తారు. అలా ఉంటుంది వాటి క్రేజ్. కానీ ఈ ఉల్లిపాయల్లో కొన్నింటిని తినడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా ప్రతిరోజూ ఏదో ఒక ఆహారంలో మనం ఉల్లిపాయను ఉపయోగిస్తాం. ఇవి లేకుండా కూరగాయాలు చేస్తే అసలు టేస్టే ఉండదు. చాలా ఇళ్లలో, గృహిణులు ఉల్లిపాయలు లేకుండా వంట చేయమంటే అస్సలూ కుదరదని మొహం మీదే చెప్పేస్తారు. అలా ఉంటుంది వీటి క్రేజ్ మరీ. అయితే కొన్ని సార్లు ఉల్లిపాయలపై నల్ల మచ్చలు రావడం, లేదా బూజు పట్టడం జరుగుతుంది. అలాంటి వాటిని తినడం ఆరోగ్యానికి చాలా హానికరమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అవును మీరు విన్నది నిజమే వీటిని తినడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు వస్తాయో తెలిస్తే.. అలాంటి వాటిని తినడం మీరు ఇప్పుడే మానేస్తారు. పోషకాహార నిపుణనల ప్రకారం.. కొందరు ఉల్లిపాయలో దెబ్బతిన్న భాగాన్ని, అంటే నల్ల మచ్చలు ఉన్న ప్రాంతాన్ని తొలగించి, మిగిలిన భాగాన్ని మాత్రమే ఉపయోగిస్తారు. కానీ ఇలా చేయడం చాలా పెద్ద తప్పు. ఈ రకమైన బూజు ఎక్కువగా ఉల్లిపాయ లోపలి భాగంలో మాత్రమే కనిపిస్తుంది. దీనిని గుర్తించడం చాలా కష్టం అని వారు చెప్తున్నారు. పోషకాహార నిపుణురాలు ప్రకారం, నల్ల మచ్చలు లేదా బూజు ఉన్న ఉల్లిపాయలను ఎప్పుడూ ఉపయోగించకూడదు. ఇవి మైకోటాక్సిన్ అనే రకమైన టాక్సిన్‌ను ఉత్పత్తి చేస్తాయి, ఇది మానవ శరీరంపై ప్రతికూల ప్రభావాలను చూపుతుంది. అటువంటి ఉల్లిపాయలను తినడం వల్ల ఆహార అలెర్జీలు, వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి వంటి సమస్యలు వస్తాయి. అవే కాకుండా వాటి వల్ల క్యాన్సర్, కాలేయ క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉందని ఆమె చెబుతున్నారు. కాబట్టి వాటిని శుభ్రంచేసి వినియోగించడం కన్నా.. పడేయడం బెస్ట్ అని నిపుణులు చెబుతున్నారు. మనం ఇలాంటి సమస్యల నుంచి దూరంగా ఉండాలనుకుంటే ఎప్పుడూ ఫ్రెష్‌గా ఉండే ఉల్లిపాయలు వినియోగించాలి. అవి టైప్ 2 డయాబెటిస్‌కు ప్రయోజనకరంగా ఉంటాయి. అలాగే రక్తపోటును నియంత్రించడంలోనూ సహాయపడతాయి. వేసవి ఎండలో బయటకు వెళ్ళే ముందు ఉల్లిపాయలు తినడం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది. అలాగే హీట్ స్ట్రోక్ ఉపశమనం లభిస్తుంది. ఎందుకంటే ఇది శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఉల్లిపాయలపై నల్ల మచ్చలు లేదా బూజు రాకుండా ఉండటానికి వాటిని సరిగ్గా నిల్వ చేయడం చాలా ముఖ్యం. చాలా మంది మళ్లీ మళ్లీ ఎవరు కొంటారని.. ఒకేసారి బల్క్‌లో కొని ఇంట్లో పెట్టుకుంటారు. ఇలా ఒకే దగ్గర ఎక్కువ మొత్తంలో నిల్వ చేయడం ద్వారా నల్ల మచ్చలు, బూజూ వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి మీకు అవసరమైన ఉల్లిపాలయను అప్పుడే తెచ్చుకొండి. అలాగే మీరు తెచ్చిన ఉల్లిపాయల్ని చల్లని, తేమగా ఉండే ప్రదేశాల్లో ఉంచకండి.





# అరటిని ఈ ఒక్కటి కలిపి తినండి..

శరీరానికి బలాన్నిచ్చే అరటిపండు, సుగంధ ద్రవ్యాల రాణి నల్ల మిరియాలు. ఈ రెండింటిని కలిపి తింటే ఏం జరుగుతుందో తెలుసా? చాలామంది రోజుకో అరటిపండు తినడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి మాత్రమే ఆలోచిస్తారు. కానీ దానిపై కొద్దిగా నల్ల మిరియాల పొడి చల్లి తింటే అద్భుతమైన ఆరోగ్య లాభాలుంటాయి. ఈ కలయిక మీ ఆరోగ్యాన్ని ఎలా మెరుగుపరుస్తుందో నిపుణుల మాటల్లో తెలుసుకుందాం. మన వంటింట్లో లభించే కూరగాయలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలు పోషకాల నిధి. వాటిని సరైన విధంగా, సరైన సమయంలో తింటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. అరటిపండు, నల్ల మిరియాలు రెండూ శరీరానికి చాలా ఉపయోగకరమైనవి. అరటిపండు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, శరీరాన్ని బలపరుస్తుంది. నల్ల మిరియాలు ఆయుర్వేదంలో ఔషధంలా భావిస్తారు. రోజూ ఒక అరటిపండును నల్ల మిరియాల పొడితో కలిపి తింటే ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు చూద్దాం. ఈ సమాచారం డైటీషియన్ నందిని అందించారు. జీర్ణక్రియ మెరుగుపడుతుంది: అరటిపండులోని పీచుపదార్థం, నల్ల మిరియాలలో ఉండే పైపెరిన్ జీర్ణ ఎంజైమ్‌లను చురుకుగా మారుస్తాయి. దీనివల్ల ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. గ్యాస్, అసిడిటీ, ఉబ్బరం లాంటి సమస్యలు తగ్గుతాయి.
కలయికతో రోగనిరోధక శక్తి పెరుగుతుంది: అరటిపండులో విటమిన్ సి, నల్ల మిరియాలలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఈ రెండింటిని కలిపి తీసుకుంటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రుతువులవల్ల వచ్చే వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. బరువు తగ్గడానికి సహాయం: అరటిపండులోని పీచుపదార్థం ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్న భావన కలిగిస్తుంది. దీనివల్ల అతిగా తినకుండా ఉంటారు. నల్ల మిరియాలు జీవక్రియను వేగవంతం చేస్తాయి. ఈ రెండూ బరువు తగ్గడానికి సహాయపడతాయి.

# బొప్పాయిని వీటితో కలిపి తింటే..



బొప్పాయి తినడం ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో విటమిన్లు, ఫైబర్, అనేక పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా చర్మాన్ని కూడా కాంతివంతం చేస్తుంది. అయితే బొప్పాయిని కొన్ని ఆహార పదార్థాలతో కలిపి తీసుకుంటే అది విషపూరితంగా మారే ప్రమాదం ఉంది. నిమ్మకాయ లేదా సిట్రస్ పండ్లు: బొప్పాయిని నిమ్మకాయ, నారింజ, లేదా ఇతర సిట్రస్ పండ్లతో కలిపి తినడం చాలామంది చేసే సాధారణ పొరపాటు. ఈ రెండింటినీ కలిపి తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇది గ్యాస్, అసిడిటీ, కడుపు నొప్పి, గుండెల్లో మంట వంటి సమస్యలకు దారితీస్తుంది. గర్భిణీ స్త్రీలు ఈ కలయికను పూర్తిగా నివారించడం మంచిది. ఎందుకంటే ఇది శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిలను కూడా ప్రభావితం చేయవచ్చు. దోసకాయలు - టమాటాలు: బొప్పాయిని దోసకాయ, టమాటా వంటి కూరగాయలతో కలిపి తినకూడదు. బొప్పాయిలో పపైన్ అనే ఒక ప్రత్యేక ఎంజైమ్ ఉంటుంది. ఇది ప్రోటీన్లను జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. కానీ దోసకాయ, టమాటాలలో వేరే ఎంజైమ్‌లు, ఫైబర్ ఉంటాయి. వీటిని కలిపి తినడం వల్ల జీర్ణక్రియకు ఆటంకం ఏర్పడి ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలు వస్తాయి. పెరుగు లేదా పాలు: ఆయుర్వేదం ప్రకారం.. పండ్లు, పాలు లేదా పెరుగు కలిపి తినడం ఆరోగ్యానికి హానికరం. బొప్పాయి, పెరుగు కలిపి తీసుకోవడం వల్ల కడుపులో విషపదార్థాలు ఏర్పడతాయి. దీనివల్ల చర్మంపై దద్దుర్లు, దురద, విరేచనాలు, మలబద్ధకం వంటి కడుపు సమస్యలు వచ్చే అవకాశం ఉంది. బొప్పాయి షేక్ తయారు చేసుకోవాలనుకుంటే పాలకు బదులుగా నీటిని ఉపయోగించడం మంచిది. కాకరకాయ: కాకరకాయతో బొప్పాయిని తినడం అత్యంత ప్రమాదకరమైన కలయికలలో ఒకటి. కాకరకాయ యొక్క చేదు రుచి, బొప్పాయి యొక్క తీపి రుచి శరీరంలో ప్రతికూల ప్రభావాలను సృష్టిస్తాయి. ఇది జీర్ణక్రియ ప్రక్రియను నెమ్మది చేయడమే కాకుండా తీవ్రమైన కడుపు నొప్పి, వాంతులు లేదా విరేచనాలు వంటి సమస్యలకు దారితీయవచ్చు. తేనె: బొప్పాయి - తేనె కలిపి తీసుకోవడం వల్ల కొంతమందిలో అలెర్జీ రియాక్షన్స్ వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా పచ్చి తేనెను ఉపయోగిస్తే, అది కడుపు నొప్పి, వికారం, వాంతులు లేదా చర్మంపై దద్దుర్లకు కారణం కావచ్చు. తేనెను విడిగా తీసుకోవడం ఉత్తమం.

# రుచి కోసమని నిమ్మరసం వీటితో కలిపి తిన్నారో!



నిమ్మకాయ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఆహారంలో తీసుకోవల్సిన ముఖ్యమైన పదార్థాల్లో కూడా నిమ్మ ఒకటి. చాలా మందికి నిమ్మకాయ లేకుండా భోజనం అసంపూర్ణంగా అనిపిస్తుంది. నిమ్మరసం వేడి వేడి ఆహారంలో అలా చిలికించి తింటే ఆ రుచే వేరు. నిమ్మకాయలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు, నిర్విషీకరణ లక్షణాలు ఉంటాయి. నిమ్మకాయ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఆహారంలో తీసుకోవల్సిన ముఖ్యమైన పదార్థాల్లో కూడా నిమ్మ ఒకటి. చాలా మందికి నిమ్మకాయ లేకుండా భోజనం అసంపూర్ణంగా అనిపిస్తుంది. నిమ్మరసం వేడి వేడి ఆహారంలో అలా చిలికించి తింటే ఆ రుచే వేరు. నిమ్మకాయలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు, నిర్విషీకరణ లక్షణాలు ఉంటాయి. నిమ్మ తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. చర్మ రంగు కూడా మెరుగుపడుతుంది. ముఖ్యంగా, బరువు తగ్గడానికి నిమ్మకాయ కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. నిమ్మ ఆరోగ్యానికి ఎంత మేలు చేసినప్పటికీ.. దీన్ని కొన్ని ఆహార పదార్థాలతో కలిపి తీసుకుంటే విషపూరితం అవుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఇది అలెర్జీలు, గ్యాస్, చర్మ సమస్యలను కలిగిస్తుంది. నిమ్మకాయను పాలు, పాల ఉత్పత్తులతో కలిపి మర్చిపోయి కూడా తినకూడదు. దీనివల్ల జీర్ణ సమస్యలు వస్తాయి. పాలు, నిమ్మకాయను కలిపి తినడం వల్ల కూడా గ్యాస్ సమస్యలు వస్తాయి. గుడ్లు ప్రోటీన్ కు మంచి మూలం. అయితే గుడ్లు, నిమ్మకాయను ఎప్పుడూ కలిపి తినకూడదు. ఇది అనేక తీవ్రమైన కడుపు సమస్యలను కలిగిస్తుంది.

## బిజినెస్ వాయిస్

### సెబీ క్లీన్‌చిట్‌తో రూ. 69 వేల కోట్లు పెరిగిన అదానీ గ్రూప్ మార్కెట్ విలువ




అమెరికా షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ అదానీ గ్రూప్‌పై చేసిన ఆరోపణలు నిరాధారమని తాజాగా భారతీయ స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ప్రకటనతో శుక్రవారం ఒక్కరోజే అదానీ గ్రూప్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 69,000 కోట్లకు పైగా పెరిగింది. అదానీ గ్రూప్‌పై ఆరోపణలను సెబీ క్లియర్ చేయడంతో ఇన్వెస్టర్లలో సెంటిమెంట్ పుంజుకుంది. అత్యధికంగా లాభాలను చూసిన కంపెనీల్లో అదానీ పవర్ షేర్ 12.40 శాతం పెరగ్గా, అదానీ టోటల్ గ్యాస్ 7.35 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 5.33 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 5.04 శాతం రాణించాయి. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 4.70 శాతం పెరిగాయి. మిగిలిన వాటిలో సంఘి ఇండస్ట్రీస్, ఏసీసీ లాంటి కంపెనీలు కూడా మెరుగైన ర్యాలీని చూశాయి. కాగా, 2023 జనవరిలో అదానీ గ్రూప్ ఇన్‌సైడర్ ట్రేడింగ్, మార్కెట్ అవకతవకలు, పబ్లిక్ షేర్‌హోల్డింగ్ నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిందని హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ సంచలన ఆరోపణలు చేసింది. అదానీ గ్రూప్‌లో పలు కంపెనీల నుంచి నిధులను ఆడికార్ప్, మైల్‌స్టోన్ ట్రేడ్‌లింక్స్, రేవర్‌ఇన్‌ఫ్రా ద్వారా లిస్టెడ్ కంపెనీలైన అదానీ పవర్, అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లోకి మళ్లించారని కూడా ఆరోపించింది. అయితే, దీనిపై గతంలో సుప్రీంకోర్టు కూడా అలాంటి ఉల్లంఘనలు జరగలేదని చెప్పడం, తాజాగా సెబీ దర్యాప్తులో అవకతవకలు జరగలేదని తేలడంతో అదానీ గ్రూప్‌నకు భారీ ఉపశమనం లభించింది.

### రూ. 18 వేల వరకు ధరలు తగ్గించిన సుజుకి మోటార్‌సైకిల్



ప్రముఖ టూ–వీలర్ కంపెనీ సుజుకి మోటార్ సైకిల్ ఇండియా శుక్రవారం జీఎస్టీ సంస్కరణలో భాగంగా ధరలను తగ్గించినట్లు ప్రకటించింది. తన అన్ని మోడళ్లపై గరిష్ఠంగా రూ. 18,024 వరకు తగ్గించినట్లు తెలిపింది. జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రయోజనాలను పూర్తిగా అందిస్తామని కంపెనీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. సవరించిన ధరలు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొంది. ద్విచక్ర వాహనాలతో పాటు, విడిభాగాలు, ఇతర పరికరాలపై తగ్గిన జీఎస్టీతో నిర్వహణ ఖర్చులు తగ్గుతాయి. ఇది పరిశ్రమలో డిమాండ్ పెరుగుదలకు వీలు కల్పిస్తుందని కంపెనీ వైస్–ప్రెసిడెంట్, సేల్స్ అండ్ మార్కెటింగ్ దీపక్ ముత్రేజా అన్నారు. పండుగ సీజన్ సమయంలో ధరల తగ్గింపు వల్ల కస్టమర్ల సెంటిమెంట్ మరింత పెరుగుతుందని, అందుకే తమ పోర్ట్‌ఫోలియోలోని వాహనాలు ఆకర్షణీయంగా మారుతాయి, మొత్తంగా టూవీలర్ వాహన మార్కెట్లో గిరాకీకి ప్రోత్సాహం లభిస్తుందని భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.


# మళ్లీ జాబ్‌లో చేరండి.. మహిళా నిపుణులకు ఐటీ కంపెనీల ఆఫర్లు

మళ్లీ ఉద్యోగానికి రావాలనుకుంటున్న మహిళా నిపుణుల కోసం 'రీస్టార్ట్ విత్ ఇన్ఫోసిస్' పేరిట ప్రత్యేక నియామక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. ప్రముఖ ఐటీ కంపెనీ అయిన ఇన్ఫోసిస్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ నియామకాలకు అర్హత సాధించాలంటే, మహిళా అభ్యర్థులకు కనీసం రెండు సంవత్సరాల పని అనుభవం కలిగి ఉండాలి. కనీసం 6 నెలల పాటు విరామంలో ఉండాలని కంపెనీ రూల్ పెట్టింది. జావా, .నెట్, ఎస్ఏపీ, ఒరాకిల్, సేల్స్‌ఫోర్స్, పెగాసస్, రియాక్ట్, పైథాన్, యాంగ్యులర్, ఇన్ఫర్మేటికా, సెలానియం టెస్టింగ్‌లలో డెవలపర్, టెక్ లీడ్, మేనేజర్ స్థానాలకు మహిళా ఉద్యోగులను ఆహ్వానిస్తుంది. పెళ్లయిన తర్వాత పిల్లలు, కుటుంబ బాధ్యలతో చాలా మంది మహిళలు జాబ్ కి బ్రేక్ వేస్తుంటారు. తర్వాత వారు ఒక్కసారిగా మళ్లీ జాబ్ లో జాయిన్ అవ్వాలనుకున్న జాబ్ దొరకక చాలా ఇబ్బందులు పడతారు. వారి కోసేమే ఇన్ఫోసిస్ మంచి ఆఫర్ ప్రకటించింది. 'రీస్టార్ట్ విత్ ఇన్ఫోసిస్' పేరుతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది. తమ ఉద్యోగుల్లో మహిళల సంఖ్యను పెంచడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. 2030కు మొత్తం ఉద్యోగుల్లో 45% మంది మహిళలు ఉండాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఇన్ఫోసిస్‌లో దాదాపు 3,23,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులో మహిళల వాటా 39 శాతంగా ఉంది. విజయవంతమైన రిఫరల్స్ ఇచ్చిన తమ ఉద్యోగులకు రూ.50,000 వరకు ప్రోత్సాహకాలను సంస్థ అందిస్తోంది. ఫిబ్రవరిలో మహిళలను తీసుకునేందుకు 'రీఇగ్నైట్ 2025' కార్యక్రమాన్ని టాటా టెక్నాలజీస్ ఏర్పాటు చేసింది. 'రిటర్న్‌షిప్' పేరుతో హెచ్‌సీఎల్ టెక్ ఓ ప్రోగ్రాంను ప్రారంభించింది. యాక్సెంచర్ ఇండియా 'కెరీర్ రీబూట్', విప్రో'బిగిన్ ఎగైన్' కార్యక్రమాలు కూడా ఇదే కోవలోకి వస్తాయని ఐటీ నిపుణులు వెల్లడించారు.




# అత్యధిక బంగారం నిల్వలున్న దేశాలివే.. భారత్‌కు 8వ ర్యాంక్

బంగారం నిల్వలు ఏ దేశానికైనా ఆర్థిక స్థిరత్వానికి చాలా కీలకం. ఈ కారణంతోనే ప్రతిదేశం ఎప్పటికప్పుడు బంగారాన్ని నిల్వ చేసుకుంటాయి. అయితే, గతంలో కంటే ఇటీవల కొన్నేళ్లలో చాలా దేశాల సెంట్రల్ బ్యాంకులు విపరీతంగా పసిడి నిల్వలను పెంచుకుంటున్నాయి. ముఖ్యంగా ఇటీవల భౌగోళిక రాజకీయ పరిణామాలు, వాణిజ్య సవాళ్లు, ఆర్థిక అనిశ్చితి, యుద్ధ పరిస్థితుల మధ్య అనేక దేశాలు వీలైనంత ఎక్కువ బంగారం నిల్వలకు ఆసక్తిగా ఉన్నాయి. తాజా అత్యధికంగా బంగారు నిలలు ఉన్న ఎనిమిది దేశాల జాబితాను ప్రపంచ స్వర్ణ మండలి(డబ్ల్యూజీసీ) విడుదల చేసింది. ఆ డేటా ప్రకారం భారత్ స్థానం ఎక్కడ ఉందో తెలుసుకుందాం. ఈ జాబితాలో అమెరికా 8,133.5 మెట్రిక్ టన్నులతో అగ్రస్థానంలో ఉంది. ఈ మొత్తం విదేశీ మారక నిల్వలలో దాదాపు 71 శాతాం వాటా కలిగి ఉంది. తర్వాత స్థానంలో జర్మనీ 3,351.5 మెట్రిక్ టన్నులు, విదేశీ మారక నిల్వలలో దాదాపు 70.6 శాతం వాటాతో రెండో స్థానంలో ఉంది. మూడో స్థానంలో ఇటలీ 2,451.8 మెట్రిక్ టన్నులతో మొత్తం విదేశీ మారక నిల్వలలో దాదాపు 67.5 శాతం, 2,437 మెట్రిక్ టన్నులు, విదేశీ మారక నిల్వలలో దాదాపు 68.6 శాతం వాటాతో ఫ్రాన్స్, 2,335.9 మెట్రిక్ టన్నులు, విదేశీ మారక నిల్వలలో దాదాపు 28.1 శాతం వాటాతో రష్యా, 2,279.6 మెట్రిక్ టన్నులు, విదేశీ మారక నిల్వలలో దాదాపు 4.6 శాతం వాటాతో చైనా, 1,040 మెట్రిక్ టన్నులు, విదేశీ మారకపు నిల్వలలో దాదాపు 8 శాతం వాటాతో స్విట్జర్లాండ్, 876.2 మెట్రిక్ టన్నులు, విదేశీ మారక నిల్వలలో దాదాపు 9 శాతం వాటాతో భారత్ టాప్–8 ర్యాంకుల్లో ఉన్నాయి.



# టీమిండియా అంటే భయం.. మోటివేషనల్ స్పీకర్ సాయం కోరిన పాక్..!

ఆసియా కప్ లీగ్ దశలో ఎదురుపడిన భారత్ పాకిస్థాన్ సూపర్ 4లోనూ తలపడనున్నాయి. ఆదివారం దుబాయ్ వేదికగా దాయాదుల మధ్య మరోసారి బిగ్ ఫైట్ జరుగనుంది. అయితే.. పాక్ జట్టుకు టీమిండియా ఫోబియా పట్టుకుంది. ఇదివరకే భారీ తేడాతో సూర్యకుమార్ యాదవ్ సేన చేతిలో ఓడడంతో మళ్లీ సల్మాన్ అఘా బృందాన్ని ఓటమి భయం వెంటాడుతోంది. దాంతో.. ఆనవాయితీ ప్రకారం మ్యాచ్‌కు ముందు రోజు జరిగే మీడియా సమావేశాన్ని పాక్ బాయ్‌కాట్ చేసింది. అంతేకాదు.. టీమిండియాను ఎదుర్కొనేందుకు తగిన మానసిక సన్నద్ధత కోసం ఆ జట్టు మోటివేషనల్ స్పీకర్ సాయం కోరింది. లీగ్ దశలో భారత బౌలర్ల విజృంభణతో పాక్ జట్టు 127 రన్స్‌కే పరిమితమైంది. స్వల్ప లక్ష్యాన్ని అలవోకగా ఛేదించిన టీమిండియా 7 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. ఇప్పుడు సూపర్ 4 మ్యాచ్‌లోనూ చిరకాల ప్రత్యర్థిని చిత్తు చేయాలని భారత జట్టు పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో కనీస పోరాటం చేయడానికి పాక్ సన్నద్ధమవుతోంది. అందుకే.. మానసికంగా ధైర్యం, స్ఫూర్తినింపే మాటలు చెప్పే మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ రహీమ్‌ను నియమించుకుంది. పాక్ క్రికెటర్లలో రహీం ఆత్మవిశ్వాసాన్ని నూరిపోయనున్నాడు. అయినా సరే అనిశ్చితికి మారుపేరైన దాయది జట్టు ఎప్పుడు ఎలా ఆడుతుందో చెప్పలేం. ముఖ్యంగా ఒత్తిడిని ఏమాత్రం తట్టుకోలేని పాక్ సూపర్ 4లోనూ చేతులెత్తేస్తుందా? చివరి వరకూ పోరాడుతుందా? అనేది అందరిలో ఆసక్తి రేపుతోంది.



# చరిత్ర సృష్టించిన టీమిండియా.. పాకిస్తాన్‌ను దాటేసి సింగిల్‌గా ప్రపంచ రికార్డు

ఆసియా కప్ 2025లో భాగంగా నిన్న (సెప్టెంబర్ 19) జరిగిన మ్యాచ్‌లో భారత్ పసికూన ఒమన్‌పై 21 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో టీమిండియా ఓ చారిత్రక రికార్డును సొంతం చేసుకుంది. అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో అత్యధిక దేశాలపై (19) విజయాలు సాధించిన జట్టుగా రికార్డు నెలకొల్పింది. ఈ మ్యాచ్‌కు ముందు ఈ రికార్డు భారత్, పాకిస్తాన్ (18) పేరిట సంయుక్తంగా ఉండేది.

అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక దేశాలపై విజయాలు సాధించిన జట్లు

భారత్– 19 దేశాలు (166 విజయాలు)
పాకిస్తాన్– 18 దేశాలు (156 విజయాలు)
న్యూజిలాండ్– 17 దేశాలు (123 విజయాలు)
ఆస్ట్రేలియా– 16 దేశాలు (119 విజయాలు)
సౌతాఫ్రికా– 15 దేశాలు (112 విజయాలు)
ఇంగ్లండ్– 15 దేశాలు (110 విజయాలు)

అంతర్జాతీయ టీ20ల్లో భారత్ టెస్ట్ హోదా కలిగిన దేశాలతో పాటు చాలా అసోసియేట్ సభ్య దేశాలను మట్టికరిపించింది.

టీ20ల్లో టీమిండియా విజయాలు నమోదు చేసిన దేశాలు

ఆస్ట్రేలియా– 32 మ్యాచ్‌ల్లో 20 విజయాలు
శ్రీలంక– 32 మ్యాచ్‌ల్లో 21 విజయాలు
సౌతాఫ్రికా– 31 మ్యాచ్‌ల్లో 18 విజయాలు
వెస్టిండీస్– 30 మ్యాచ్‌ల్లో 19 విజయాలు
ఇంగ్లండ్– 29 మ్యాచ్‌ల్లో 17 విజయాలు
న్యూజిలాండ్– 25 మ్యాచ్‌ల్లో 12 విజయాలు
పాకిస్తాన్– 14 మ్యాచ్‌ల్లో 10 విజయాలు
జింబాబ్వే– 13 మ్యాచ్‌ల్లో 10 విజయాలు
బంగ్లాదేశ్– 17 మ్యాచ్‌ల్లో 16 విజయాలు
ఆఫ్ఘనిస్తాన్– 9 మ్యాచ్‌ల్లో 7 విజయాలు
ఐర్లాండ్– 8 మ్యాచ్‌ల్లో 8 విజయాలు
హాంగ్‌కాంగ్– 1 మ్యాచ్‌లో 1 విజయం
నమీబియా– 2 మ్యాచ్‌ల్లో 2 విజయాలు
యూఏఈ– 2 మ్యాచ్‌ల్లో 2 విజయాలు
స్కాట్లాండ్– 1 మ్యాచ్‌లో 1 విజయం
నెదర్లాండ్స్– 2 మ్యాచ్‌ల్లో 2 విజయాలు
ఒమన్– 1 మ్యాచ్‌లో 1 విజయం
నేపాల్– 1 మ్యాచ్‌లో 1 విజయం
కెన్యా– 1 మ్యాచ్‌లో 1 విజయం



మొత్తంగా 19 దేశాలపై 250 మ్యాచ్‌లు ఆడి 166 విజయాలు సాధించిన భారత్, పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక విజయాలు సాధించిన జట్టుగా, అత్యధిక విజయాల శాతం (66) కలిగిన జట్టుగా చలామణి అవుతుంది.

పొట్టి ఫార్మాట్‌లో రెండు ప్రపంచకప్‌లు (2007, 2024) గెలిచిన భారత్ ప్రస్తుతం ఈ ఫార్మాట్‌లో నంబర్ వన్ జట్టుగా (ర్యాంకింగ్స్‌లో) కొనసాగుతుంది. అలాగే ఈ ఫార్మాట్‌లో అన్ని విభాగాల్లో భారత ఆటగాళ్లే టాప్ ర్యాంక్‌ల్లో ఉన్నారు. బ్యాటింగ్‌లో అభిషేక్ శర్మ, బౌలింగ్‌లో వరుణ్ చక్రవర్తి, ఆల్‌రౌండర్ల విభాగంలో హార్దిక్ పాండ్యా నంబర్ వన్‌గా ఉన్నారు.

## క్రీడా వాయిస్

### రాణించిన పూరన్, హేల్స్.. చెలరేగిన రసెల్, పోలార్డ్.. ఫైనల్లో నైట్‌రైడర్స్



కరీబియన్ ప్రీమియర్ లీగ్ 2025 ఎడిషన్‌లో ట్రిన్‌బాగో నైట్‌రైడర్స్ ఫైనల్స్‌కు చేరుకుంది. భారతకాలమానం ప్రకారం? ఇవాళ (సెప్టెంబర్ 20) ఉదయం జరిగిన రెండో క్వాలిఫయర్‌లో సెయింట్ లూసియా కింగ్స్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన నైట్‌రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది. అలెక్స్ హేల్స్ (44 బంతుల్లో 58 నాటౌట్‌బీ 2 ఫోర్లు, 4 సిక్సర్లు), కెప్టెన్ పూరన్ (32 బంతుల్లో 50బీ 5 ఫోర్లు, 4 సిక్సర్లు) బాధ్యతాయుతమైన అర్ధ సెంచరీలతో రాణించగా.. ఆఖర్లో పోలార్డ్ (26 బంతుల్లో 35బీ 4 సిక్సర్లు), రసెల్ (12 బంతుల్లో 28బీ ఫోర్, 3 సిక్సర్లు) విరుచుకుపడ్డారు. లూసియా కింగ్స్ బౌలర్లలో అల్జరీ జోసఫ్, ఖారీ పియెర్, రోస్టన్ ఛేజ్ తలో వికెట్ తీశారు. అనంతరం 195 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో లూసియా కింగ్స్ చేతులెత్తేసింది. ఇన్నింగ్స్ ప్రారంభం నుంచి ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేదు. నిదానంగా ఆడుతూ, బంతులు వృధా చేసుకుని ఆఖరికి మూల్యం చెల్లించుకుంది. ఓపెనర్ టిమ్ సీఫర్ట్ (40 బంతుల్లో 57బీ 8 ఫోర్లు, సిక్స్) ఒక్కడే తూతూమంత్రంగా గెలుపు కోసం ప్రయత్నించాడు. మిగతా ఆటగాళ్లంతా నిరాశపరిచారు. జాన్సన్ ఛార్లెస్ 17, టిమ్ డేవిడ్ 28, రోస్టన్ ఛేజ్ 16, ఆరోన్ జోన్స్ 12, టైమాల? మిల్స్ 6 పరుగులు చేయగా.. అకీమ్ అగస్టే, కెప్టెన్ డేవిడ్ వీస్ డకౌట్లయ్యారు. నైట్‌రైడర్స్ స్పిన్నర్లు సునీల్ నరైన్ (4–1–18–3), ఉస్మాన్ తారిక్ (4–0–35–4) లూసియా కింగ్స్ బ్యాటర్ల నడ్డి విరిచారు. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 138 పరగులు మాత్రమే చేసిన కింగ్స్ 56 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని ఎదుర్కొంది. సెప్టెంబర్ 22న జరిగే ఫైనల్లో నైట్‌రైడర్స్ గయానా అమెజాన్ వారియర్స్‌తో టైటిల్ కోసం పోటీపడుతుంది.



## బిగ్‌బాస్ హౌస్‌లో ఆడపులి.. యూత్‌కు తెగ నచ్చేస్తోన్న కంటెస్టెంట్..

బిగ్‌బాస్ సీజన్ 9 రెండో వారం నడుస్తోంది. ఓవైపు కామనర్స్.. మరోవైపు సెలబ్రెటీస్ తమ బిహేవియర్, ఆట తీరుతో జనాలకు విసుగు తెప్పిస్తున్నారు. మాట్లాడితే అరుచుకోవడం.. పిచ్చి పిచ్చిగా బిహేవ్ చేస్తున్నారు. మరోవైపు ఇద్దరు పవన్లతో రీతూ చౌదరి ట్రయాంగిల్ స్టోరీ స్టార్ట్ చేసింది. అయితే ఇప్పుడు బిగ్?బాస్ హౌస్ లో అత్యధిక పాజిటివిటీ అందుకుంటున్న అమ్మాయి ఎవరో తెలుసా.. ?

యోగా, వర్కవుట్లతో హీరోయిన్ రేంజ్ ఫిట్నెస్ తో కట్టిపడేస్తుంది. ఆమెకు ఇప్పుడు ఫాలోయింగ్ మరింత పెరిగింది. బుల్లితెరపై, సోషల్ మీడియాలో ఆమె పేరు మారుమోగుతుంది. ఇన్నాళ్లు అందం, నటనతో కట్టిపడేసిన ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు తన బిహేవియర్, ఆట తీరుతో ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం తెలుగులో ప్రసారమవుతున్న బిగ్ బాస్ సీజన్ 9లో టాస్కులలో ఆడపులిలా దూసుకుపోతుంది. అలాగే స్నేహానికి అండగా ఉంటూ.. ఆట తీరుతో ప్రేక్షకుల హృదయాల్లో చోటు సంపాదించుకుంటుంది. ఇప్పుడు ఆమెకు నెట్టింట విపరీతమైన క్రేజ్ ఉంది. ఇంతకీ బిగ్ బాస్ హౌస్ లో శివంగి ఎవరో గుర్తుపట్టారా.. ? ఈ అమ్మడు మరెవరో కాదు.. ముద్ద మందారం ఫేమ్ తనూజ పుట్టస్వామి. కన్నడ, తెలుగులో పలు సీరియల్స్ ద్వారా జనాలకు దగ్గరయ్యింది. ఇప్పుడు బిగ్ బాస్ హౌస్ లో కంటెస్టెంట్ ఆమె. బెంగళూరులో పుట్టి పెరిగిన తనూజ.. కాలేజీ రోజుల్లోనే మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టింది. కన్నడలో పలు సీరియల్స్ చేసింది. ఆ తర్వాత కన్నడలో హారర్ సినిమా 6-5=2 తో సినీ రంగ ప్రవేశం చేసింది, ఆ తర్వాత దండే బాయ్స్ చిత్రంలో కనిపించింది. ముద్ద మందారం సీరియల్ తో తెలుగులోకి అరంగేట్రం చేసిన ఆమె.. ఫస్ట్ సీరియల్ తోనే విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఇందులో పార్వతి పాత్రలో కట్టిపడేసింది. ముద్ద మందారం తర్వాత చాలా కాలం పాటు మీడియాకు దూరంగా ఉన్న తనూజ.. ఇటీవలే కుక్ విత్ జాతిరత్నాలు షోలో పాల్గొంది. ఇప్పుడు బిగ్ బాస్ సీజన్ 9లోకి అడుగుపెట్టింది. తన ఆట తీరు, ప్రవర్తనతో జనాలకు దగ్గరవుతుంది. తనూజకు సోషల్ మీడియాలో విపరీతమైన క్రేజ్ ఉంది. అటు ట్రెడిషనల్, ఇటు గ్లామర్ ఫోటోస్ షేర్ చేస్తూ నెటిజన్లను ఆకట్టుకుంది.



## ‘ఓజీ’ హంగామా షురూ.. హైదరాబాద్‌లో గ్రాండ్ కాన్సర్ట్!

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానుల ఎదురుచూపులకు తెరదించుతూ ‘ఓజీ’ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. హరిహర వీరమల్లు ఇచ్చిన దెబ్బతో తీవ్ర నిరాశలో ఉన్న ఫ్యాన్స్ ఓజీపైనే ఆశలు పెట్టుకున్నారు. అయితే ఈ సినిమా రిలీజ్‌కు ఇంకా ఐదు రోజులు మాత్రమే ఉండటంతో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగానే సెప్టెంబర్ 21న సాయంత్రం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ‘ఓజీ’ కాన్సర్ట్‌ను నిర్వహించబోతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ కార్యక్రమం ప్రధానంగా పాటల విడుదల వేడుకగా భావిస్తున్నారు. ఈవెంట్‌కు పవన్ కల్యాణ్ హాజరవుతారా లేదా అనే దానిపై మాత్రం ఇంకా క్లారిటీ రాలేదు. అయితే చిత్ర యూనిట్‌లోని మిగతా సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. పవన్ రాకపై క్లారిటీ వస్తే ఈ కాన్సర్ట్ మరింత గ్రాండ్‌గా మారే అవకాశం ఉంది. ఇప్పటికే సినిమా నుంచి వరుసగా అప్‌డేట్‌లు వస్తున్నాయి. ముఖ్యంగా, పవన్ కల్యాణ్ స్వయంగా ఆలపించిన వాషీ పాట నిన్న విడుదలై అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ పాట సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ పాటతో పాటు, మరిన్ని అప్‌డేట్‌లు త్వరలోనే వస్తాయని చిత్ర యూనిట్ తెలిపింది.








## పుష్ప 2, సంక్రాంతికి వస్తున్నాం, కన్నప్ప.. ఆస్కార్ రేసులో

వచ్చే ఏడాది జరగబోయే ఆస్కార్ అవార్డ్స్ కోసం కొన్ని తెలుగు సినిమాలు రేసులో నిలిచాయి. టాలీవుడ్ నుంచి దాదాపు ఐదింటిని ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఫైనల్ చేసింది. ఈ క్రమంలోనే అందుకు సంబంధించిన ఓ లిస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇంతకీ ఆ తెలుగు మూవీస్ ఏంటి? వాటికి ఏమైనా ఛాన్స్ ఉందా? మన దేశం నుంచి ఆస్కార్స్-2026 కోసం 24 సినిమాల్ని ఫిల్మ్ ఫెడరేషన్ ఎంపిక చేసింది వాటిలో తెలుగు నుంచి పుష్ప 2, సంక్రాంతికి వస్తున్నాం, కన్నప్ప, కుబేర, గాంధీతాత చెట్టు చిత్రాలు ఉన్నాయి. అలానే హిందీ నుంచి ఐ వాంట్ టూ టాక్, తన్వీ ది గ్రేట్, ద బెంగాల్ ఫైల్స్, హౌమ్ బౌండ్, కేసరి 2, సూపర్ బాయ్స్ ఆఫ్ మలేగావ్, హ్యుమన్స్ ఇన్ ద లూప్, జగ్నుమా, ఫూలే, ఫైర్ మూవీస్ ఉన్నాయి. అలానే మరాఠీ నుంచి 6, కన్నడ నుంచి ఒకటి, మణిపురి నుంచి 1, మూకీ సినిమా ఒకదాన్ని ఎంపిక చేశారు. ఇవన్నీ కూడా ఆస్కార్ రేసులో ఉన్నాయి. అయితే వీటి నుంచి ఏమైనా ఎంపిక అవుతుందా లేదా అనేది ఆస్కార్స్ కమిటీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. చూడాలి మరి ఏం జరుగుతుందో? గతంలో భారత నేపథ్యంగా తీసిన కొన్ని సినిమాలు ఆస్కార్స్ వచ్చాయి. కానీ ‘ఆర్ఆర్ఆర్’ చిత్రంలోని నాటు నాటు పాటకు ఆస్కార్ రావడంతో మన దగ్గర కూడా ఈ అవార్డ్ గురించి అందరికీ తెలిసింది.

## నాకు గర్ల్ ఫ్రెండ్స్ ఉన్నప్పుడు..



కునికా సదానంద్ .. ఒకప్పుడు తన నటన, ర్యాప్ సాంగ్స్‌తో బాలీవుడ్ ఇండస్ట్రీని షేక్ చేసింది. నెగెటివ్ క్యారెక్టర్స్‌తోనూ మెప్పించి వావ్ అనిపించింది. ఆ తర్వాత కెరీర్ పీక్స్‌లో ఉన్న టైమ్‌లోనే సింగర్ కుమార్ సనుతో లివ్ ఇన్ రిలేషన్ పెట్టుకున్నట్లు చెప్పింది. 27ఏళ్ల వయసులో తను ఈ పని చేసినట్లు రీసెంట్ ఇంటర్వ్యూస్‌లో తెలిపింది. కుమార్ సను తన భార్యతో విడిపోయాక.. షూటింగ్ జరుతున్న సమయంలో ఆత్మహత్యకు యత్నించాడని.. ఆయనకు ఆ సమయంలో ఎమోషనల్‌గా మద్దతిచ్చానని.. తర్వాత అది లివ్ ఇన్‌గా మారిందని తెలిపింది. కానీ తాను ఈ రిలేషన్ విషయంలో సీరియస్‌గా ఉంటే.. సింగర్ మాత్రం తనను మోసం చేశాడని, మరో అమ్మాయితో ఎఫైర్ పెట్టుకున్నాడని చెప్పింది. ఆ తర్వాత అతని మొహం కూడా చూడాలనిపించలేదని బాధపడింది. ప్రస్తుతం హిందీ బిగ్ బాస్ 19లో కంటెస్టెంట్‌గా ఉన్న ఆమె క్యారెక్టర్ గురించి తోటి ఇంటి సభ్యులు కామెంట్స్ చేయడంతో వీకెండ్ కా వార్‌లో తన తల్లి గొప్పతనం గురించి చెప్పుకొచ్చాడు కొడుకు అయాన్. కొడుకులను కాపాడుకునేందుకు తల్లిగా ఆమె పడిన కష్టాల గురించి వివరించాడు. ఆ తర్వాత ఓ ఇంటర్వ్యూలో ఆమె క్యారెక్టర్ గురించి ప్రశ్నించగా.. ఈ వయసులో నాకు గర్ల్ ఫ్రెండ్స్ ఉన్నప్పుడు.. తన తల్లి యుక్తవయసులో ఉన్నప్పుడు బాయ్ ఫ్రెండ్స్ ఉంటే తప్పేంటని ప్రశ్నించాడు. యుక్తవయసులో ఇదంతా సహజమని సపోర్ట్ చేశాడు.



## షాకింగ్ లుక్‌లో దర్శనమిచ్చిన టాలీవుడ్ హీరో శర్వానంద్..

టాలీవుడ్ చార్మింగ్ స్టార్ శర్వానంద్ ‘ఐదో తారీఖు’ చిత్రంతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చాడు. ఆ తర్వాత విభిన్న పాత్రలు ఎంచుకుంటూ ఫుల్ పాపులారిటీ దక్కించుకున్నాడు. పలు బ్లాక్ బస్టర్ హిట్స్ సాధించిన ఆయన కొద్ది కాలం ఇండస్ట్రీకి దూరం అయ్యాడు. ఈక్రమంలోనే రక్షిత అనే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. ఇక వీరికి ఓ కూతురు కూడా పుట్టింది. ఆ తర్వాత ‘ఒకే ఒక జీవితం’ చిత్రంతో సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేశాడు. ఇక ఆ తర్వాత వచ్చిన ‘మనమే’ అంతగా మెప్పించలేకపోయింది. ప్రస్తుతం శర్వానంద్ ‘నారి నారి నడుమ మురారి’ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ మూవీ త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. దీంతో పాటు ‘శర్వా-36’ చిత్రంలోనూ నటిస్తున్నాడు. ఇదిలా ఉంటే.. తాజాగా, ట్విట్టర్ ద్వారా శర్వానంద్ కొన్ని ఫొటోలను షేర్ చేశాడు. ఇక ఇందులో చాలా బక్కగా కనిపించడంతో అంతా ఆయనకు ఏమైనా అనారోగ్య సమస్యలు వచ్చాయా? మానసిక వేదనకు గురవుతున్నాడా? అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గత కొద్ది కాలంగా శర్వానంద్, రక్షిత దూరంగా ఉంటున్నట్లు పలు వార్తలు వైరల్ అవుతూ సోషల్ మీడియాను షేక్ చేసిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించనప్పటికీ దూరం అయ్యారని పలు పుకార్లు షికారు చేస్తున్నాయి. ఈక్రమంలోనే శర్వా అలాంటి ఫొటోలు పెట్టడంతో భార్య దూరం అయిందని బాధపడుతూ అలా సన్నగా అయ్యాడని అంటున్నారు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com